RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers



28.04.2024 ఆదివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ. 2.00 | సంపుటి:19 | సంచిక:280

## సీపీఎం నేతలతో సీఎం రేవంత్ భేటీ



హైదరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సిపిఎం నేతలతో భేటీ అయ్యారు.తరువాత అయన మట్లాడుతూ సీపీఎం నాయకులతో చర్చించాం. భువనగిరి పార్లమెంట్ తో పాటు ఇతర స్థానాల్లోనూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరాం. మరి కొన్ని రాజకీయ ప్రతిపాదనలు కూడా వారి ముందు పెట్టాం. బీజేపీ శక్తులను ఓడించేందుకు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చేందుకు వారు అంగీకరించారు. దేశంలోనూ ఇండియా కూటమితో కలిసి పనిచేయనున్నారు. ఒకట్రెండు విషయాల్లో సందిగ్ధత ఉన్నా... అధిష్టానంతో చర్చించి రేపటిలోగా ఏకాభిప్రాయానికి వస్తాం. సీపీఎం సహకారంతో భవిష్యత్ లో ముందుకెళతాం.ఈ కలయిక రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపునకు పనిచేస్తుందని భావిస్తున్నాని అన్నారు...

## హెలికాప్టర్లో పడిపోయిన మమతా బెనర్జీ .. స్వల్ప గాయాలు



కోల్ కతా ఏప్రిల్ 27 పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శనివారం దుర్గాపూర్ లో హెలికాప్టర్లో పడిపోయింది. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. ఆమె భద్రతా సిబ్బంది ఆమెను సకాలంలో కాపాడారు. ఆ తర్వాత ఆమె మళ్లీ అసనోల్ కు తన పయనాన్ని కొనసాగించారు. ఆమె ఎన్నికల ర్యాలీకై కుల్టీ వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. తర్వాత ఆమె కుల్టీకి వెళ్లి ర్యాలీలో ప్రసంగించారు. అక్కడ టిఎంసి అసన్ సోల్ అభ్యర్థి శత్రుఘ్న సిన్హా కు మద్దతుగా ప్రచారం చేశారు. ఆమె గాయపడ్డం ఆరు వారాల్లో ఇది రెండో సారి. ఇదివరలో మార్చి 14 ఆమె తన ఇంట్లో పడిపోయి గాయపడ్డారు.“ ముఖ్యమంత్రి హెలికాప్టర్ లో కూర్చోబోయే ముందు బ్యాలెన్స్ తప్పి పడ్డారు. ఆమె ప్రస్తుతం బాగానే ఉన్నారు” అని ఆమెతో పాటు వెళుతున్న సీనియర్ అధికారి ఓ వార్తా సంస్థకు తెలిపారు.

## ఈటలను మునగ చెట్టు ఎక్కించి కింద పడేయాలనేది మల్లారెడ్డి వ్యూహం

### మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్ ఏప్రిల్ 27 మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానంలో ఈటల రాజేందర్ గెలవబోతున్నారని ఎమ్మెల్యే మల్లారెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మల్లారెడ్డి తన రాజకీయం అనుభవంతోనే ఈటలపై ఆ కామెంట్స్ చేశారని పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్ చాట్ చేశారు.ఈటల రాజేందర్‌ను మునగ చెట్టు ఎక్కించి కింద పడేయాలనేది మల్లారెడ్డి వ్యూహమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ విషయంలో మల్లారెడ్డి తన రాజకీయ అనుభవాన్ని చాటుకున్నారని తెలిపారు. మల్కాజ్‌గిరిలో కచ్చితంగా గెలిచేది బీఆర్ఎస్సే. అది ఈటల రాజేందర్‌కు కూడా తెలుసు. మల్లారెడ్డి అన్న మాట అంతరార్థం తెల్వక కొంతమంది ఆగమాగమవుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

వారందరినీ కచ్చితంగా ఓడిస్తాం..

కొంతమంది నాయకులు స్వార్థం కోసం పార్టీ నుంచి వెళ్లిపోయిన సరే? శ్రేణులు అంతా వెళ్లడం అసాధ్యమన్నారు కేటీఆర్. బీఆర్ఎస్‌లోనే తనకు గౌరవం ఉండేదని పార్టీ మారిన తర్వాత ఈటల రాజేందర్ చెప్పిన మాటను గుర్తుంచుకోవాలి. పార్టీ మారిన కేకే, రంజిత్ రెడ్డి పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసు. కష్టకాలంలో పార్టీతో ఉన్నవాడే నాయకుడు అవుతాడు. పారిపోయిన వాళ్లు లీడర్లు ఎలా అవుతారు? పార్టీకి ద్రోహం చేసి వెళ్లిన నాయకులను ఓడించేందుకు ఎక్కువగా కష్టపడతాం. వారందరినీ కచ్చితంగా ఓడిస్తాం. పార్లమెంట్ ఎన్నికల తర్వాత పార్టీని బలోపేతం చేస్తాం.. పార్టీ శిక్షణ కార్యక్రమాలతో పాటు పార్టీ నిర్మాణంపైన దృష్టి పెడతామన్నారు కేటీఆర్.

# సోనియాగాంధీని విమర్శించే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదు: పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



సంగారెడ్డి, ఏప్రిల్ 27 సోనియాగాంధీని విమర్శించే నైతిక హక్కు బీజేపీ నాయకులకు లేదని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్? జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. సోనియా, రాహుల్? గాంధీ కుటుంబం దేశ ప్రజల కుటుంబమని, వారు దేశం కోసం చేసిన త్యాగాలు మరెవరూ చేయలేదన్నారు. ఉపాధి హామీ పథకం అంటే గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అక్షయ పాత్రలాంటిదన్నారు. సోనియా గాంధీ యూపీఏ ఛైర్?పర్సన్?గా ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. మోదీ వచ్చిన తర్వాత అనవసరమైన నిబంధనలు పెట్టి పథకాన్ని రద్దు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ పేద ప్రజలకు శాపంగా మారారని, పీవీ నరసింహారావుని ప్రధానమంత్రిని చేసింది సోనియాగాంధే అని పేర్కొన్నారు.

గాంధీ కుటుంబం అధికారంలో ఉన్నప్పుడల్లా పేద ప్రజలకు ఉపయోగపడే పథకాలను ప్రవేశ పెట్టారు. ప్రభుత్వ నిధులు కూడా నిరుపేదలకు అందే విధంగా పథకాలను తీసుకువచ్చారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం దేశంలో ఉన్న అన్ని గ్రామీణ ప్రాంతాల్లో అక్షయ పాత్రలా ఉంది. కేటీఆర్? దమ్ములేని అభ్యర్థులను ఎందుకు ఎన్నికల్లో నిల్పోబెట్టావు. అధికారం కోల్పోయి, ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్, కేటీఆర్ ఫ్రస్ట్రేషన్?లో ఉన్నారు. వీరితో పాటు హరీశ్ రావు ముగ్గురు కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించాలి. మహిళలు పథకాల వల్ల ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే తెలుసుకొని మాకు చెప్పండి. అని అన్నారు కాంగ్రెస్ ఇచ్చిన ప్రభుత్వ సంస్థలను మోదీ అమ్మేశారుసీఎం విమర్శించారు సోనియా 22 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షురాలిగా వ్యవహరించారని, ప్రధాని కావాలనుకుంటే ఆమె రెండు పర్యాయాలు అయ్యేవారని వివరించారు. ఆర్ఎస్ఎస్ నాయకుడు స్క్రిప్ట్ రాసిస్తే కిషన్? రెడ్డి చదువుతారని, ఆయన స్క్రిప్ట్ లీడర్ అని ఎద్దేవా చేశారు. వారికి హిందూ సంప్రదాయం గురించి తెలియదని ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్రాల అధ్యక్షులందరూ డమ్మిలేనని విమర్శించారు. ఎల్? కే అద్వానీ భిక్షతో నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్?, కేటీఆర్? ఫ్రస్ట్రేషన్?లో ఉన్నారని చెప్పారు. ఈ ముగ్గురు ఆర్టీసీ బస్సులు ఎక్కి పథకాల గురించి మహిళలను అడిగి చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ దమ్ములేని వ్యక్తులను పార్లమెంట్? ఎన్నికల్లో నిలబెట్టారని వ్యాఖ్యానించారు.

## రుతుపవనాల సీజన్ తర్వాతే ఆహార వస్తువుల ధరలు తగ్గుముఖం

### అంచనా వేసిన ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూ ఢిల్లీ ఏప్రిల్ రుతుపవనాల సీజన్ తర్వాతే ఆహార వస్తువుల ధరలు తగ్గుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. నెలవారీ ఆర్థిక సమీక్ష నివేదికలో ప్రభుత్వం ఈ విషయాన్ని పేర్కొన్నది. భారత వాతావరణశాఖ ఈ సారి సాధారణం కంటే ఎక్కువగా వర్షాపాతం ఉంటుందని అంచనా వేసిన విషయం తెలిసిందే. వర్షాపాతం ఎక్కువ నమోదైతే పంటల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని నివేదిక పేర్కొంది. వర్షాలతో దిగుబడులు అధికంగా వచ్చే అవకాశాలుంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ నెలవారీగా సమీక్షలో పేర్కొంది. భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 8.7శాతం ఉండగా.. మార్చి నాటికి 8.5 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణం పెరుగుదలకు కూరగాయలు, పప్పుల ధరలు పెరగడం ప్రధాన కారణం.అయితే, ధరల నియంత్రణకు కేంద్రం చర్యలు చేపట్టింగి. హోర్డింగ్స్‌ను నిరోధించడంతో పాటు స్టాక్ పరిమితులను నిర్ణయించడం, బఫర్ స్టాక్‌ను బలోపేతం చేస్తూ.. మార్కెట్‌కు విడుదల చేస్తూ వచ్చింది. అదే సమయంలో ఇతర దేశాలను నుంచి దిగుమతులను సైతం సులభతరం చేసింది. ధరలను కట్టి చేసేందుకు రిటైల్ అవుట్‌లెట్స్ ద్వారా క్రమబద్ధీకరించింది. పప్పు దినుసులను దిగుమతి చేసుకునేందుకు దీర్ఘకాలికఒప్పందాల కోసం బ్రెజిల్, అర్జెంటీనా ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బ్రెజిల్ నుంచి 20వేల టన్నులు పెసరపప్పు దిగుమతి కానున్నది. అర్జెంటీనా నుంచి కందుల దిగుమతి చర్చలు జరుపుతున్నది. ఈ చర్చలు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి.

అదే సమయంలో మొజాంబిక్, టాంజానియా, మయన్మార్ ప్రభుత్వాలతో పప్పుల దిగుమతికి ఒప్పందం కుదుర్చుకున్నది. ఇదిలా ఉండగా.. ఇటీవల క్రిసిల్ నివేదిక సైతం జూన్ తర్వాత కూరగాయలు తగ్గుతాయని పేర్కొంది. భారత వాతావరణ శాఖ నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసిందని పేర్కొంది. జూన్ వరకు సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తుందని నివేదిక తెలిపింది.

# అంబర్పేట్ లో దానం నాగేందర్ పాదయాత్ర

### అంబర్పేట్ నియోజకవర్గంలో జోరుగా సాగిన కాంగ్రెస్ పార్టీ లోక్ సభ ఎన్నికల ప్రచారం.

శనివారం నాడు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లోని అంబర్పేట్ నియోజకవర్గం లో మాజీ పార్లమెంట్ సభ్యుడు వి. హనుమంతరావు అంబర్పేట్ నియోజకవర్గం ఇంచార్జ్ మరియు ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి ఆధ్వర్యంలో, అంబర్పేట్ డివిజన్లో సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిందిగా కోరుతూ, ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ







యొక్క ఐదు గ్యారంటీలను వివరిస్తూ ,చేతి గుర్తుకే ఓటు వేయవలసిందిగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంబుల శ్రీకాంత్‌గౌడ్ ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు దిడ్డి రాంబాబు రమేష్ ,మహిళా నాయకురాలు ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# 9 ముఖ్య హామీలతో వైసిపి మేనిఫెస్టో-2024 విడుదల!



తాడేపల్లి ఏప్రిల్ 27 ఆంధ్రప్రదేశ్ లో వైసిపి రెండు పేజీల మేనిఫెస్టోను ముఖ్యమంత్రి వైఎస్. జగన్ విడుదల చేశారు. అందులో ఇళ్ల స్థలాలు లేని అర్హులైన వారందరికీ ఇళ్లు, వైఎస్సార్ చేయూత నాలుగు విడతల్లో రూ. 75 వేల నుంచి రూ. లక్షా 50 వేలకు పెంపు, రైతు భరోసా రూ. 13500 నుంచి 16000కు పెంపు, వైఎస్సార్ ఈబిసి నేస్తం నాలుగు దఫాల్లో 45 వేల నుంచి లక్షా 5 వేలకు పెంచుతామన్నారు.ఆటో, ట్యాక్సీ, లారీలు కొనుగోలు చేసేవారికి వడ్డీ రాయితీ, రెండు విడతల్లో పింఛను రూ. 3000 నుంచి రూ. 3500కు పెంపు, 2028లో జనవరిలో మరో రూ. 250 పింఛను పెంపు,లారీ , ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా, కౌలు రైతులకు కూడా రైతు భరోసా, యూనివర్శిటీల్లో బ్యాక్ లాగ్ లో ఉన్న 3590 పోస్టుల భర్తీ, మత్స్యకారుల భరోసాను ఐదేళ్లలో రూ. 50 వేల నుంచి రూ. లక్షకు పెంచారు. ప్రతి జిల్లాలో నైపుణ్యం కోసం స్కిల్ డెవలప్మెంట్ హబ్,అమ్మ ఒడి రూ. 15 వేల నుంచి రూ. 17 వేలకు పెంచారు, వాహన మిత్రను ఐదేళ్లలో 50 వేల నుంచి లక్షకు పెంచారు, ఐదేళ్లలో ఓబిసి నేస్తం అమలుచేస్తామన్నారు.చేయగలిగినవి మాత్రమే చెబుతున్నాం అన్న ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి. మేనిఫోస్టో ప్రతి ప్రభుత్వ అధికారి వద్ద ఉందన్నారు. మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథం అని అభిప్రాయపడ్డారు. 2019లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామన్నారు. తమ మేనిఫెస్టో అమలు చేసిన తీరు చరిత్రలో నిలిచపోతుందన్నారు. రూ. 2 లక్షల 70 వేల కోట్లను డిబిటి చేశామని తెలిపారు. నేరుగా ప్రజల ఖాతాల్లో డబ్బు వేశామన్నారు. తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ లో ఏపి సిఎం జగన్ 2024 మేనిఫెస్టో విడుదల చేశారు. రెండు పేజీల మేనఫెస్టోలో 9 హామీలు ఇచ్చరు. విద్య, వైద్యం, వ్యవసాయం, ఉన్నత విద్య, అభివృద్ధి, పేదలకు ఇల్లు, నాడు నేడు, మహిళా సాధికారత, సామాజిక భద్రత(సోషల్ సెక్యూరిటీ) అనేవి ఇందులో ఉన్నాయి.

ప్రజాబలం

28.04.2024 ఆదివారం

# కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

సిద్దిపేట జిల్లా కేంద్రం లోని జిల్లా పార్టీ కార్యాలయం లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావుపార్టీ జెండా ఆవిష్కరణ చేసారు

ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతు 2001 ఏప్రిల్ హైదరాబాద్ జలా దృశ్యం తో ప్రారంభమైన గులాబీ జెండా ప్రస్తానం. నేడు దేశానికి ఆదర్శం అయింది. కొనాయి పల్లి వెంకటేశ్వర ఆలయంలో పూజలు చేసిన మూడింటికి రాజీనామా చేసి ఉదయం ప్రారంభం. కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు. మన పథకాలను కేంద్ర ప్రభుత్వం కూడా అమలు చేసింది. రైతు బంధు పథకాన్ని కేంద్రంలో బీజేపీ కాపీ కొట్టి అమలు చేశారు.కేసీఆర్ అభివృద్ధి ఆదర్శం ఉంటే, రేవంత్ రెడ్డి తిట్లలో ఆదర్శంగా ఉన్నారు.మన ఎమ్మెల్యేలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నాడు రేవంత్ రెడ్డి. ఇచ్చిన హామీలు అమలు చేయాలని నేను రాజీనామా చేస్తానన్న. నాడు రాజీనామా చేయకుండా ఉన్న వ్యక్తి కిషన్ రెడ్డి. రాజీనామా కోసం జిరాక్స్ పేపరు ఇచ్చిన వ్యక్తి రేవంత్ రెడ్డి, తప్పించుకొని తిరిగిన వ్యక్తి కిషన్ రెడ్డి. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే నేను రాజీనామా కు సిద్ధంగా ఉన్నాను. సొల్లు కాదు.. సీదా మాట్లాడు.. సూటిగా మాట్లాడు. స్పీకర్ పార్మట్ లో ప్రెస్ అకాడమీ చెర్మెన్ శ్రీనివాస్ రెడ్డి కి పంపించు, నేను 5నిముషాల్లో పంపిస్తాను. నాకు పదవులు ముఖ్యం కాదు రైతులు, ప్రజల ప్రయజనాలు ముఖ్యం. నాడు ఓటు కు నోటు, నేడు దేవుళ్లపైన ఒట్లు. ఆగస్టు 15 లోపు రుణమాఫీ, గ్యారెంటీ లు అమలు చేస్తావో లేదో చెప్పు రేవంత్. నేను రుణమాఫీ చెయ్యాలని అడుగుతే కాంగ్రెస్ మంత్రులు నన్ను తిడుతున్నారు. మీ తిట్లను ప్రజలు గమనిస్తున్నారు. హామీలు అమలు అయ్యే వరకు నేను పోరాటం చేస్తునే ఉంటా. జిల్లాను తొలగిస్తాని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. సిద్ధిపేట జిల్లాలను ఉడగోట్టాలని చూస్తున్నారు. జిల్లాలు ఉండాలంటే పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ బుద్ధి చెప్పాలి... అన్ని జిల్లాల కేంద్రాల ప్రజలను కోరుతున్నానని అన్నారు.

## వలస బాటలో యువత...

మన దేశంలో యువత పెరుగుదల రేటు శాతంకు, ఉపాధి అవకాశాల పెరుగుదల రేటుకు మధ్య చాలా వ్యత్యాసం ఉన్నది. అందువల్లే మన యువత విదేశీ బాట పట్టాల్సిన పరిస్థితి వస్తోంది.దీంతో యువతపై ఆధారపడవలసి వస్తున్న వృద్ధతరం భీతిల్లుతోంది. అందుకే యువతను మన దేశ ఆర్థిక అభివృద్ధిలో క్రియాశీలకంగా పాలుపంచుకునేలా చేయడమే పరిష్కారం. ఏ ప్రభుత్వానికైనా యువతకు ఉద్యోగాల కల్పన, పని అవకాశాలు కల్పించడమే ప్రధమ ప్రాధాన్యతగా ఉండాలి. ప్రపంచ బ్యాంకు ప్రకారం భారతదేశం జనాభా నిధిని సద్వినియోగం చేసుకోవడం లేదు. పేరుకేమో యంగ్ ఇండియా అయితే, ఈ యంగ్ యువత విదేశాల పాలవుతున్నది. జనాభాలో యువత ఎక్కువగా ఉంటే జనాభా నిధి అని అంటారు. మనదేశంలో చాలామందికి భూమిగానీ, పెట్టుబడులు గానీ, స్థిరాస్తులు గానీ లేవు. 90 శాతం ప్రజలకు వారి శ్రమే వారి జీవనాధారం. అతి తక్కువ ఆదాయాలతో ఉద్యోగ భద్రత లాంటివి లేని అభద్రతాభావంతో బ్రతుకు లాగుతున్న యువత... ఈ దేశంలో మనకు ఏముందిలే, ఎక్కడికో పోయి బ్రతుకుదాములే అనుకుంటూ, ఈ దేశ ఉత్పత్తి ప్రక్రియలో తమను ఉపయోగించుకునే వారే లేరని తీవ్ర నిరాశతో ఉన్నది.

2014 ఎన్నికల్లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మాట ఏమైందో గానీ ఉన్న ఉద్యోగాలు పోయాయి. మన దేశ జీడీపీలో కుటుంబాల అప్పులు 2022-2023లో 40 శాతానికి చేరుకున్నది. ప్రజల పొదుపు శాతం మాత్రం ఐదు శాతానికి పడిపోయింది. ఇంత తక్కువ స్థాయిలో పొదుపు ఉండడం గత 47 సంవత్సరాల కాలంలో ఎప్పుడు లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలియజేస్తున్నది. 2011-12, 2019-20 మధ్య కాలంలో సగటున దేశ ప్రజల పొదుపు జీడీపీలో 7.6 శాతంగా ఉండేది. ప్రజల ఆదాయాలు క్రమంగా తగ్గిపోవడం వలన పెరుగుతున్న వినియోగ వ్యయం ఆదాయాల స్తబ్దత వలన మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు అంటుతుండడం వలన పేదల వాటా జీడీపీలో క్రమంగా తగ్గిపోతున్నది. ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ వారి ప్రకారం 34 వంతు ప్రజలు పోషక ఆహార లోపంతో ఉన్నందువలన గత్యంతరం లేక మన పాలకులు 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం, 50 కోట్ల మందికి ఉచిత ఆరోగ్య కార్డులు ఇవ్వాల్సి వస్తోంది.మన యువతకు మన దేశంలోనే ఉద్యోగాలు దొరకకపోవడం వల్లనే కదా విదేశాలకు పరుగులు తీస్తున్నారు. మన పాలకులు మాత్రం ఓట్ల కోసం కోట్లు కోట్లు అప్పులు చేసి ఉచితాలపై రాయితీలపై సబ్సిడీలపై వ్యయం చేస్తున్నారు ఐక్యరాజ్య సమితి ప్రపంచ వలస రిపోర్టు 2022 ప్రకారం 1990 నుండి 2020 వరకు మన దేశం నుంచి 1.80 కోట్ల మంది వలసపోయారు. 2020 నాటికి ఒక్క అమెరికాలోనే 27 లక్షల మంది మనవారు స్థిరపడ్డారు. అమెరికాలో 45 లక్షల మంది, 25 లక్షలు, సౌదీలో 34 లక్షల మంది భారతీయులు స్థిరపడ్డారు, వీరు అధికంగా ఆయిల్ నిక్షేపాలున్న యునైటెడ్ అరబ్ దేశాల్లో పనిచేస్తున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం 3.2 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వెళ్లిపోయి ఓవర్సీస్ ఇండియన్స్‌గా ఉన్నారు. ప్రతి సంవత్సరం 25 లక్షల మంది భారతీయులు విదేశాలకు వలస పోతున్నారు. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద వలస అని చెప్పాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు దేశ ఆర్థిక అభివృద్ధి ఎలా జరుగుతుంది?సాధారణంగా తమ పిల్లలను బాగా చదివించగలిగితే తమ కుటుంబాలు బాగుపడతాయని తల్లిదండ్రులు భావిస్తారు. అయితే వారి ఆదాయ స్థాయి అంతంత మాత్రమే. అటువంటప్పుడు ప్రభుత్వాలే యువతకు కావలసిన సౌకర్యాలపై అంటే విద్య వైద్యం సాంకేతిక పరిజ్ఞానం తదితర వాటిపై ఖర్చుపెట్టి వీరిని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవాలి. 2040 నాటికి మన జనాభాలో 59 శాతం మంది యువకులే ఉంటారు. మీరు మన దేశ అభివృద్ధికే కాకుండా ప్రపంచ దేశాల అభివృద్ధికి కూడా తోడ్పడుతూ, ప్రపంచానికే మెరిసే స్టార్స్ లాగా ఉంటారు. అయితే వారికి కావాల్సిన విద్య, వైద్య, ఆహారం తదితర వాటిపై ఖర్చు చేసే వారేరి. ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం భారతదేశంలో పని చేసే వయసు వారు (15-59) 2011లో 61 శాతం ఉండగా 2021 నాటికి 64 శాతానికి పెరిగింది. మన యువతలో ప్రతి సంవత్సరం 8 మిలియన్ల మంది ఉద్యోగాల కోసం ఎగబడుతున్నారు. అయితే ఆర్థిక కార్యకలాపాలలో వీరి శాతం 2011లో 52 శాతంగా ఉండగా, 2021 నాటికి 37 శాతానికి పడిపోయింది. 2022 లో నిరుద్యోగ యువత మొత్తం నిరుద్యోగులలో 82.9 శాతం అని ఈ నివేదిక తెలియజేసింది.జనాభాలో పనిచేసే వయసులో ఉన్న వారి శాతం పెరుగుతుంటే యువశక్తి పెరుగుదలకు చిహ్నం. ఆర్థిక అభివృద్ధిలో క్రియాశీలకంగా పాలుపంచుకునేది దేశాన్ని మునుముందు నడిపించేది యువతే. అటువంటిది వారే నిరాశ నిస్పృహలతో పని పాట లేకుండా ఉంటే ఈ దేశానికి దిక్కెవరు? పాలకులు నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేస్తున్నందున యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోతున్నారు. మన పాలకులు వ్యవహరించే విధానాల వలన కోట్లకొలది యువతీ యువకులు నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. దీనివల్ల కుటుంబం సమాజం దేశం అశాంతికి గురవుతోంది. యువతలో నూతన ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించే అలాంటి విధాన కార్యక్రమాలు రూపొందించి చేపడితే, పాలకులు త్రికరణ శుద్ధిగా యువతీ యువకులను అధునాతన ప్రపంచంలో మమేకం చేయగలిగితే, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కాలాన్ని మించిన వేగంతో యువత పరిగెత్తగలదు. డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువత వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వైనం పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. జనాభా నిధిగా ఉన్న యువతను మన దేశ ఆర్థిక అభివృద్ధిలో క్రియాశీలకంగా పాలుపంచుకునే విధంగా చేయనిదే ప్రపంచ దేశాలలో మనదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కావడం అసంభవం.

## హస్తం తోనే దేశంలో మార్పు సాధ్యం...

### రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం - ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్

### బలరాం నాయక్ ని ఆశీర్వదించండి - ఎమ్మెల్యే మురళి నాయక్

మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈరోజు నెల్లికుదురు మండల మేచరాజుపల్లి గ్రామంలో మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ మరియు మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ ప్రచారం చేసి హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెల్పిస్తే రాహుల్ గాంధీ గారు ప్రధాని కావడం ఖాయం అని తెలిపారు.అనంతరం 100 రోజుల పని దగ్గర వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది జాతీయ ఉపాధి హామీ కూలీలకు రోజు వారి వేతనం రూ 400 ఇస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా,బ్లాక్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,ప్రజాప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రెండు విడతల్లో పెన్షన్ పెంపు



తాడేపల్లి ఏప్రిల్ 27 : ఆంధ్రప్రదేశ్ లో వైసిపి రెండు పేజీల మేనిఫెస్టోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విడుదల చేశారు. తొమ్మిది ప్రధాన హామీలతో మేనిఫెస్టోను విలీజ్ చేసిన జగన్.. చేయగలిగిన హామీలను మాత్రమే ఇస్తున్నామని చెప్పారు. వృద్ధులకు పెన్షన్ ను పెంచనున్నట్లు తెలిపారు.అయితే రెండు విడతల్లో ఈ పెన్షన్ నుంచి రూ. 3000 నుంచి రూ. 3500కు పెంచుతామన్నారు. 2028లో జనవరిలో రూ. 250 పెన్షన్ పెంచుతామని.. 2029 జనవరిలో మరో రూ.250 పెన్షన్ ను పెంచుతామని ఆయన చెప్పారు. ఇక, అర్హులైన వారందరికీ ఇళ్ల పంపిణీ స్కీమ్ కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ పార్టీకి మాజీ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సవాల్

### ఆరు గ్యారంటీలు అమలు చేసామాని నిరూపిస్తేనిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా

హైదరాబాద్ ఏప్రిల్ 27 కాంగ్రెస్ పార్టీకి మాజీ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ మోసగించిందని ఆయన ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. తమ మేనిఫెస్టో ఖురాన్, బైబిల్, భగవద్గీత అని చెప్పారు. హామీలు నిలబెట్టుకోలేదని బిఆర్ఎస్ పార్టీని ప్రజలు బొంద పెట్టారని బండి స్పష్టం చేశారు. మహిళల ఖాతాల్లో రూ. 2500 జమచేసినట్లు, ఆసరా పింఛన్లు రూ. 4వేలు ఇచ్చామని, విద్యార్థులకు భరోసా ఇచ్చామని నిరూపించాలి ఆయన డిమాండ్ చేశారు.అమలు చేసినట్లు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకోవడానికి తాను సిద్ధం అన్నారు. నిరూపించలేకపోతే మీరందరూ పోటీ నుంచి తప్పుకుంటారా? అని ప్రశ్నించారు. ఎల్లుండి వరకు నిరూపిస్తే నామినేషన్ విత్ డ్రా చేసుకుంటామని తెలిపారు. నిరూపించలేకపోతే 15 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ నుంచి తప్పుకుంటుందా? అని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు.

## నల్లగొండ కాంగ్రెస్ లో కల్లోలం..

నల్లగొండ జిల్లా పరిధిలోని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ భార్గవ్.. 24 రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపా దాస్ ముంచి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. దీనిపై స్థానిక కాంగ్రెస్ నేతలంతా వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకోవడంతో.. టిపిసిసి నేతలు ఆలోచనలో పడ్డారు. వెంటనే .. చేరికపై.. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (తెలంగాణ ఇన్చార్జ్) దీపా దాస్మున్షి నిలుపుదల చేశారు. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు జరిపిన తర్వాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అందువల్ల, మిర్యాల్గూడ మున్సిపల్ చైర్మన్ టి.భార్గవ్ చేరిక తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు తాత్కాలికంగా నిలిపివేయబడిందని.. టిపిసిసి వర్గాలు తెలిపారు.

## వరుణ్ తేజ్ కి ఘన స్వాగతం

పిఠాపుం జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పోటీ చేస్తోన్న పిఠాపురం నియోజకవర్గంలో ప్రచారం నిమిత్తం విచ్చేసిన ప్రముఖ సినీ హీరో, మెగా ప్రిన్స్ కొణిదెల వరుణ్ తేజ రికి శనివారం రాజమండ్రి విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. చిరంజీవి యువత అభిమాన సంఘాల నాయకులు ధర్మేంద్ర, బాబీ ఏడిద నేతృత్వంలో అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు. వరుణ్ తేజ్ గొల్లప్రోలు రూరల్ మండలం తాటిపర్తిలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రచారం మొదలు పెట్టి వన్నెపూడి మీదుగా కొడవలి, చందుర్తి మీదుగా దుర్గాడ చేరుకున్నారు.

## విస్తృతంగా పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బద్వేలు కాంగ్రెస్ అభ్యర్థి విజయ జ్యోతి



బద్వేలు కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా శనివారం బద్వేలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయ జ్యోతి ఓట్లు వేయాలని ప్రచారం చేశారు ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు కోరారు ఎమ్మెల్యే అభ్యర్థి తనకు కడప ఎంపీ అభ్యర్థి షర్మిలారెడ్డికి ఓట్లు వేయాలని ఆమె కోరారు సుందరయ్య కాలనీ, కమలమ్మ నగర్ లో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పగడాల నరసింహారావు ఆధ్వర్యంలో ఇంటింటికి కాంగ్రెస్ అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికి వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే సంక్షేమ పథకాల గురించి ప్రతి ఇంటికి వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అచ్యుతరాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘురామిరెడ్డి, జకరయ్య , అంజి , ఇతర కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మరియు సిపిఎం పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## నైనితాల్ లో చెలరేగిన కార్చిచ్చు

### మంటలను ఆర్పడానికి రంగంలోకి దిగిన భారత వాయుసేన, సైన్యం



నైనితాల్ ఏప్రిల్ 27 : ఉత్తరాఖండ్ లోని నైనితాల్ లో కార్చిచ్చు చెలరేగింది. మంటలను ఆర్పడానికి భారత వాయుసేన, సైన్యాన్ని రంగంలోకి దించారు. 36 గంటలపాటు కొనసాగుతున్న ఈ అటవీ కార్చిచ్చు అనేక హెక్టార్ల పచ్చదనాన్ని బూడిద చేసేసింది. జిల్లా అధికారులు మంటలార్పడానికి హెలికాప్టర్లు కావాలని కోరుతున్నారు.హల్ద్వాని జిల్లాలో నైనితాల్ కార్చిచ్చుపై చర్చించేందుకు సమావేశాన్ని నిర్వహించబోతున్నట్లు ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. అటవీ కార్చిచ్చు నైనితాల్ లోని హైకోర్టు కాలనీకి కూడా ముప్పుగా మారింది. మంటలు ఆర్పేయాలని ముఖ్యమంత్రి అన్ని సంబంధిత శాఖలను కోరారు. కార్చిచ్చు భారత సేన స్థావరాల వరకు అంటే పైన్స్ ఏరియా వరకు ప్రమాద స్థాయిలో విస్తరిస్తోంది. నైనితాల్ అటవీ శాఖ ఇప్పటికే మంటలార్పేందుకు 40 మంది సిబ్బందిని రంగంలోకి దింపింది.

## ఓగసవారా దీవులలో 6.9 తీవ్రతతో కుదిపేసిన భూకంపం

టోక్యో ఏప్రిల్ 2 జపాన్ లోని బోనిన్ దీవులు లేక ఓగసవారా దీవులలో శనివారం 6.9 తీవ్రతతో భూకంపం కుదిపేసింది. ఈ విషయాన్ని ఆ దేశ వాతావరణ సంస్థ తెలిపింది. భూకంపం సాయంత్రం 5.36 గంటలకు (08.36 గ్రీన్విచ్ మీన్ టైమ్)కు సంభవించిందని, ఇది 540 కిమీ. లోతుతో, 7 సీస్మిక్ ఇంటెన్సిటీ స్కేల్ లో 3గా నమోదయిందని జపాన్ వాతావరణ సంస్థ తెలిపింది. టోక్యోకు దక్షిణాన 875 కిమీ. దూరంలో పశ్చిమ కోస్తాలో భూకంపన కేంద్రం నమోదయింది. దీనివల్ల టోక్యోలో బలహీన కంపనాలు వచ్చాయి. ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ కాలేదు.

# డ్వర్టయిజింగ్ దిగ్గజం ఏజీకే

మానవులు పుడతారు. చనిపోతారు . కొంతమంది మాత్రమే తమ జీవితంలో మేథో మథనంతో, స్వయం కృషితో, ప్రజలకు గుర్తుండే, పనులు చేసి, చిరస్థాయిగా నిలిచి పోతారు. ప్రచార రంగంలో అలాంటి కృషి చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన వ్యాపార దిగ్గజం ఎ.జి.కృష్ణమూర్తి. దేశంలోనే ప్రచార రంగంలో తనదైన ముద్ర వేసుకున్న 'ముద్ర' వ్యవస్థాపకుడు ఎ.జి.కృష్ణమూర్తి. ముద్రా కమ్యూనికేషన్స్ సంస్థాపక అధ్యక్షుడు ఎ. జి. కృష్ణమూర్తి. కేవలం 35 వేల నగదు తో, ఒకే ఒక క్లయింట్ తో వ్యాపార ప్రకటనా సంస్థ స్థాపించి, కేవలం తొమ్మిదేళ్ళల్లో ముద్రా భారతదేశంలో ఉన్న పెద్ద వ్యాపార ప్రకటనా సంస్థలలో మూడవ స్థానాన్ని, స్వదేశీ వ్యాపార ప్రకటనా సంస్థలలో ప్రథమ స్థానాన్ని చేరుకునేలా కృషి చేశారు. ప్రభుత్వంలో చిన్న గుమస్థా ఉద్యోగంతో ప్రారంభించిన ఎ. జి. కె. తెలుగువారు గర్వించదగ్గ అతి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ధీరూభాయ్ అంబానీకి అతి చేరువలో ఉండి ఈ సంస్థని ఇంత త్వరగా ఉన్నత స్థాయికి లేవనెత్తి ఆయనచేత శభాష్ అనిపించు కున్నారు. ఎ.జి.కృష్ణమూర్తి (అచ్యుతాని గోపాల కృష్ణమూర్తి) 1942, ఏప్రిల్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. అయన ముద్రా కమ్యూనికేషన్స్ సంస్థాపక అధ్యక్షులు. తెలుగువారు గర్వించదగ్గ వ్యాపార దిగ్గజం.

ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి చరిత్రలో బి.ఏ హానర్స్ పట్టా పుచ్చుకొని 1968లో 60, 70వ దశకాలలో వస్త్ర పరిశ్రమలో బాగా పేరున్న కాలికో మిల్స్ లో గిరాబెన్ సారాభాయికి సహాయకుడిగా చేరారు. 1972లో అదే కంపెనీకి చెందిన వ్యాపార ప్రకటన సంస్థ అయిన "శిల్పా అడ్వర్టైజింగ్" లో అకౌంట్ ఎగ్జిక్యూటివ్ గా పదోన్నతి పొందారు. 1976లో రిలయన్స్ సంస్థలకు ఆడ్వర్టైజింగ్ మేనేజరుగా చేరి, నాలుగు సంవత్సరాలు తిరక్కుండానే సొంత వ్యాపార ప్రకటనా సంస్థ "ముద్రా కమ్యూనికేషన్స్" ను 1980, మార్చి 25న స్థాపించారు. రిలయన్స్ సంస్థ ప్రధాన కార్యాలయంలో అడ్వర్టయిజింగ్ డైరెక్టర్‌గా చేరిన ఏజీకే అడ్వర్టయి జింగ్ రంగంలో శిఖర సదృశుడైన ఫ్రాంక్ సియాయిస్‌తో కలసి అద్భుతాలు చేశారు. రిలయన్స్ సంస్థ ఉత్పత్తి చేసిన సిల్కు చీరలూ, ఇతర దుస్తులకూ విమల్ బ్రాండ్‌తో ప్రకటనలు తయారు చేయడంలో ఫ్రాంక్ అనేక విన్యాసాలు చేశారు. 'ఓన్లీ విమల్' అన్నది అందరికీ, ఎప్పటికీ గుర్తు ఉండే సృజనాత్మక ప్రకటన. విమల్ కోసం తయారు చేసిన మొదటి అడ్వర్టయిజ్ మెంట్ ... "ఒక స్త్రీకి ఎన్నెన్నో మనోభావాలు". అడ్వర్టయిజ్ మెంటు రకరకాల రూపాలు సంతరించుకొని అత్యధికంగా పత్రికలలో, రేడియోలలో వచ్చి విమల్ చీరలకు అసాధారణమైన ఆదరణ తెచ్చింది.ఫ్రాంక్ సియాయిస్ సొంత ఏజెన్సీ పెట్టుకున్న తర్వాత, రిలయన్స్ ప్రత్యర్థులు ఆయన క్లయింట్లు అయిన కారణంగా రిలయన్స్ స్వయంగా ఒక అడ్వర్టయిజింగ్ ఏజెన్సీని నెలకొల్పాలనీ, దానికి 'ముద్ర' అని పేరు పెట్టాలనీ ఏజీకే చేసిన సూచనను ధీరూభాయ్ అంబానీ ఆమోదించారు. ఆయన రూ. 35 వేల నగదు తోను ఒకే ఒక క్లయింట్ తోను వ్యాపార ప్రకటనా సంస్థ స్థాపించారు. కేవలం తొమ్మిదేళ్ళల్లో ముద్రా భారత దేశంలో ఉన్న పెద్ద వ్యాపార ప్రకటనా సంస్థలలో మూడవ స్థానాన్ని, స్వదేశీ వ్యాపార ప్రకటనా సంస్థలలో ప్రథమ స్థానాన్ని చేరుకుంది. 1980లో ముద్ర వెలిసింది. ఒక వెలుగు వెలిగింది. కార్పొరేట్ రంగంలో "అడ్వర్టయింజింగ్ జీనియస్"గా ఏజీకే గుర్తింపు పొందారు. దేశ వ్యాప్తంగా విమల్ షోలు నిర్వహించి విమల్ విజయ పరంపరను కొనసాగించడంలో ఏజీకేది అద్వితీయమైన పాత్ర. 'ఐ లవ్ యూ రస్నా' కూడా ఆయన సృష్టే. ప్రభుత్వంలో చిన్న గుమస్థా ఉద్యోగంతో ప్రారంభించిన ఎ. జి. కె. తెలుగువారు గర్వించదగ్గ అతి ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ధీరూభాయ్ అంబానీకి అతి చేరువలో ఉండి ఆ సంస్థను అంత త్వరగా ఉన్నత స్థాయికి లేవనెత్తి ఆయన చేత శభాష్ అనిపించు కున్నారు. ఆయన తమ అనుభవాలను పుస్తకాల రూపంలోనూ, పత్రికా శీర్షికల ద్వారా రాసి యువతను ఉత్తేజ పరిచారు. కృష్ణమూర్తి తెలుగు పత్రికలో వారం వారం అనే శీర్షికను, ఆంగ్ల పత్రికలలో ఏజికె స్పీక్ అనే శీర్షికను రాశారు. ఆయన 'ధీరూభాయిజమ్' అనే పేరుతో తెలుగులో, ఇంగ్లీష్‌లో పుస్తకం రాశారు. 'ఎదురీత' పేరుతో మరో పుస్తకం రాశారు. వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే ఆయన రచనలను వివిధ భారతీయ భాషలలోకి అనువదించారు. 'ఇదండీ నా కథ' అనేది ఏజీకే ఆత్మకథ. అదే ఆయన చివరి రచన. అంచెలంచెలుగా ఎదుగుతూ యాడ్స్ రంగ దిగ్గజ వ్యక్తుల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్న కృష్ణమూర్తి తెలుగు, ఆంగ్లంలో 15కు పైగా పుస్తకాలు రచించారు. 2013లో ఇఫ్ యు కెన్ డ్రీమ్ పేరుతో తన ఆత్మకథను పుస్తక రూపంలో విడుదల చేశారు. ముద్రా కమ్యూనికేషన్స్ చైర్మన్‌గా పదవీ విరమణ చేసిన తర్వాత ఎ.జి.కె. బ్రాండ్ కన్సల్టింగ్‌ను స్థాపించారు. కాలమిస్టుగా, రచయితగా ఆంగ్లంలోనూ, తెలుగులోనూ పలు వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. ఆయన పుస్తకాలు అతి కొద్దికాలంలో పలు భారతీయ భాషల్లో ప్రచురింపబడి, ఎంతో మందికి స్ఫూర్తినిచ్చి ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి. ఆయన 73వ యేట ఫిబ్రవరి 5, 2016న హైదరాబాదులో మరణించారు.

# శ్రామికుల ఆరోగ్యం, భద్రత యాజమాన్యాల బాధ్యతే..!

ఐక్యరాసమితికి చెందిన 'ప్రపంచ కార్మిక సంస్థ' సౌజన్యంతో ప్రతి ఏటా 28 ఏప్రిల్ రోజున 'ప్రపంచ విధి నిర్వహణలో భద్రత మరియు ఆరోగ్య దినం'తో పాటు 'అంతర్జాతీయ కార్మికుల స్మారక దినం' జరుపు కోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ రోజున కార్య క్షేత్ర సమస్యలు, అనారోగ్య కారకాలు, ఎదురయ్యే ప్రమాదాలు, నివారణ మార్గాలు, ప్రాణ రక్షణ శిక్షణలు, ఆత్మ రక్షణ చర్యలు, గాయాలకు సత్వర చికిత్సలు, విధుల్లో ప్రాణాలర్పించిన శ్రామికుల స్మారకార్థ కార్యక్రమాలు లాంటి పలు అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగేలా కార్యక్రమాలు చేపడతారు. 2003 నుంచి ఇలాంటి అత్యవసర కార్యక్రమాలను 'ప్రపంచ కార్మిక సంస్థ (వరల్డ్ లేబర్ ఆర్గనైజేషన్, ఐయల్ఓ)' ప్రతి ఏటా చేపడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రోజు 6,300 మంది శ్రామికులు విధులు నిర్వహిస్తూ ప్రమాదంలో లేదా తీవ్ర వ్యాధులతో మరణిస్తుండగా, ఏడాదికి 2.3 మిలియన్లు ప్రాణాలొదులుతున్నారు. ఏడాదికి దాదాపు 317 మిలియన్ల ప్రమాదాలు నమోదు అవుతున్నాయి. క్షేత్ర సంబంధ ప్రమాదాలు, వ్యాధులను తగ్గించే సదుద్దేశంతో పలు దేశాలు అవసర చర్యలు చేపట్టాలని 2017లో ప్రపంచ కార్మిక సంస్థ విజ్ఞప్తి చేసింది. 2030 నాటికి ప్రపంచ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-17 సఫలం కావడానికి పేదరిక నిర్మూలన, భూగ్రహాన్ని కాపాడుకోవడం, ఆర్థిక ప్రగతి సాధనలకు చర్యలు చేపట్టాలి. 28 ఏప్రిల్ రోజున 'అంతర్జాతీయ కార్మికుల స్మారక దినం' కూడా జరుపుకోవడం పరిపాటిగా వస్తున్నది. 01 మే రోజున "కార్మిక దినం" జరుపుకోవడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్న సందర్భమిది.

కోవిడ్ మహమ్మారి ప్రభంజనానికి ప్రభుత్వాలు, ఉద్యోగులు, శ్రామికులు, సాధారణ ప్రజానీకం అనేక సవాళ్ళను ఎదుర్కోవడంతో పాటు కార్యక్షేత్రంలో అసాధారణ అనారోగ్య పరిస్థితులను అనుభవించారు. వైరస్ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉద్యోగ శ్రామిక వర్గాల ఆరోగ్య పరిరక్షణ, భద్రతలకు సంబంధించిన పలు సమగ్ర చర్యలు తీసుకోవలసిన కనీస బాధ్యత యాజమాన్యాల మీద ఉంది. కార్య క్షేత్రంలో పని చేస్తున్న సిబ్బంది సంపూర్ణ ఆరోగ్య, భద్రతలకు సంబంధించిన చర్యలు తీసుకోవడానికి 'నేషనల్ అక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ సిస్టమ్'ను ఏర్పాటు చేసి కార్మిక, శ్రామిక, భద్రత, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు మార్గనిర్దేశకాలు విడుదల చేస్తూ, పటిష్టంగా అమలు అయ్యేలా చూడాల్సిన కర్తవ్యం ప్రభుత్వ, యాజమాన్యాల మీద ఉన్నది. ఉద్యోగ శ్రామిక వర్గాలు అంకితభావంతో పని చేస్తేనే దేశ ఆర్థిక ప్రగతి రథం సక్రమంగా సాగుతుంది. విపత్కర పరిస్థితుల్లో అత్యవసర సేవలు, పారిశ్రామిక ప్రగతి కొనసాగేలా చూశారు. కరోనా అకాలంలో ఆరోగ్య పరిరక్షణ యజ్ఞంలో ప్రాణాలొడ్డి అమూల్య సేవలు అందిస్తున్న ఫ్రంట్ లైన్ వారియర్లను కాపాడుకోవలసిన కనీస బాధ్యత ప్రభుత్వాలతో పాటు మనందరి మీద ఉందని గుర్తించాం.

మన అపార మానవ సంపదనుల విపత్తుల నుంచి కాపాడుకుంటూ, ఆర్థిక పురోగమనాన్ని కొనసాగించాలి. ముఖ్యంగా ఉద్యోగ, శ్రామిక, కార్షక, కార్మిక వర్గాల మానసిక స్థైర్యాన్ని కాపాడాల్సి ఉంది. ప్రమాదాలను పసిగడుతూ, సంక్షోభాలను సమర్థవంతంగా ఎదుర్కొనే శిక్షణలు తీసుకుంటూ, ఆరోగ్య భద్రతలను కాపాడే వ్యవస్థలను ప్రతి సంస్థ/కార్యాలయం/పరిశ్రమ/వ్యాపార/వర్తక వర్గాలు వెంటనే నెలకొల్పాలి. క్షేత్ర స్థాయిలో జరిగే ప్రమాదాలను నివారించడం, వృత్తి సంబంధ వ్యాధులను అరికట్టడం, గాయపడిన వారికి సత్వర చికిత్సలు అందించడం, భవిష్యత్తు భద్రతా చర్యలను చేపట్టడం గూర్చిన అవగాహన చేపట్టాలి. 28 ఏప్రిల్ రోజున విధుల్లో ప్రాణాలర్పించిన శ్రామిక సోదరులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించే వేదికగా 'ప్రపంచ కార్యక్షేత్రంలో భద్రత, ఆరోగ్య దినం-2024' ఉపయోగపడేలా కార్యక్రమాలను రూపొందించాలి. ఆధునిక శాస్త్రసాంకేతిక విప్లవం వల్ల ఉత్పన్నమైన నానో టెక్నాలజీ, బయోటెక్నాలజీ లాంటి ప్రక్రియలు క్షేత్రస్థాయిలో పలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. సిబ్బందిలో పెరిగిన పని భారం, ఉద్యోగాల్లో కోతతో పని ఒత్తిడి, పని క్షేత్రంలో శు చి శుభ్రత కొరవడడం లాంటి కారణాలతో ఆరోగ్యం గాల్లో దీపం అవుతున్నది. ఉద్యోగాలు, ఉపాధులు కోల్పోవడం/వేతనాల్లో కోతల వల్ల స్వయం ఉపాధులు/అవుట్ సోర్సింగ్/తాత్కాలిక కాంట్రాక్టులు పుట్టుకు రావడంతో క్షేత్రస్థాయి అనారోగ్యాలు/అభద్రతలు పెరిగాయి. రసాయన పరిశ్రమల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఆరోగ్యం అతి ప్రమాదకరం అవుతున్నది. శ్రామికులే ప్రగతిరథ కందెనలని, శ్రామిక శక్తితోనే బహుముఖీన అభివృద్ధి సాధ్యపడుతుందని మరువరాదు. విధి నిర్వహణలో ప్రమాదాలు, అకాల మరణాలు నివారించదగినవే. ప్రభుత్వాలు, స్వచ్ఛంధ సంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక సంఘాలు, సభ్య సమాజం చేయి చేయి కలిపి ఆరోగ్య భారతాన్ని, సంపూర్ణ భద్రత వలయాలను నిర్మిద్దాం.

# అజరామరాలు కాళ్ళకూరి నాటకాలు

తెలుగు నాటక రంగ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నాటకాలు... వరవిక్రయము, చింతామణి. ఆ రెండూ తెలుగు వైభవం చాటే నాటకాలు. రెండూ కూడా చలన చిత్రాలుగా రూపొంది ప్రజాదరణ పొందడం విశేషం. వరవిక్రయము అప్పటి సాంఘిక దురాచరాన్ని ఎండగడితే " చింతా మణి" సజావుగా నడిచే జీవితం ఎలా నాశనం అయిపోవచ్చో అద్దం పడుతుంది. ఆ నాటకాలను రచించి తెలుగు వారి హృదయా లలో చిరకాలం నిలిచి పోయారు కాళ్ళకూరి నారాయణరావు. నారాయణ రావు కేవలం నాటక రచయిత మాత్రమే కాదు. బహు కళా ప్రపూర్ణులు. సంఘ సంస్కర్త, మొట్టమొదటి ప్రచురణ కర్త, హరికథకులు, కవి, నటులు, నాటకకర్త, పత్రికాధిపతి, మనో రంజని అనే పత్రికను నడిపారు. నాటి సమాజంలో ఉన్న దురాచా రాలను ఎత్తి చూపించి, నాటకాలుగా మలచి, ప్రదర్శించ డమే కాక, సంఘ సంస్కరణను ఆచరణలోనూ చూపించిన మహ నీయుడు కాళ్ళకూరి నారాయణ రావు. చక్కన్ని ఒరవడి, సంస్కారం, అధర్మాన్ని నిర్భయంగా ఎదుర్కునే శక్తి, ధైర్యం, సామాజిక స్పృహ, నైతిక విలువలపట్ల విశ్వాసం, బాధ్యతలు విస్మరించిన వారిని వెన్ను తట్టి లేపడం, సాంఘిక దురాచారాలపై ధ్వజం ఎత్తడం, ఇవన్ని కలిగలిపి రూపు దిద్దుకున్న వ్యక్తిత్వం కాళ్ళకూరి నారాయణ రావుది. ఆ కాలంలో కులాంతర వివాహం చేసుకోవడమంటే పెద్ద సాహసం. కళావంతురాలిని పెళ్లి చేసుకున్నారు. తనను కులం నుండి వెలివేసినా, లెక్కచేయని సాహసి, కవితారూప తపస్వి, బహు ప్రతిభా తేజస్వి.

సంఘంలోని దురాచారాలను నాటకరాజాలుగా సృష్టించారు. చింతామణి, వర విక్రయం, మధుసేవ మొదలైన ఆయన విరచిత నాటకాలు అజరా మరమైనవి.కాళ్ళకూరి నారాయణరావు (ఏప్రిల్ 28, 1871 - జూన్ 27, 1927) నాటకకర్త, సంఘసంస్కర్త, ప్రథ మాంధ్ర ప్రచురణ కర్త, జాతీయ వాది, ఛాయా గ్రహణ వాద్యా దురంధరుడు, 'మహాకవి' బిరుదాంకితులు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరము మండలం, మత్స్యపురి గ్రామంలో 1871, ఏప్రిల్ 28 న బంగారురాజు, తల్లి అన్నపూర్ణమ్మలకు జన్మించారు. అయన రచించిన నాటకాలలో చింతామణి (1921), వర విక్రయం (1923), మధుసేవ (1926) బాగా ప్రసిద్ధిచెందినవి. వాటిని చాలా మంది నాటకాలుగా ప్రదర్శించారు. తెలుగు సినిమాలుగా కూడా నిర్మించబడి మంచి విజయం సాధించాయి. తెలుగు నాటక రంగంలో పది అత్యుత్తమ నాటకాలలో చింతామణి ఒకటి. ఆ నాటకం చాలా ప్రసిద్ధి చెందింది. 1956లో పి.ఎస్. రామకృష్ణారావు దర్శకత్వంలో ఎన్టీఆర్, భానుమతి ప్రధాన పాత్రలుగా భరణి స్టూడి యోస్ బ్యానర్ పై సినిమాగా నిర్మించారు. "చింతామణి " నాటకం తెలుగు నాటక రంగాన్ని ఓ ఊపు ఊపింది. ఒక వ్యసనం వ్యక్తిని ఎంత హీన స్థితికి దిగజారుస్తుందో, పర్యవసానాలు ఎంత దారుణ ముగా ఉంటాయో ప్రతిబింబం చారు. ఆ నాటకానికి కనీ వినీ ఎరుగని ఆదరణ లభించింది. ఆదాయానికి లోటులేకండా ఇంకా మరిన్ని నాటకాలు సమర్పించ దానికి వీలుగా బోళ్ళు డబ్బు తెచ్చి పెట్టింది. చింతామణి నాటకం వేశ్యావృత్తికి వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతున్న కాలంలో రాయ బడింది. వేశ్యావృత్తిని నిరసిస్తూ కాళ్లకూరి రచన ఈ నాటకం. ఆనాడు చింతామణిని ప్రదర్శించని నాటక సమాజమంటూ లేదు. ఈ నాటకంలోని పద్యాలు ప్రజల నోటిలో తాండవించాయి. సంస్కార భారతి వారు ఈ నాటకాన్ని ఇటీవల కాలం వరకు ప్రదర్శించారు. ఆ నాటకం బహుళ ప్రాచుర్యం పొందింది. నేటికీ విజయవంతంగా ప్రదర్శిత మవుతోంది. గురజాడ కాలంలో "కన్యాశుల్కం", తరువాత "వరవిక్రయం" అంతటి ఘనత లభించింది. రెండూ తెలుగు నాటక రంగ ఇతిహాసంలో ఆణి ముత్యాలే. కన్యాశుల్కం అప్పటి సాంఘిక దురాచారాన్ని ఎదుర్కుం టే, వర విక్రయం ఆ కాలం సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతూ ఆ సాంఘిక దుస్థితిని ఎండకడుతూ వచ్చింది.గురజాడ " కన్యాశుల్కం" సాంఘిక దురాచారాలని ఖండిస్తూ, మార్పుకు అంకురార్పణ చేస్తే, కాళ్ళకూరి నారాయణరావు గారి సాంఘిక నాటకం - వరవిక్రయం (1921), అప్పటి సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతూ అనర్థ హేతు చర్యలు వ్యతిరేకిస్తూ, సాంఘిక ధర్మానికి పాటుపడింది. ఆ కాలంలోని సామాజిక సమస్యలకు తనదైన విచార ధారతో విశ్లేషించి, లోకం తీరును వరవిక్రయం రూపంలో మలిచారు. పెళ్ళి చేసుకోవడానికి భారీగా కట్న కానుకలు వసూలు చేస్తూ, వివాహం ఐదు రోజులు జరిపించుకొని, వైభవోపేతముగా సేవలు చేయించుకోవడం, పిల్ల తల్లి తండ్రులను అప్పుల ఊబిలోకి నెట్టి వేయడం వంటి పరిస్థితులను ప్రతిఘటించడానికి, నైతిక భాధ్యతలను నిర్వర్తించేందుకు పిలుపు నిచ్చారు. సి.పిల్లయ్య 1939 లో వర విక్రయము సినిమా తీసారు. భానుమతి రామకృష్ణ ఆ సినిమాలో కాళింది గా నటించారు. ఈ చిత్రం ద్వారా ఆమెకు మంచి పేరు వచ్చింది. సింగరాజు లింగరాజుగా బలిజేపల్లి లక్ష్మికాంత కవి గారు వేశారు. "నటన అంటే అది" అని అనిపించు కున్నారు. ఆయన రచనలలో...మద్యపానం వలన కలిగే దుష్పరిణామాలను ఎత్తి చూపిన నాటకం మధుసేవ. అలాగే రాజరాజ నరేంద్రుని కుమారుడని పేర్కొనే సారంగ ధరునికీ, చిత్రాంగికీ నడుమ జరిగిన కథ చిత్రాభ్యుదయం. అంతేగాక పద్మ వ్యూహం (1919) , సంసార నటన (1974 కళలో ధారవాహికగా ప్రచురితం) మొదలైన నాటకాలు కారణంలేని కంగారు (1920), దసరా తమాషాలు (1920), లుబ్ధ గ్రేసర చక్రవర్తి (1906), రూపాయి గమ్మత్తు (1920), ఘోరకలి (1921), మునిసిపల్ ముచ్చట్లు (1921), విదూషక కపటము (1921) వంటి ప్రహసనాలు ఆయన రచించారు. కాళ్ళకూరి 1919 లో రాసిన " పద్మవ్యూహం" నాటకంలో పద్యాలతో ఉన్న సంభాషణలను పొందు పరిచారు. ప్రముఖ రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణ...కాళ్లూరి శిష్యులు కాగా, కొత్తె వెంకటాచారి నారాయణరావు... నాటకాల మీద పి.హెచ్.డీ చేశారు. కాళ్ళ కూరి 1927, జూన్ 27న మరణించారు.

# మధ్యప్రాచ్యంలో మంటలు..

ఉక్రెయిన్, రష్యా యుద్ధం కొనసాగుతుండగానే, పాలస్తీనాపై హమాస్ ఉగ్రవాదుల దాడి, అందుకు ప్రతీకారంగా ఇజ్రాయిల్ సైన్యం పాలస్తీనా సామాన్య ప్రజలపై విరుచుకుపడడంతో మధ్య ఆసియా ప్రాంతం శాంతిభద్రతల సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. ఇజ్రాయిల్‌పై ఇరాన్ క్షిపణులతో దాడి, ఇజ్రాయెల్ ప్రతి దాడి చేయడంతో మధ్య ప్రాచ్యంలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. సిరియా రాజధాని డెమోస్కస్లో ఇరాన్ రాయబార కార్యాలయంపై ఇజ్రాయిల్ దాడి చేసి, ఇరాన్‌కు చెందిన మిలిటరీ అధికారులను హతమార్చడంతో, 230 క్షిపణిలను ఇజ్రాయిల్‌పై ప్రయోగించి ప్రతీకారాన్ని తీర్చుకున్నది. అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దిన ఇజ్రాయిల్ రక్షణ వ్యవస్థలకు అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ దేశాల అందించిన రక్షణ వ్యవస్థలు తోడ్పడడంతో ఇరాన్ ఉపయోగించిన క్షిపణులను మధ్యలోనే ఇజ్రాయిల్ పేల్చేసింది. తమ దేశంపై ఇరాన్ దాడి చేసినందుకు ప్రతీకారం తప్పదని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రకటించడం ప్రపంచాన్ని ఆందోళన కలిగించే విషయమే. అయితే, అమెరికా సహాయ సహకారాలు లేకుండా ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడి చేయదు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేసే దాడిలో అమెరికా పాల్గొంటే తాను ఇరాన్ వైపు ఉంటానని రష్యా ప్రకటించడం మరింత ఆందోళన కలిగించే విషయం.ఇజ్రాయిల్ అమెరికా కలిసి ప్రతి దాడి చేస్తాయనే ఉద్దేశంతోనే ఇరాన్ ముందుగానే అమెరికాతో ఈ విషయం ప్రస్తావించి, అమెరికా తటస్థంగా ఉండేటట్లు దౌత్య నీతిని ప్రదర్శించింది. ఈ విషయంలో రష్యాతో ఇరాన్ చర్చలు జరిపి, తమకు సహాయంగా ఉండాలని ముందుస్తు హామీని పొందింది. ఒకవేళ మధ్యప్రాచ్యంలో తన ఆర్థిక, రాజకీయ, రక్షణ ప్రయోజనాలకు భంగం వాటిల్లే పరిస్థితులు ఉద్భవిస్తే, అమెరికా మాటతప్పి, ఇజ్రాయిల్‌కు సహాయ సహకారాలు అందిస్తుంది. కానీ ఉక్రెయిన్‌తో తీవ్రంగా పోరు సలుపుతున్న రష్యా ఇరాన్‌కు సహాయంగా యుద్ధంలో దిగే పరిస్థితి కనిపించడం లేదు. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న సంఘర్షణలో గల్ఫ్ దేశాలు, ఇతర ముస్లిం దేశాలు ఇరాన్‌కు సహాయంగా నిలబడే ప్రసక్తే లేదు. హైతీ, హిజ్బుల్ మొజాహిద్దీన్ తీవ్రవాద గ్రూపులను ప్రోత్సహించి, ఐరోపా ఖండం నుండి వచ్చే షిప్పులను అటకాయించి, అంతర్జాతీయ వ్యాపారాన్ని అడ్డుకొని, ఇస్లామిక్ దేశాల్లో తన పలుకుబడిని పెంచుకోవాలని ఇరాన్ తలపోస్తున్నదని, ఇరానేతర ముస్లిం దేశాలు భావించడం ఇజ్రాయిల్‌కు ఒకింత లాభం చేకూర్చే విషయమే. పైగా ఇస్లాం ప్రపంచంలో షియా- సున్ని తెగల మధ్య పోరు ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. ఇరాన్ షియా ముస్లిం ఆరాధన పద్ధతిలో ఉండే దేశం. టర్కీ, జోర్డాన్, ఈజిప్ట్ సౌదీ వంటి దేశాలు సున్ని ఆరాధనా పద్ధతులను అనుసరిస్తాయనేది గమనార్హం. ప్రపంచంలోని ఇస్లామిక్ దేశాలన్నిటిని ఒక గ్రూప్ కింద తేవడానికి ఇస్లాం దేశాల సమాఖ్య ఉన్నప్పటికీ దాని ప్రభావం నామ మాత్రమే. పైగా ఇస్లామిక్ దేశాల్లో మతం ఒకటే అయినప్పటికీ, జాతులు అనేకం. ఈ వైవిధ్యంతోనే ఇరాన్, ఇరాక్ పది సంవత్సరాలు ఒకదానిపై ఒకటి దాడులు చేసుకుని, తీవ్రంగా నష్టపోయాయి.మధ్య ఆసియాలో నిరంతరం ఘర్షణలు జరగాలని అమెరికా తదితర పాశ్చాత్య దేశాలు కోరుకుంటాయి. వారి ఆయుధాలకు గిరాకీ ఉండాలంటే అక్కడ ఘర్షణలు నిరంతరం కొనసాగుతూనే ఉండాలి. ఇదే సందర్భంలో ప్రపంచంలో బలీయమైన శక్తిగా ఎదగాలని కోరుకుంటున్న భారత్ ఆ ఘర్షణలను నివారించి, అక్కడ శాంతియుత పరిస్థితులను పునరుద్ధరించవలసిన గురుతర బాధ్యత ఉంది. ఇజ్రాయిల్ ఇరాన్ సంఘర్షణలలో మన దేశం తటస్థంగా ఉండడం చాలా అవసరం. చైనా సిల్క్ రోడ్డుకు ప్రతిగా గల్ఫ్ దేశాలను, ఐరోపా తో కలిపి ఇంటర్నేషనల్ నార్త్ సౌత్ ట్రాన్స్పోర్ట్ కార్డియార్ ను భారత్ ఏర్పాటు చేయడానికి ఇరాన్ సహకారం చాలా అవసరం. పైగా ఇరాన్‌తో మనకు చారిత్రికంగా, సాంస్కృతికంగా, భాషాపరంగా ఎంతో మైత్రీ భావన ఉంది. పర్షియాగా పిలువబడిన ఇరాన్‌లో పర్షియన్ సంస్కృతికి, ఇస్లాం సంస్కృతికి ఘర్షణ ఏర్పడిన సందర్భంలో భారతదేశం పారశీకులను ఆదరించింది. చాలామంది ఇరానీలు ఇస్లాం మతాన్ని స్వీకరించినప్పటికీ భారతదేశం పట్ల వారికి గురుత్వ భావన ఉండనే ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకున్న మోడీ ప్రభుత్వం ఇరాన్ విషయంలో

# పవన్ కు మద్దతుగా మెగా ఫ్యాన్స్....

హైదరాబాద్, ఏప్రిల్ 27, పవన్ కు మద్దతుగా చిరంజీవి ప్రచారం చేస్తారా? పిఠాపురం వస్తారా? అందులో నిజం ఎంత? అదంతా ఉత్త ప్రచారమేనా? ఏపీ పొలిటికల్ సర్కిల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఈసారి చట్టసభల్లో అడుగు పెట్టాలని బలంగా డిసైడ్ అయ్యారు. గత ఎన్నికల్లో ఎదురైన ఓటమిని గుణపాఠంగా తీసుకున్నారు. పిఠాపురం నుంచి లక్ష కోట్ల మెజారిటీతో గెలవాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఆ మూడు పార్టీలు అవిశ్రాంతంగా పోరాడుతున్నాయి. గట్టిగానే ప్రచారం చేస్తున్నాయి. అటు సర్వేలు సైతం పవన్ కళ్యాణ్ 60 వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తారని చెబుతున్నాయి. అయితే ఎలాగైనా లక్ష ఓట్ల మెజారిటీ దాటాలని.. అందుకు అనుగుణంగా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని జన సైనికులు భావిస్తున్నారు.ఇప్పటికే జనసేన స్టార్ క్యాంపెయినర్లు పిఠాపురంలో రంగంలోకి దిగారు. బుల్లితెర నటులతో పాటు జబర్దస్త్ కళాకారులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. ఈ తరుణంలో ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. మెగా కాంపౌండ్ వాల్ నుంచి చాలామంది హీరోలు ప్రచారానికి వస్తారనిఒక వార్త హల్చల్ చేస్తోంది. ముఖ్యంగా వరుణ్ తేజ్ రాబోతున్నారని తెలుస్తోంది. గతంలో చాలా సందర్భాల్లో వరుణ్ తేజ్ కీలక ప్రకటనలు చేసిన సంగతి తెలిసిందే. బాబాయ్ అంటే తమకు ఇష్టమని.. ఆయనకు మద్దతుగా నిలుస్తామని.. ఆయన పిలిస్తే తప్పకుండా ఎన్నికల్లో ప్రచారం చేస్తామని కూడా వరుణ్ తేజ్ చెప్పుకొచ్చారు. అందుకే వరుణ్ తేజ్ ఈసారి ప్రచారంలో కీలకంగా కానున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సాయిధరమ్ తేజ్ తో పాటు వైష్ణవి తేజ్ కూడా వస్తారని సమాచారం.అయితే పిఠాపురంలో చిరంజీవి అడుగుపెట్టబోతున్నారన్న ప్రచారంలో నిజం లేదని తెలుస్తోంది. ఇటీవల కూటమి అభ్యర్థులను గెలిపించాలని చిరంజీవి వీడియో సందేశం పై వైసీపీ రచ్చ చేసిన సంగతి తెలిసిందే. అందుకే రాజకీయ ప్రచారాలకు వీలైనంత దూరంగా ఉండాలని చిరంజీవి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మెగా అభిమానులకు స్పష్టమైన సంకేతాలు వెళ్లాయని.. ఇప్పుడు చిరంజీవి కొత్తగా ప్రచారం చేసినా ఏం జరగదని.. ఇప్పటికే కూటమికి మెగా అభిమానులు మద్దతు తెలపడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో పిఠాపురంలో పవన్ గెలుపు పక్కా అని తేలింది. ఈ సమయంలో అనవసరంగా చిరంజీవి రంగంలోకి దిగితే.. ఆయన కెరీర్ ను డామేజ్ చేసే విధంగా ప్రత్యర్థులు కుట్రలు చేస్తారన్న అనుమానాలు ఉన్నాయి.

# ఓట్లు వేసేదెలా...

## మే 10 నుంచి టిక్కెట్లు ఫుల్

విజయవాడ, ఏప్రిల్ 27, మే పదోతేదీన హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ కు వెళ్లే ఆర్టీసీ, ప్రయివేటు బస్సుల్లో టిక్కెట్లన్నీ ముందుగానే బుక్ అయిపోయాయి. రైళ్లలో కూడా ఆరోజు అడ్వాన్స్ గా రిజర్వేషన్ చేయించుకోవడంతో అన్ని చోట్లకు వెయిటింగ్ లిస్ట్ కనపడుతుంది. వెయిటింగ్ లిస్ట్ వందల సంఖ్యలో ఉండటంతో ఇక రైళ్లలో టిక్కెట్ కన్ఫర్మ్ కావడం కష్టమేనని చాలా మంది ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు. అనేక మంది సొంత వాహనాలను బయటకు తీయాలని నిర్ణయించుకుంటున్నారు. దీంతో మే పదో తేదీన మాత్రం టిక్కెట్లన్నీ హాట్ కేకుల్లా అమ్ముడు పోవడానికి ఏపీలో మే 13వ తేదీన శాసనసభ ఎన్నికలు జరుగుతుండటమే ప్రధాన కారణం.అసలే వేసవి సెలవులు ఇవ్వడంతో పాటు ఎన్నికలు కూడా జరుగుతుండటంతో ఏపీలో ఓట్లు వేసేందుకు సొంతూళ్లకు బయలుదేరారు. కేవలం హైదరాబాద్ నగరం నుంచి మాత్రమే కాకుండా తెలంగాణలోని నిజామాబాద్, వరంగల్, మహబూబ్ నగర్, కరీంనగర్, రామగుండం, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల నుంచి కూడా బస్సులన్నీ ఫుల్లు అయిపోయాయి. ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారు అనేక మంది ఉపాధి, ఉద్యోగాల కోసం తెలంగాణకు వచ్చి స్థిరపడ్డారు. అయితే వాళ్ల ఓట్లు మాత్రం ఏపీలోనే ఉన్నాయి. ఏపీలో అనేక సంక్షేమ పథకాలను అందుకుంటున్న వారు కూడా ఇక్కడే ఉంటున్నారు. కొందరయితే పింఛను ఇచ్చే మొదటి తేదీ వెళ్లి పింఛను తీసుకుని తిరిగి వస్తుంటారు.తెలంగాణలో కేవలం పార్లమెంటు ఎన్నికలు మాత్రమే కావడంతో పాటు ఇక్కడ ఓటు వేయాలని పెద్దగా ఆసక్తి లేదు. తమ సొంత ఊరికి వెళ్లి ఓటు వేయాలని చాలా మంది భావిస్తున్నారు. శ్రీకాకుళానికి జిల్లాకు చెందిన అనేక మంది ఉపాధి కోసం హైదరాబాద్ నగరంలో ఉన్నారు. ఏపీలో ఈసారి ఎన్నికలను అన్ని పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఓటుకు ఇచ్చే నగదు కూడా వేల రూపాయల్లోనే ఉంది. దీంతో అక్కడకు వెళితే తమకు మరింత లాభమని భావిస్తున్నారు. కొందరయితే ఒక గ్రూపుగా చేరి తమ పార్టీ నేతలకు సమాచారం ఇస్తున్నారు. ప్రయివేటు వాహనాలలో తమను తీసుకెళ్లాలని కూడా కోరుతున్నారు. ఆరోజు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. టోల్‌గేట్ల వద్ద కూడా అత్యధిక సమయం పట్టే అవకాశముంది. ఇలా ఏపీకి జనం క్యూ కట్టడానికి రెడీ అయిపోయారని ఆర్టీసీ, రైలు టిక్కెట్ల పరిస్థితిని చూస్తేనే అర్థమవుతుంది. డబ్బుకు డబ్బు.. సొంత ఊరిలో ఓటు వేశామన్న తృప్తితో పాటుగా గ్రామానికి వెళ్లి రావచ్చన్న కోరికతో చలో ఏపీ అంటూ బయలుదేరుతున్నారు.

ప్రయివేటు వాహనాలను కూడా ముందుగానే బుక్ చేసుకుంటున్నారు. పోలింగ్ సోమవారం రావడంతో శని, ఆదివారాలు సెలవు దినం కావడంతో వరసగా మూడు రోజులు సెలవులు రావడంతో ఐటీ ఉద్యోగులు కూడా ముందుగానే టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. మరికొందరు మే పదో తేదీన తాము వాహనంలో వెళుతున్నామని, షేరింగ్ కు వచ్చే వాళ్లు సంప్రదించాలంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్ లు పెడుతున్నారు.

అలా మొత్తం మీద నగరంలో మే పది నుంచి 13వ తేదీ వరకూ సంక్రాంతిని తలపించేలా ఉంటుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి

# వారసులకే సీట్లు

తిరుపతి, ఏప్రిల్ 27 ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయాలు కొన్ని కుటుంబాలే తరతరాలుగా వస్తున్నాయి. తాతల కాలం నుంచి ఇప్పటి వరకు వారి వారసులే ఏ ఎన్నికలు జరిగినా పోటీ పడుతున్నారు. కొందరు అధికారం ఉన్న లేకపోయిన ప్రజలతో ఉండగా మరికొందరు అధికారం ఎటువైపు ఉంటే ఆ వైపు వెళ్ళిపోతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొత్తం 14 నియోజకవర్గాలు ఉన్నాయి. తిరుపతి సిట్టింగ్ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో ఎమ్మెల్యే గా గెలుపొంది టీటీడీ చైర్మన్ గా పని చేసారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలుపొంది మరో సారి టీటీడీ చైర్మన్ గా పని చేస్తున్నారు. 2024 ఎన్నికలకు తన కుమారుడు భూమన అభినయ్ రెడ్డి ను గెలుపు కోసం ప్రచారం చేస్తున్నారు. అభినయ్ ఇప్పటికే తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ గా ఉన్నారు. చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే. ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి జడ్పీటీసీ స్థాయి నుంచి వచ్చారు. వైసీపీ పార్టీ లో చేరి 2014, 2019లో ఎమ్మెల్యే గా గెలుపొందారు. తుడా ఛైర్మన్ తో పాటు ప్రభుత్వ విప్ గా, టీటీడీ ఎక్స్ అఫీషియో సభ్యుడుగా పని చేసారు. ఆయన కొడుకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఎంపీపీగా గెలిచి కుడా ఛైర్మన్ గా పని చేసారు. ప్రస్తుతం చంద్రగిరి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థి గా పోటీ చేస్తున్నారు.శ్రీకాళహస్తి లో టీడీపీ అభ్యర్థి గా బరిలో ఉన్న బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి. ఆయన తాత బొజ్జల గంగసుబ్బరామిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. ఆ తరువాత ఆయన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మూడు సార్లు మంత్రిగా పనిచేసారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలై మరోసారి తన ఆధిపత్యం కోసం కృషి చేస్తున్నారు.నగరి టీడీపీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న గాలి భాను ప్రకాష్ తండ్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాలోకి వచ్చి 6 సార్లు ఎమ్మెల్యేగా పని చేయడంతో పాటు మంత్రిగా మూడు సార్లు, ఎమ్మెల్సీగా పని చేసారు. ఆయన కుమారుడు గాలి భాను తన సత్తా చాటాలని చూస్తున్నారు.కుప్పం నియోజకవర్గం లో గత ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పై పోటీ చేసి ఓటమిపాలైన మాజీ ఐఏఎస్ అధికారి చంద్రమౌళీ మరణాంతరం ఆయన కుమారుడు కృష్ణ రాఘవ జయేంద్ర భరత్ 2021లో ఎమ్మెల్సీ అయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గా వైసీపీ నుంచి పోటీ చేస్తున్నారు.ఈ నియోజకవర్గం నుంచి కె. నారాయణ స్వామి 2004లో 2014, 2019లో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఉప ముఖ్యమంత్రి, మంత్రి గా పని చేసారు. ఆయన కుమార్తె కృపాలక్ష్మి ను ఈ ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి వైసీపీ నుంచి పోటీ చేస్తుంది.టీడీపీ తరపున పోటీ చేస్తున్నారు మాజీ మంత్రి ఎన్. అమర్నాథ్ రెడ్డి. ఆయన తండ్రి రామకృష్ణ రెడ్డి ద్వారా రాజకీయాలలోకి వచ్చి సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే గా 4 సార్లు గెలుపొంది మంత్రిగా పని చేసారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి గా పని చేసిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు, తండ్రి మాజీ ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి, తల్లి సరోజమ్మ ఎమ్మెల్యే లుగా పని చేసారు.

గత రెండు ఎన్నికల్లో ఓటమి పాలై. టీడీపీ తరపున పోటీ చేస్తున్నారు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి.పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడిగా రాజకీయాల్లోకి వచ్చిన పెద్దిరెడ్డి ద్వారకానాథ రెడ్డి 2019లో ఎమ్మెల్యే గా గెలుపొందారు. మరోసారి అదే నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు.ఇక సత్యవేడు, చిత్తూరు, పుంగనూరు, పూతలపట్టు, మదనపల్లి నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు సొంతంగా ఎలాంటి కుటుంబ రాజకీయ నేపథ్యం లేకుండా ఎన్నికల్లో నిలిచారు.ఇలా అత్యధిక మంది వారసత్వంగానే రాజకీయాల్లోకి వస్తున్నారు. కింది నుంచి ఎదుగుతున్న వారికి రాజకీయ పార్టీల్లో పెద్దగా అవకాశాలు లభించడం లేదు. భాను ప్రకాష్ రెడ్డి, కిరణ్ రాయల్ వంటి వారు ప్రయత్నాలు చేస్తున్నా నిరాశే ఎదురవుతోంది.

# కోటీశ్వరులే కాదు సామాన్యులు...

విజయవాడ, ఏప్రిల్ 27 ఎన్నికలంటే కోట్ల రూపాయల ఖర్చు... అసలు సామాన్యులెవ్వరూ ఆ వైపు ఆలోచించనుకూడా లేరు... సాధారణంగా అందరికీ కలిగే అభిప్రాయం ఇది. ప్రస్తుత ఎన్నికల్లో కొందరి ఆస్తుల వివరాలు చూస్తే ఆ విషయం నిజమే అనే భావన కలుగుతుంది. రాజకీయ పార్టీలు కూడా ఆర్థికంగా బలవంతులకే టిక్కెట్లు ఇచ్చే పరిస్థితి ఉంది. అయితే కొందరు సామాన్యులూ ఈ సార్వత్రిక సమరానకి సై అంటున్నారు. కొంత ఆశ్చర్యంగా ఉన్నా .. ఇది నిజం. వారు సమర్పించిన అఫిడవిట్లు అందుకు సాక్ష్యం.కోట్లల్లో స్థిరాస్తులు, అంతకు మించి చరాస్తులు... ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల అర్హతగా మారిపోయింది. కానీ బ్యాంకు ఖాతాలో కనీసం నాలుగంకెల బ్యాలెన్స్ కూడా లేని వ్యక్తులు కూడా ఈసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఇలాంటి వారిలో అధికార వైసీపీ తరపున పోటీలో దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అలాంటి వారిలో మొదటి లైన్ లో సత్యసాయి జిల్లా మడకశిర ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ అసెంబ్లీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఈర్లకప్ప ఉన్నారు. ఈయనకు సొంత బైకు తప్ప ఎటువంటి స్థిర చర ఆస్తులు లేవు. కేవలం 2,783 రూపాయలు మాత్రమే ఉన్నట్లు ఆయన అఫిడవిట్ సమర్పించారు. ఆయన బ్యాంకు బ్యాలెన్సులు మరీ చిత్రం. ప్రగతి గ్రామీణ బ్యాంకులో 11 రూపాయలు, కెనరా బ్యాంకులో 41 రూపాయలు, ఏడీసీసీ బ్యాంకులో రూ. 26,950 రూపాయలు, యూనియన్ బ్యాంకులో రూ. 881 లు ఉన్నాయి. ఆస్తులు లేకున్నా అప్పులు దండిగానే ఉన్నాయి . రూ.1,13,050 అప్పులు ఉన్నట్లు అఫిడవిట్ లో తెలిపారు. ఇందులో బ్యాంకు లోను రూ. 86,100, ఇతర అప్పులు రూ. 26,950. మొత్తంగా స్థిర చర ఆస్తులు కలిపి రూ. 99,883 మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు ఈర్లక్కప్ప. మడకశిర టీడీపీ అభ్యర్థిగా ఎమ్మెస్ రాజు పోటీ చేస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజక వర్గం వైసీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కూడా సామాన్యుల జాబితాలో ఉన్నారు. ప్రస్తుతం మైలవరం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తిరుపతిరావు మొత్తం ఆస్తి 4,20,766 రూపాయలు మాత్రమే. ఆయన అఫిడవిట్ ఈ విషయాన్ని క్లియర్ గా చెపుతోంది. చరాస్తులు కూడా రూ.1,89,642 మాత్రమే. బ్యాంక్ అకౌంట్ లో తొమ్మిది వేల రూపాయలు, తనకు ఒక బైక్ మాత్రమే ఉంది. తనకు సంబంధించి బంగారం రూ. 1,65,000, చేతిలో నగదు రూ.15,000 ఉన్నట్లు అఫిడవిట్ లో చూపారు. ఈ అతి సామాన్యుడు తలపడుతోంది ఎవరితోనో తెలుసా అపర కుబేరుడు టీడీపీ క్యాండిడేట్ వసంత కృష్ణ ప్రసాద్ తో. ఇదే అసలు ఇంటరెస్టింగ్ టాపిక్. అనంతపురం జిల్లా సింగనమల ఎస్సీ రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున పోటీ చేస్తున్న ఎం వీరాంజనేయులు నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తే. ప్రస్తుతం ఆయన సమర్పించిన అఫిడవీట్ ప్రకారం స్థిరాచరాస్తులకు సంబంధించి కేవలం 1,06,478 రూపాయలు మాత్రమే ఉన్నాయి. చేతిలో 50 వేల రూపాయలతో పాటు ఎస్‌బీఐలో 11,193 రూపాయలు, అలాగే ద్విచక్ర వాహనం మాత్రమే ఉన్నట్లు ఆయన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన వీరాంజనేయులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఉన్న ఆయన ఈ సార్వత్రిక ఎన్నికల్లో సింగనమల నియోజకవర్గం నుంచి అభ్యర్థిగా బరిలోకి దిగారు. పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున పోటీ చేస్తున్న ఎం విశ్వేశ్వర రాజు అదే జాబితాలో ఉన్నారు. ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిలో 20,39,512 రూపాయలు మాత్రమే ఆస్తులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇద్దరు పిల్లల పేరు మీద రూ. 7,25,927లు విలువైన ఆస్తులు ఉన్నాయి. మొత్తం స్థిరాచరాస్తులు కలిపి రూ. 50,98,000 మాత్రమే ఉన్నట్లు, అప్పులు రూ.1,20,000 ఉన్నాయని ఆయన ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

### టీడీపీ ప్రచార రథానికి నిప్పు

పీలేరు టీడీపీ ప్రచార రథానికి వైసీపీ మూకలు నిప్పు పెట్టారు. గత రెండురోజులుగా కిషోర్ కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డి వాల్మీకి పురంలో ప్రచారం చేస్తున్నారు. వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వైసీపీ అల్లరి మూకలు టీడీపీ ప్రచార రథాన్ని నిప్పు పెట్టారని టీడీపీ నేతలు అరోపించారు.ముఖాలకు మాస్క్ ధరించిన మూకలు నిప్పంటించారు. వాల్మీకి పురం మండలంలోని విఠలం ప్రధాన రహదారిలో ఘటన జరిగింది. మండిపడ్డ టీడీపీ నేతలు, ఎమ్మెల్లే చింతల కనుసన్నల్లో ఘటన జరిగినట్లు ఆరోపిస్తున్నారు.

# నర్సన్నపేట.. టఫ్ ఫైట్...

శ్రీకాకుళం, ఏప్రిల్ 27 శ్రీకాకుళం జిల్లా నరసన్న పేటలో ఐదోసారి విజయం కోసం ధర్మాన కృష్ణ దాస్ ప్రయత్నిస్తున్నారు. గత ఎన్నికల్లో బగ్గ రమణమూర్తిపై కృష్ణదాస్ 19వేల ఓట్లతో గెలిచారు. 2014లో టీడీపీ తరపున గెలుపొందిన రమణ మూర్తి 2019లో ఓటమిపాలయ్యారు. తాజా ఎన్నికల్లో వైసీపీ తరపున ధర్మాన, టీడీపీ అభ్యర్థిగా రమణమూర్తి పోటీ చేస్తున్నారు. వీరిలో విజయం ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

నరసన్న పేటకు జగన్ హామీలు:

నరసన్నపేట టౌన్ పరిధిలో ఆర్‌అండ్ బీ రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ కు రూ.10 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మధ్యలోనే నిలిచిపోయిన విస్తరణ పనులకు మరో రూ.10కోట్లు అవసరమని ఆర్‌అండ్ బీ శాఖ అధికారులు ప్రతిపాదించారు. సీఎం నిధులు ప్రకటించినా ఇంతవరకు రూపాయి మంజూరు కాలేదు.

మడపాం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.15 కోట్ల సాయం ప్రకటించారు. 1,653 ఎకరాలకు సాగునీటి వసతి అందించేందుకు మడపాం వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు గతంలో ప్రతిపాదించారు. ఇందుకు రూ.15 కోట్లు అవసరం. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మార్పుతో అవి రద్దయ్యాయి.

నరసన్నపేట రాజుల చెరువు అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షలు మంజూరు చేసి పనులు చేపట్టారు. వైసీపీ హయంలో జగన్ రూ.10కోట్ల నిధులు ప్రకటించి ఏడాది దాటినా ఎలాంటి మార్పు లేదు.

గుడిపేట, కిరికి వద్ద రివర్స్ ఫ్లో ఆటోమేటిక్ ఫాలింగ్ షట్టర్లు ఏర్పాటు బీ డీఎల్ పురం వద్ద లోలెవల్ కాజ్వే మంజూరుకు హామీ ఇచ్చారు. అవి నెరవేరలేదు.

బొంతు ఎత్తిపోతల పథకం మిగులు పనుల పూర్తికి రూ.40 కోట్లు ప్రకటించినా విడుదల కాలేదు.

జగన్నాథపురంతో పాటు పలు ప్రాంతాలకు తాగునీటి వసతులు కల్పిస్తామని ప్రకటించారు. నరసన్నపేటలోని జగన్నాథపురంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో అక్కడి ప్రజ లకు తాగునీటికి ఇబ్బందిలేకుండా చూస్తామని చెప్పినా ఇక్కడ తాగునీటి పథకం ఇంకా నిర్మాణదశలో ఉంది. సారవకోట మండలంలోని రంగసాగరం ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. సారవకోట మండలం బొంతు ఎత్తిపోతల పథకం పెద్ద ప్రాజెక్టు. ఇది పూర్తయితే ఆ మండలమే కాక, చుట్టుపక్కల మండలాలకు సాగునీరందుతుంది. పథకం నిర్మాణ పనులు ఇప్పటికి 60 శాతం మాత్రమే పూర్తయ్యాయి.

నరసన్నపేట నియోజకవర్గంలో సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఈ సమస్య పరిష్కారం కాలేదు. వంశధార కాలువల ఆధునికీకరణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. తంపర భూముల అభివృద్ధి ఆగిపోయింది. జలుమూరు మండలం లింగాలపాడు ఎత్తిపోతల పథకం అభివృద్ధి చేస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఆ సమస్యను పరిష్కరించలేదు.

ఎమ్మెల్యేపై ప్రధాన ఆరోపణలు?

ధర్మాన కృష్ణదాస్ కుటుంబంపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రెండున్నరేళ్ల కాలంలో పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఎవరూ అవినీతికి పాల్పడవ ద్దంటూ చెబుతూనే ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులు అవినీతిలో మునిగిపోయారు.

మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంతో పాటు జిల్లాలో ప్రభుత్వ స్థలాల కబ్జాలకు సహకరించారనే విమర్శలు ఉన్నాయి.

నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని మార్కెట్ ధరకు తీసుకునేందుకు ప్రయ త్నాలు చేసినా వీలుకాలేదు.

మంత్రి భార్య ధర్మాన పద్మప్రియ, పెద్దకుమారుడు ధర్మాన రామలింగం నాయుడు మంత్రి తరపున చక్రం తిప్పుతుంటారు. పోలాకి మండలంలో ఓ క్వారీని నిర్వహిస్తున్నారు.

రెండో కుమారుడు కృష్ణచైతన్య కృష్ణ చైతన్యకు విశాఖ, శ్రీకాకుళంలో మెడికల్ ల్యాబ్‌లు ఉన్నాయి.

నరసన్నపేట పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ధర్మానకు చెందిన విల్లా ను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థ లం కూడా ఆక్రమించుకున్నారు.

ప్రధాన సమస్యలు:

నరసన్నపేట మండలం:

నరసన్నపేట ప్రధాన రహదారి ఆధునీకరణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. ప్రధాన రహదారి అభివృద్ధి, విస్తరణపై ఎమ్మెల్యే ఎన్నికల హామీగా చెప్పారు. కేవలం 30 శాతం పనులు మాత్రమే నిర్వహించినా నిధుల లేమితో మిగిలిన పనులు జరగలేదు. నాలుగున్నరేళ్లుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోలేదు.

మడపాం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి సాగునీటి సమస్య తీరుస్తామని ఎన్నికల హామీలు ఇప్పటికీ నెర వేరలేదు. గతేడాది ముఖ్యమంత్రి మడపాం ఎత్తిపోతల పథకానికి రూ.15కోట్లు ప్రకటించినా ఇప్పటి వరకు నిధులు విడుదల కాలేదు. దీంతో సాగునీటికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నరసన్నపేటలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు స్కిల్ డవలప్మెంట్ కళాశాల ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనలు నీటి మీద రాతల్లా మిగిలాయి. ఇప్పటి వరకు కళా శాల ఏర్పాటు ఒక్క అడుగు ముందుకు పడలేదు.

రావులవలస గ్రామ రహదారి నిర్మాణానికి ప్రస్తుత ఎమ్మెల్యే శంకుస్థాపన చేసినా ఇప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు. దీనిని గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అధ్వాన రహదారితో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

సారవకోట మండలం:

హిరమండలం మండలం సిది నుంచి సారవకోట మండలం బొంతు కూడలి. పెద్దలంబ మీదుగా పాతపట్నం మండలం తెంబూరు వరకు ఉన్న 15 కిలోమీటర్ల రోడ్లు అభివృద్ధికి రూ. 25కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు 10కిలోమీటర్ల పొడవున పనులు పూర్తి చేశారు. బిల్లు చెల్లింపులు లేకపోవడంతో పెద్దలంబ నుంచి తెంబూరు వరకు ఉన్న 5 కిలో మీటర్ల రోడ్డు పనులు చేపట్టకుండా గత మూడు నెలలుగా విడిచిపెట్టేశారు. ఈ రోడ్డంతా గోతుల మయంగా మారడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

సారవకోట మండలం అలుదు నుంచి కోటబొమ్మాళి మండలం పాకివలస వరకు ఉన్న రోడ్డు అభివృ ద్ధికి రూ.15 కోట్లు, సారవకోట మండలం వడ్డినవలస నుంచి జలుమూరు మండలం కరకవలస వరకు ఉన్న రోడ్డు అభివృద్ధికి రూ.15కోట్లు మంజూరు కావడంతో 2.3.22న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శంకుస్థాపన చేశారు. గుత్తేదారు పనులు ప్రారంభించి కల్వర్టుల నిర్మాణ పనులు పూర్తి చేశారు. బిల్లు చెల్లింపులు లేక గత ఆరు నెలలుగా పనులు నిలిపేశారు. అరకొర పనులతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

బైదలాపురం గ్రామం వద్ద వంశధార ఎడమ కాలువపై వంతెన 2020లో కూలిపోయింది. ఈ ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.1.33 కోట్లు మంజూరు చేసింది. నేటికీ టెండరు ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.

జలుమూరు మండలం:

శ్రీముఖలింగేశ్వరస్వామి క్షేత్రం అభివృద్ధికి రూ.55 కోట్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు.

గత ప్రభుత్వం సమయంలో మాస్టరు ప్లాన్ కింద చేపట్టిన మాఢ వీధుల పనులు ముందుకు సాగలేదు.

తలతరియా ప్రాంతానికి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చాలావరకు పనులు చేపట్టింది. ప్రభుత్వం మారిన తర్వాత పనులు ముందుకు సాగ లేదు. దీంతో రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

తాజా ఎన్నికల్లో వైఎస్సార్సీపీ తరపున ధర్మాన కృష్ణదాస్, టీడీపీ తరపున బగ్గు రమణమూర్తి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇద్దరిలో విజయం ఎవరిని వరిస్తుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

# గుమ్మనకు ఎదురీత తప్పదా

కర్నూలు, ఏప్రిల్ 27, ఆలూరు నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన గుమ్మనూరి జయరాంకు ఈసారి మాత్రం గెలుపు అంత సులువుగా మాత్రం లేదు. బోయ సామాజికవర్గానికి చెందిన గుమ్మనూరి జయరాం పై ఎన్ని ఆరోపణలు వచ్చినా సరే.. జగన్ తన కేబినెట్ లో కొనసాగించారు. ఆయన కుటుంబ సభ్యులపైన కూడా ఆరోపణలు అనేకం వినిపించాయి. అంతేకాదు పేకాట క్లబ్ లు నిర్వహిస్తున్నారని స్వయంగా టీడీపీ నేతలే విమర్శించారు. అయితే గుమ్మనూరిని ఈ ఎన్నికల్లో వైసీపీ ఆలూరు నుంచి తప్పించి ఆయనకు కర్నూలు పార్లమెంటుకు పోటీ చేయాలని చెప్పడంతో ఆయన మనస్తాపానికి గురై టీడీపీలో చేరిపోయారు.ఆర్థికంగా, సామాజికంగా బలమైన నేత కావడంతో గుమ్మనూరి జయరాంను టీడీపీ సాదరంగా ఆహ్వానించింది. అయితే ఆయన కోరుకున్నట్లు ఆలూరు టిక్కెట్ మాత్రం టీడీపీ నాయకత్వం ఇవ్వలేదు. గుంతకల్లులో పోటీ చేయాలని ఆదేశించింది. దీంతో ఈ ఎన్నికల్లో గుమ్మనూరి జయరాం గుంతకల్లు నుంచి పోటీ చేయడం ఇష్టం లేకపోయినా శాసనసభలో కాలుమోపాలన్న పట్టుదలతో ఆయన అక్కడినుంచి బరిలోకి దిగారు. అయితే అప్పటికే అక్కడ ఉన్న టీడీపీ నేతలు గుమ్మనూరి జయరాం టీడీపీలో రాకను వ్యతిరేకించారు. తాము గుమ్మనూరికి మద్దతు ఇవ్వబోమని స్పష్టంగా చెప్పారు. అయితే అధినాయకత్వం కొంత సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నప్పటికీ వారు కలసి పనిచేస్తారని చెప్పలేని పరిస్థితి గుంతకల్లు నియోజకవర్గం పునర్విభజనలో భాగంగా 2009లో ఏర్పడింది. 2009లో అక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. నాటి ఎన్నికల్లో మధుసూదన్ గుప్తా విజయం సాధించారు. అయితే 2014 ఎన్నికల్లో ఇక్కడి నుంచి తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. నాటి ఎన్నికల్లో జితేందర్ గౌడ్ గెలిచారు. 2019 ఎన్నికల్లో జితేందర్ గౌడ్ వైసీపీ నుంచి పోటీ చేసిన వెంకట్రామిరెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే తనకు టిక్కెట్ రాకపోవడంతో జితేందర్ గౌడ్ వర్గం గుమ్మనూరికి మద్దతు ఇచ్చేందుకు ససేమిరా అంటుంది. అధినాయకత్వం చెప్పినా నై..నై అంటూ తెగేసి చెబుతుంది. ఎక్కడి నుంచో తెచ్చి ఇక్కడ డంప్ చేయడమేంటని ప్రశ్నిస్తుంది. . అయితే గుంతకల్లు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత జరిగిన మూడు ఎన్నికల్లో ఒకసారి గెలిచిన వారు మరొకసారి గెలవలేదు. మూడు సార్లు మూడు పార్టీలు గెలిచాయి. అందుకే తాను కొత్త వ్యక్తి అయినా ఇక్కడి ప్రజలు తనను ఆదరిస్తారన్న నమ్మకంతో గుమ్మనూరి జయరాం ఉన్నారు. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డికే టిక్కెట్ ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి అభ్యర్థిగా కావలి ప్రభాకర్ బరిలో ఉండనున్నారు. ఇక్కడ కొత్త వారికి అవకాశమివ్వదలచుకుంటే గుమ్మనూరి గెలిచినట్లేనని అంచనాలు వినపడుతున్నాయి. అదే సమయంలో టీడీపీ క్యాడర్ ఎంత మేరకు ఆయనకు సహకరిస్తుందన్నది కూడా అనుమానుమే. అందుకే గుంతకల్లులో విజయం మాత్రం టీడీపీ, వైసీపీల మధ్య దోబూచులాడుతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## ఫుడ్ సేఫ్టీ రైడ్

చీరాల బాపట్ల జిల్లా చీరాల లో పండ్ల దుకాణాలపై ఆహారభద్రత అధికారులు దాడులు నిర్వహించారు.అదే సమయంలో ఓ పండ్ల దుకాణం లో అరటి పండ్లు త్వరగా పండటానికి వ్యాపారులు ఇథోఫిన్ అనే రసయానాన్ని స్ప్రే చేయడాన్ని గమనించారు.అయితే పండ్లను సహజ సిద్ధంగా సాంబ్రాణి వేసి గాలి ఆడని ప్రదేశంలో నిల్వ వుంచి మాత్రమే మగ్గపెట్టాలని..ఈ విధంగా రసాయానాలతో మగ్గ పెడితే ప్రజల ఆరోగ్యానికి హానికరమని అధికారులు తెలిపారు. రసాయనాలు చల్లిన అరటి పండ్లను శాంపిల్స్ సేకరించి ల్యాబ్ కు పంపించి పరీక్షించిన అనంతరం చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ప్రభాకర్ రావు తెలిపారు. ఏవైన పండ్ల పై ఈవిధంగా రసాయనాలు చల్లితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అలానే రసాయనాలు చల్లిన పండ్లను సీజ్ చేస్తామని ప్రభాకర్ రావు హెచ్చరించారు.

# ఆముదాలవలసలో బావ, బామ్మర్దుల సవాల్

శ్రీకాకుళం, ఏప్రిల్ 27 శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలసలో ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారామ్ ఏడో సారి అసెంబ్లీ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 1983లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సీతారామ్ 2019 ఎన్నికల్లో గెలిచి శాసనసభాపతి అయ్యారు. 2019లో సీతారామ్‌పై కూన రవికుమార్ 13,991 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

శ్రీకాకుళం జిల్లా ఆముదాల వలసలో గత ఎన్నికల్లో వైసీపీ తరపున ప్రధాన హామీల్లో మూతపడ్డ చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని జగన్ ప్రకటించారు. ఆముదాలవలస చక్కెర కర్మాగారాన్ని పలుమార్లు అధికారుల బృందాలు పరిశీలించి వెళ్లాయి తప్ప ఇంతవ రకూ ఆ దిశగా చర్యలేమీ లేవు.

పొందూరులో ఖాదీ దుస్తులు తయారుచేసేందుకు చేనేత క్లస్టరు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చేనేత క్లస్టరు ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. గతంలో కేంద్ర, రాష్ట్ర అధికారులు పరిశీలించారు తప్ప క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు.

గత ఎన్నికల్లో తమ్మినేని ఇచ్చిన హామీలు?

ఆమదాలవలస పురపాలక సంఘంలోని వార్డులకు పైపులైన్లు వేయించి తాగునీరు అందిస్తానని చెప్పారు. అధికారంలోకి వచ్చాక వంశధార నది నుంచి తాండ్రాసి మెట్ట వరకు ప్రధాన పైపు లైన్లు ఏర్పాటు చేశారు. అక్కడ పంట పొలాల మీదుగా పైపులైన్ వెళ్లకుండా రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి.

సరుబుజ్జిలి కూడలిలో తాగునీటి పథకం ఏర్పాటు చేసి స్థానికులకు తాగునీరు అందిస్తామని చెప్పినా అది నెరవేరలేదు.

ఎమ్మెల్యే అవినీతి, అక్రమాలపై ఆరోపణలు?

తమ్మినేని సీతారాం రాష్ట్రంలో అత్యంత వివాదాస్పద నాయకుల్లో ఒకరిగా నిలిచారు. శాసనసభలో విపక్షాలు మాట్లాడేందుకు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదనే విమర్శలు ఎదుర్కొన్నారు. అధికారులు తన చెప్పుచేతుల్లో ఉండేలా చూస్తారు. తమ్మినేని భార్య నేరుగా అధికారులపై పెత్తనం చేస్తుంటారు.

తమ్మినేని భార్య వాణిశ్రీ, కుమారుడు చిరంజీవి నాగ్‌లు నియోజక వర్గంలో పెత్తనం చేస్తుంటారు. కుమారుడిని రాజకీయ వారసుడిగా తెచ్చే ప్రయత్నాలు చేసినా ఫలించ లేదు. భార్య వాణిశ్రీ పెత్తనంపై పార్టీ క్యాడర్‌లో సైతం అసంతృప్తి ఉంది.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పోస్టులు వేయించేందుకు రూ. లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీతారాం భార్య ద్వారా అయితేనే పని అవుతుందనే పేరు ఉంది. దీంతో చాలామంది నిరుద్యోగులు ఆమెనే ఆశ్రయిస్తారు. ప్రైవేట్ సెటిల్‌మెంట్లలో సైతం తమ్మినేని సతీమణి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది.

ఉద్యోగులకు వారు కోరుకున్న చోటకి బదిలీలు కావాలన్నా తమ్మినేని సతీమణినే ఆశ్రయించాలి.

ప్రధాన సమస్యలు:

ఆమదాలవలస మండలంలో

ఆమదాలవలస చక్కెర కర్మాగారం మూతపడి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు తెరిపించలేదు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో కర్మాగారాన్ని తెరిపిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడి అయిదేళ్లు కావస్తున్నా ఇంతవరకు కర్మాగారం తెరవలేదు. దీంతో కార్మికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆమదాలవలస మండలం అక్కులపేట ఎత్తిపోతల పథకం సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడు తున్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్పీకర్ తమ్మినేని సీతారాం ఈ పథకం ద్వారా సాగునీరు పూర్తిస్థాయిలో అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఈ మేరకు చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు సాగునీరు అందక అవస్థలు పడుతున్నారు.

ఆమదాలవలస–శ్రీకాకుళం రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో రూ.37 కోట్లతో అప్పటి ప్రజాప్రతినిధి శంకుస్థాపన చేశారు. అయితే వైకాపా అధికారంలోకి వచ్చిన తరవాత 25 శాతం పనులు కాకపోవడంతో రద్దు చేసి మళ్లీ రూ.40 కోట్లతో స్పీకర్ తమ్మినేని సీతారాం పనులకు శంకుస్థాపన చేశారు. ఇంతవరకు నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతు న్నారు.

ఆమదాలవలస మున్సిపాల్టీ జగ్గు శాస్త్రులపేట వద్ద మినీ స్టేడియాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో రూ.25 లక్షలతో నిర్మించారు. క్రీడాకారులు దీనిలో సాధన చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆధునికంగా స్టేడియం నిర్మిస్తామని ఉన్న భవనాలు తొలగించారే తప్పా పనులు చేపట్టకపోవడంతో క్రీడాకారులు అవస్థలు పడుతున్నారు.

ఆమదాలవలస వద్ద నిర్మించిన వయోడెక్ట్ శిథిలావస్థకు చేరింది. ఏ క్షణంలో కూలుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. దీని ద్వారా వందల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా శివారు ప్రాంతాలకు చేరడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బృందాలు వచ్చి పరిశీలించారే తప్పా ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస వంశధార నిర్వాసితులు ఆర్‌ఆర్ కాలనీలో రూ.1,50 కోట్లతో ప్రభుత్వం ఉన్నత పాఠశాలను నిర్మించింది. స్పీకర్ తమ్మినేని సీతారాం రెండేళ్ల కిందట పాఠ శాల భవనాన్ని ప్రారంభించారు. బిల్లు రాకపోవడంతో గుత్తేదారులు అధికారులకు తాళాలు ఇవ్వకపోవడంతో ఆర్‌ఆర్ కాలనీ విద్యార్థులు ఆమదాలవలస వచ్చి చదువుకోవల్సి వస్తుంది.

సరుబుజ్జిలి మండలం, బూర్జ మండలం, పొందూరు మండలాల్లో సమస్యలు దీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్నాయి.

పొందూరు మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం గతంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చినప్పటికీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూడేళ్ల కిందట ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. డిగ్రీ కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో పాటు ఉన్న తాత్కాలిక గదుల్లో మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో డిగ్రీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

పొందూరు ఖాదీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు గతంలో ఎమ్మెల్యే హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు నెరవేర్చలేదు. క్లస్టర్లను ఏర్పాటు చేసి ఖాదీ కార్మికులకు భవనాల నిర్మాణం చేపట్టి, ఖాదీపై శిక్షణ అందించి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపట్టనున్నట్లు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వచ్చిన ప్పుడు హామీ ఇచ్చారు. ఇంతవరకు అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఖాదీ పరిశ్రమ అభివృద్ధికి నోచుకోవడం లేదు.

ఆముదాల వలసలో అధికారాన్ని నిలుపుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఉండదనే విమర?శ ఉంది. నియోజక వర్గంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా తమ్మినేని హామీలకే పరిమితం అయ్యారనే విమర్శ ఉంది. తాజా ఎన్నికల్లో బావబామ్మర్దుల మధ్య జరుగనున్న పోరులో విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి

# విశాఖలో టగ్ ఆఫ్ వార్

విశాఖపట్టణం, ఏప్రిల్ 27, ఆ నియోజకవర్గం విశాఖ నగరానికే మణిహారం.. గ్రేటర్ విశాఖలో గ్రేట్‌గా చెప్పుకునే ప్రాంతాలన్నీ ఆ నియోజకవర్గం పరిధిలోనే ఉంటాయి. సాగరతీరంలో సర్వమతాల సంగమంగా ఉండే ఆ నియోజకవర్గం రాజకీయం చేయడం మాత్రం చాలా కష్టం. ఆ పార్టీ ఈ పార్టీ అని కాదు.. ఏ పార్టీ అయినా గ్రూపు వార్‌తో నేతలకు ముచ్చెమటలు పట్టించడం అక్కడి క్యాడర్ స్పెషాలిటీ? అసలు సిసలు రాజకీయానికి కేరాఫ్‌గా నిలిచే విశాఖ సౌత్ పొలిటికల్ స్టోరీ..

ఇద్దరూ సొంత పార్టీని వీడిన వారే?

విశాఖ నగరానికే తలమానికమైన ఫిషింగ్ హర్బర్, కేజీహెచ్, విశాఖ పోర్టు, జగదాంబ జంక్షన్, ఏవీఎన్ కాలేజీ వంటి ప్రముఖ సెంటర్లు.. ఉత్తరాంధ్ర ఇలవేల్పు కనకమహాలక్ష్మి దేవాలయం ఉన్న ప్రాంతం విశాఖ దక్షిణ నియోజకవర్గం. 2009లో ఏర్పాటైన ఈ నియోజకవర్గం అంతకు ముందు విశాఖ–1 కింద ఉండేది. ప్రస్తుతం 3 లక్షల ఓటర్లు ఉన్న దక్షిణలో తొలుత కాంగ్రెస్, ఆ తర్వాత రెండుసార్లు టీడీపీ గెలిచింది. ఈ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే వాసుపల్లి అధికార వైసీపీ తరఫున పోటీ చేస్తుండగా, జనసేన నుంచి మాజీ ఎమ్మెల్సీ వంశీకృష్ణయాదవ్ బరిలోకి దిగారు.ఈ ఇద్దరు కూడా సొంత పార్టీలను వీడి కొత్త పార్టీల్లో చేరి ఆయా పార్టీల్లో ఎమ్మెల్యే అభ్యర్థులుగా నిలవడం విశేషం. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్‌కుమార్?. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో వైసీపీ గూటికి చేరారు. ఇక వైసీపీ నగర అధ్యక్షుడిగా, ఎమ్మెల్సీగా పనిచేసిన వంశీకృష్ణయాదవ్ ఎమ్మెల్యే అవ్వాలనే తన జీవితాశయాన్ని నెరవేర్చుకునేందుకు జనసేనలో చేరి విశాఖ దక్షిణ సీటు దక్కించుకున్నారు.ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పైలట్ ఆఫీసర్‌గా పనిచేసిన వాసుపల్లి గణేశ్‌కుమార్ 1994లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత వైజాగ్ డిఫెన్స్ అకాడమీ అనే విద్య సంస్థను ప్రారంభించి, విద్యావేత్తగా రాణించారు. మత్స్యకార సామాజికవర్గానికి చెందిన గణేశ్‌కుమార్‌ను 2009లో పార్టీలోకి చేర్చుకుని దక్షిణం నుంచి ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చింది టీడీపీ. ఆ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాసరావు చేతిలో ఓటమి పాలైన వాసుపల్లి? 2014 ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఇక 2019లోనూ రెండోసారి గెలిచి సత్తా చాటుకున్నారు.గత ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం వైసీపీ హవా నడిచినా.. విశాఖ నగరంలోని నాలుగు నియోజకవర్గాలను టీడీపీ గెలుచుకుంది. ఐతే పార్టీలో విభేదాల వల్ల గణేశ్‌కుమార్ రెండోసారి ఎమ్మెల్యే అయిన కొద్దికాలానికే టీడీపీని వీడి వైసీపీలో చేరారు. అయితే అక్కడా ఆయన గ్రూప్‌వార్‌ను ఎదుర్కోవాల్సి వచ్చింది. కార్పొరేటర్లు సాధిక్, కందుల నాగరాజు, సీనియర్ నేత సీతంరాజు సుధాకర్‌తో పొసగక సతమతమయ్యారు వాసుపల్లి. ఐతే అధిష్టానం అండగా నిలవడంతో ఆ ముగ్గురిలో ఇద్దరు జనసేనలోకి.. మరొకరు టీడీపీలోకి వెళ్లిపోయారు.వృత్తిరీత్యా డిఫెన్స్ సర్వీసులో పని చేయడం వల్ల వాసుపల్లి వ్యక్తిగతంగా క్రమశిక్షణ ఉన్న పొలిటీషియన్‌గా పేరు తెచ్చుకున్నారు. ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు పేదలు, అభాగ్యులకు ఆర్థిక సహాయం చేస్తూ నియోజకవర్గంలో వ్యక్తిగత ఓటు బ్యాంకు పెంచుకున్నారు. ఇందువల్లే టీడీపీలో గెలిచి వైసీపీలోకి వెళ్లినా ప్రజల నుంచి వ్యతిరేకత లేకుండా పోయిందనే విశ్లేషణలు ఉన్నాయి. వైసీపీ అధిష్టానం కూడా గణేశ్‌కుమార్ వ్యక్తిగత చరిష్మాను గుర్తించి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చింది. ఇక వైసీపీలో చేరిన తర్వాత కూడా నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన గణేశ్‌కుమార్.. మూడోసారి గెలిచి వైసీపీకి కానుక ఇస్తానంటున్నారు.ఇక రెండుసార్లు టీడీపీ గెలిచిన విశాఖ దక్షిణ నియోజకవర్గాన్ని ఈ సారి పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించారు. ఆ పార్టీ అభ్యర్థిగా వంశీకృష్ణయాదవ్‌కు కేటాయించారు. విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన వంశీకృష్ణ 2009 నుంచి ఎమ్మెల్యే అవ్వాలని కలలు కంటున్నారు. ఒకసారి పీఆర్‌పీ నుంచి మరోసారి వైసీపీ నుంచి తూర్పులో పోటీ చేసి ఓడిపోయారు. ఐతే ఈ సారి తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను నియమించి, ఆయనకే టికెట్ ఇవ్వడంతో వైసీపీని వీడారు వంశీకృష్ణ యాదవ్. అంతేకాకుండా మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి ఇస్తామని ఆశచూపి కార్పొరేటర్‌గా పోటీ చేయించి వైసీపీ, ఆ హామీ నెరవేర్చకపోవడం వంశీకృష్ణలో అసంతృప్తికి కారణమైంది.ఈ ఏడాది ఆరంభంలో జనసేనలో చేరడం? విశాఖ దక్షిణ నుంచి టికెట్ దక్కించుకోవడం చకచకా జరిగిపోయింది. అయితే వంశీకృష్ణ కన్నా ముందు జనసేనలో చేరిన కార్పొరేటర్లు సాధిక్, కందుల నాగరాజు వంటివారు ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినా.. జనసేనాని పవన్ నచ్చజెప్పడంతో సైలెంట్ అయిపోయారు. కూటమి ఓట్ల బలంతో ఈ సారి ఎమ్మెల్యేగా గెలవడం పక్కా అంటున్నారు వంశీకృష్ణయాదవ్.మొత్తానికి ఎమ్మెల్యే అభ్యర్థులుగా తలపడుతున్న ఇద్దరు నేతలు.. కొత్త పార్టీలో గ్రూపు వార్‌ను అధిగమించి టికెట్ కైవసం చేసుకున్న వారే. ప్రజాక్షేత్రంలో తలపడే ముందు సొంత పార్టీలో క్యాడర్‌ను దారికి తెచ్చుకోవడానికి ఇద్దరూ ఎక్కువగా కష్టపడాల్సి వచ్చింది. ఇక పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వాసుపల్లి వ్యక్తిగత ఇమేజ్‌తోపాటు బలమైన సామాజికవర్గ నేపథ్యం, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నమ్ముకుంటుండగా, తూర్పు నుంచి దక్షిణకు వలస వచ్చిన జనసేన అభ్యర్థి వంశీకృష్ణ పూర్తిగా కూటమి ఓటు బ్యాంకుపైనే ఆధారపడుతున్నారు. ఇక ఓటర్లు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నదే ఉత్కంఠ రేపుతోంది.

# వలస బాట పడుతున్న విద్యార్థులు

మన యువతకు మన దేశంలోనే ఉద్యోగాలు దొరకకపోవడం వల్లనే కదా విదేశాలకు పరుగులు తీస్తున్నారు. మన పాలకులు మాత్రం ఓట్ల కోసం కోట్లు కోట్లు అప్పులు చేసి ఉచితాలపై రాయితీలపై సబ్సిడీలపై వ్యయం చేస్తున్నారు ఐక్యరాజ్య సమితి ప్రపంచ వలస రిపోర్టు 2022 ప్రకారం 1990 నుండి 2020 వరకు మన దేశం నుంచి 1.80 కోట్ల మంది వలసపోయారు.

2020 నాటికి ఒక్క అమెరికాలోనే 27 లక్షల మంది మనవారు స్థిరపడ్డారు. అమెరికాలో 45 లక్షల మంది, 25 లక్షలు, సౌదీలో 34 లక్షల మంది భారతీయులు స్థిరపడ్డారు, వీరు అధికంగా ఆయిల్ నిక్షేపాలున్న యునైటెడ్ అరబ్ దేశాల్లో పనిచేస్తున్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం 3.2 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వెళ్లిపోయి ఓవర్సీస్ ఇండియన్స్‌గా ఉన్నారు.

ప్రతి సంవత్సరం 25 లక్షల మంది భారతీయులు విదేశాలకు వలస పోతున్నారు ప్రపంచ బ్యాంకు ప్రకారం భారతదేశం జనాభా నిధిని సద్వినియోగం చేసుకోవడం లేదు. పేరుకేమో యంగ్ ఇండియా అయితే, ఈ యంగ్ యువత విదేశాల పాలవుతున్నది. జనాభాలో యువత ఎక్కువగా ఉంటే జనాభా నిధి అని అంటారు. మనదేశంలో చాలామందికి భూమిగానీ, పెట్టుబడులు గానీ, స్థిరాస్తులు గానీ లేవు. 90 శాతం ప్రజలకు వారి శ్రమే వారి జీవనాధారం. అతి తక్కువ ఆదాయాలతో ఉద్యోగ భద్రత లాంటివి లేని అభద్రతాభావంతో బ్రతుకు లాగుతున్న యువత... ఈ దేశంలో మనకు ఏముందిలే, ఎక్కడికో పోయి బ్రతుకుదాములే అనుకుంటూ, ఈ దేశ ఉత్పత్తి ప్రక్రియలో తమను ఉపయోగించుకునే వారే లేరని తీవ్ర నిరాశతో ఉన్నది.2014 ఎన్నికల్లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మాట ఏమైందో గానీ ఉన్న ఉద్యోగాలు పోయాయి. మన దేశ జీడీపీలో కుటుంబాల అప్పులు 2022-2023లో 40 శాతానికి చేరుకున్నది. ప్రజల పొదుపు శాతం మాత్రం ఐదు శాతానికి పడిపోయింది. ఇంత తక్కువ స్థాయిలో పొదుపు ఉండడం గత 47 సంవత్సరాల కాలంలో ఎప్పుడు లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలియజేస్తున్నది. 2011-12, 2019-20 మధ్య కాలంలో సగటున దేశ ప్రజల పొదుపు జీడీపీలో 7.6 శాతంగా ఉండేది. ప్రజల ఆదాయాలు క్రమంగా తగ్గిపోవడం వలన పెరుగుతున్న వినియోగ వ్యయం ఆదాయాల స్తబ్దత వలన మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలు అంటుతుండడం వలన పేదల వాటా జీడీపీలో క్రమంగా తగ్గిపోతున్నది.

ఐక్యరాజ్యసమితి ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ వారి ప్రకారం 34 వంతు ప్రజలు పోషక ఆహార లోపంతో ఉన్నందువలన గత్యంతరం లేక మన పాలకులు 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం, 50 కోట్ల మందికి ఉచిత ఆరోగ్య కార్డులు ఇవ్వాల్సి వస్తోంది. ప్రపంచంలోనే ఇది అతిపెద్ద వలస అని చెప్పాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు దేశ ఆర్థిక అభివృద్ధి ఎలా జరుగుతుంది సాధారణంగా తమ పిల్లలను బాగా చదివించగలిగితే తమ కుటుంబాలు బాగుపడతాయని తల్లిదండ్రులు భావిస్తారు. అయితే వారి ఆదాయ స్థాయి అంతంత మాత్రమే. అటువంటప్పుడు ప్రభుత్వాలే యువతకు కావలసిన సౌకర్యాలపై అంటే విద్య వైద్యం సాంకేతిక పరిజ్ఞానం తదితర వాటిపై ఖర్చుపెట్టి వీరిని దేశాభివృద్ధికి ఉపయోగించుకోవాలి. 2040 నాటికి మన జనాభాలో 59 శాతం మంది యువకులే ఉంటారు. వీరు మన దేశ అభివృద్ధికే కాకుండా ప్రపంచ దేశాల అభివృద్ధికి కూడా తోడ్పడుతూ, ప్రపంచానికే మెరిసే స్టార్స్ లాగా ఉంటారు. అయితే వారికి కావాల్సిన విద్య, వైద్య, ఆహారం తదితర వాటిపై ఖర్చు చేసే వారేరి. ఇండియా ఎంప్లాయిమెంట్ రిపోర్ట్ 2024 ప్రకారం భారతదేశంలో పని చేసే వయసు వారు (15–59) 2011లో 61 శాతం ఉండగా 2021 నాటికి 64 శాతానికి పెరిగింది. మన యువతలో ప్రతి సంవత్సరం 8 మిలియన్ల మంది ఉద్యోగాల కోసం ఎగబడుతున్నారు. అయితే ఆర్థిక కార్యకలాపాలలో వీరి శాతం 2011లో 52 శాతంగా ఉండగా, 2021 నాటికి 37 శాతానికి పడిపోయింది. 2022 లో నిరుద్యోగ యువత మొత్తం నిరుద్యోగులలో 82.9 శాతం అని ఈ నివేదిక తెలియజేసింది.జనాభాలో పనిచేసే వయసులో ఉన్న వారి శాతం పెరుగుతుంటే యువశక్తి పెరుగుదలకు చిహ్నం.ఆర్థిక అభివృద్ధిలో క్రియాశీలకంగా పాలుపంచుకునేది దేశాన్ని మునుముందు నడిపించేది యువతే. అటువంటిది వారే నిరాశ నిస్పృహలతో పని పాట లేకుండా ఉంటే ఈ దేశానికి దిక్కెవరు? పాలకులు నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేస్తున్నందున యువత జాతి నిర్మాణంలో భాగస్వాములు కాలేకపోతున్నారు. మన పాలకులు వ్యవహరించే విధానాల వలన కోట్లకొలది యువతీ యువకులు నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. దీనివల్ల కుటుంబం సమాజం దేశం అశాంతికి గురవుతోంది. యువతలో నూతన ఉత్సాహం నింపి జీవితం పట్ల ఆశలు రేకెత్తించే అలాంటి విధాన కార్యక్రమాలు రూపొందించి చేపడితే, పాలకులు త్రికరణ శుద్ధిగా యువతీ యువకులను అధునాతన ప్రపంచంలో మమేకం చేయగలిగితే, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కాలాన్ని మించిన వేగంతో యువత పరిగెత్తగలదు. డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువత వ్యవసాయ కూలీలుగా పనిచేస్తున్న వైనం పాలకులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కావడం లేదు. జనాభా నిధిగా ఉన్న యువతను మన దేశ ఆర్థిక అభివృద్ధిలో క్రియాశీలకంగా పాలుపంచుకునే విధంగా చేయనిదే ప్రపంచ దేశాలలో మనదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కావడం అసంభవం.

# వైఎస్ వారసత్వం కోసం పోరాటం...

విజయవాడ, కడప, ఏప్రిల్ 27, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనదైన ముద్ర వేశారు. ఆయన ఆకస్మిక మరణంతో అప్పటికే ఎంపీగా ఎన్నికైన వైఎస్ జగన్మోహన్ రెడ్డి వారసుడిగా తెరపైకి వచ్చారు. ఆయనను గుర్తించినా సీఎం పదవిని ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ నిరాకరించింది. చాలా మంది సీనియర్లు ఉన్నందున ఉన్న పళంగా సీఎం పదవి ఇవ్వడం సాధ్యం కాదని చెప్పడంతో ఎమ్మెల్యేలంతా సానుకూలంగా ఉన్నా సరే హైకమాండ్ అంగీకరించలేదు. కారణం ఏదైనా కాంగ్రెస్ లో భవిష్యత్ ఉండదని డిసైడ్ చేసుకున్న జగన్మోహన్ రెడ్డి సొంత పార్టీ పెట్టుకున్నారు. ఆ సమయంలో ఆయన వెంట కుటుంబం మొత్తం ఉంది. వైఎస్ వివేకానందరెడ్డి మాత్రం కాంగ్రెస్ హయాంలో మంత్రిగా కొనసాగినా.. ఉపఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసినా తర్వాత జగన్ దగ్గరకే చేరుకున్నారు. వైఎస్ కుటుంబం అంతా ఏకగ్రీవంగా వైఎస్ జగన్ ను వైఎస్ఆర్ తరహాలో రాజకీయ వారసుడిగా అంగీకరించింది. ఆయననే కుటుంబపెద్దగా భావించడం ప్రారంభించింది. కానీ ఎప్పుడైతే వివేకానందరెడ్డి హత్య జరిగిందో అప్పట్నుంచి కథే మారిపోయింది.జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన వెంట కుటుంబం అంతా ఉంది. ఆయన ఏ నినాదం అందుకుంటే దాన్నే ప్రజలకు చెప్పారు. వైఎస్ మరణం వెనుక సోనియా ఉందని ఆరోపిస్తే అదే చేశారు. వైఎస్ మరణం వెనుక రిలయన్స్ ఉందంటే అదే చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని అంటే అదే చెప్పారు. జగన్ కేసుల పాలయితే ఆయనకు అండగా ఉన్నారు. షర్మిల మూడు వేల కిలోమీటర్లకుపైగా పాదయాత్ర చేశారు. ఇలా ఏకతాటిపైకి ఉన్న వైఎస్ ఫ్యామిలీలో వివాదాలు ఎప్పుడూ బయటపడలేదు. వైఎస్ హయాంలో ఉన్నంతే ఐక్యంగా ఉందనుకునేవారు. కానీ కుటుంబం అంతా కష్టపడి వైసీపీని అధికారంలోకి తెచ్చిన తర్వాత .. జగన్ సీఎం అయిన తర్వాత పరిస్థితి మారిపోయింది. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేంద్రంగా పూర్తిగా చీలిపోయింది. వైఎస్ జగన్, షర్మిల మధ్య ఆస్తుల పంపక వివాదాలు చోటు చేసుకోవడంతో అవి పెరిగిపోయాయి. అవి ఎంత పెరిగిపోయాయంటే ఇక ముందు కలుసుకోలేనంతగా పెరిగిపోయాయి. సొంత మేనల్లుడి పెళ్లికి జగన్మోహన్ రెడ్డి దంపతులు వెళ్లలేదు. తల్లి తర్వాత మేనమామేనే బాధ్యతలు తీసుకోవాలని చెబుతారు. కానీ రాజకీయంగా.. ఆస్తుల వివాదాలతో వచ్చిన గొడవల కారణంగా ఈ బంధాల్ని జగన్ కాదనుకున్నారు. ఫలితంగా గ్యాప్ పెరిగిపోయింది. వైసీపీ కోసం ప్రత్యక్షంగా పోరాటాలు చేసిన షర్మిల ఎప్పుడూ ఎన్నికల బరిలో దిగాలని అనుకోలేదు. పదవి కోసం ప్రయత్నించారని కూడా ఎప్పుడూ ప్రచారం జరగలేదు. కానీ రాజకీయంగా ఎంతో కష్టపడిన షర్మిల తనకు ప్రాదాన్యం కావాలని కోరుకున్నారు. కానీ ఆమె ఆకాంక్షల్ని జగన్ గుర్తించలేదు. కడప లోక్ సభ సీటు లేదా రాజ్యసభ సీటు ఇవ్వడానికి సిద్ధపడలేదు. అదే సమయంలో ఆస్తులు పంచడానికి కూడా నిరాకరించారు. చివరికి ఏమనుకున్నారో కానీ తాను సొంత పార్టీ పెట్టుకోవాలని డిసైడయ్యారు. అయితే ఏపీలో కాకుండా తెలంగాణలో పెట్టుకున్నారు. అక్కడ ఏ మాత్రం క్లిక్కయ్యే అవకాశం లేకపోవడంతో ఏపీలో అడుగు పెట్టారు. పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి.. ఏపీ పీసీసీ బాధ్యతలు తీసుకున్నారు. ఇది వైసీపీ అధినేత జగన్ కు మరింత కోపం తెప్పించింది. ఆమె పార్టీ పెడితే నష్టం జరిగేది తనకేనని అర్థం కావడంతో ఇతర పార్టీల నేతల మాదిరిగానే ఆమెను టార్గెట్ చేయడం ప్రారంభించారు. అదే వివాదాస్పదమవుతోంది. ఆమె చంద్రబాబు చెప్పినట్లుగా చేస్తున్నారని ఆరోపిస్తూ రాజకీయంగా కార్నర్ చేస్తున్నారు. కానీ షర్మిల మాత్రం ధీటుగా నిలబడేందుకు ప్రయత్నిస్తున్నారు. షర్మిల నిన్నటి వరకూ జగన్ కు సోదరి ఇప్పుడు ప్రత్యర్థి పార్టీ నేత. ఇక బంధులెక్కడ ఉంటాయని వైసీపీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ విశాఖలో వ్యాఖ్యానించారు. దానికి కారణం సోదరుడు అయిన జగన్మోహన్ రెడ్డి సోదరి అయిన ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల పసుపు చీర కట్టుకున్నారని నిందిచడం. అలాంటి వారు వైఎస్ వారసులు ఎలా అవుతారని జగన్ పులివెందుల ప్రజల్ని ప్రశ్నించారు. సోదరి కట్టుకున్న చీర గురించి మాట్లాడటం వివాదాస్పదమయింది. షర్మిల కూడా జగన్ ది గుండెనా ..బండనా అని గట్టిగా ప్రశ్నించారు. సీబీఐ చార్జిషీట్‌లో తాను తప్పించుకోవడానికి తండ్రి వైఎస్ఆర్ పేరును పెట్టించింది జగనేనని ..ఆయన ఎలా వారసుడు అవుతారని షర్మిల ప్రశ్న. వైఎస్ షర్మిల ఇప్పటి వరకూ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ ఇప్పుడు కడప నుంచే బరిలోకి దిగుతున్నారు. న్యాయం చేయమని కొంగుచాపి ఓట్లు అడుగుతున్నారు. వైసీపీ తరపున అవినాష్ రెడ్డి బరిలోకి దిగుతున్నారు. ఇక్కడ అభ్యర్థి అవినాష్ రెడ్డి కాదు తానే అన్నంతగా జగన్ ఆయనను సపోర్ట్ చేస్తున్నారు. చెల్లెలు షర్మిల కన్నా అవినాష్ రెడ్డి తనకు దగ్గర అని పులివెందుల సభలో చెప్పకనే చెప్పారు. అంటే ఇప్పుడు కడప బరిలో జగన్ వర్సెస్ షర్మిల పోటీ అనుకోవచ్చు. ఇప్పటి వరకూ కడప ప్రజలంతా వైఎస్ రాజకీయ వారసుడిగా జగన్మోహన్ రెడ్డినే గుర్తించారు. వారికి మరో ఆప్షన్ లేదు. ఎందుకంటే కుటుంబం అంతా ఏకతాటిపైన ఉంది. కానీ ఇప్పుడు కుటుంబం రెండు రకాలుగా చీలిపోయింది. కుటుంబం చీలిపోయినట్లుగా ప్రజలు కూడా ఇప్పుడు జగన్ లేదా షర్మిల ఎవరో ఒకరి వైపు నిలబడాల్సి ఉంది. షర్మిల గెలవకపోయినా గట్టి పోటీ ఇచ్చినా ఆమె వైఎస్ రాజకీయ వారసత్వం చేపట్టడానికి గట్టి పోటీదారుగానే భావిస్తారు. అదే జరిగితే ఆ రాజకీయ వారసత్వ పోరాటం రాష్ట్రం మొత్తం విస్తరిస్తుంది. జగన్మోహన్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో ప్రతికూల ఫలితాన్ని అనుభవిస్తే ఆయన ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందులో వైఎస్ కు తానే రాజకీయ వారసుడ్నని నిరూపించుకోవడం కూడా ఒకటి.

# దివంగత సాయన్నను అవమానించిన కేసీఆర్

సికింద్రాబాద్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దివంగత ఎమ్మెల్యే సాయన్న కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరపకపోవడం దళిత ఎమ్మెల్యే ను అవమానించడమే అని కంటోన్మెంట్ భాజపా అభ్యర్థి వంశిశ తిలక్ అన్నారు..దివంగత ఎమ్మెల్యే సాయన్న పట్ల కెసిఆర్ కు సానుభూతి లేనప్పుడు ఆయన కుటుంబాన్ని సభ్యులపై కంటోన్మెంట్ ప్రజలు సానుభూతి చూపాల్సిన అవసరం లేదని కంటోన్మెంట్ భాజపా అభ్యర్థి వంశా తిలక్ అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మూడవ వార్డులోని కేకే నగర్ లో భాజపా కార్నర్ మీటింగ్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ లో భాజాపాకు ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్టే అని అన్నారు.

# వాళ్లంతా బంగారు కొండలే...

విజయవాడ, ఏప్రిల్ 27, ఏపీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల నుంచి మహిళా అభ్యర్థుల దగ్గర ఎంత బంగారం ఉందన్నది పరిశీలిస్తే ఆసక్తికర అంశాలు వెలుగుచూశాయి.

కడప టీడీపీ అభ్యర్థి మాధవి రెడ్డి దగ్గర 6.5 కేజీల బంగారం ఉంది. డైమండ్ ఆర్నమెట్స్ కూడా అఫిడవిట్‌లో బాగానే చూపించారు.

మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ విషయానికి వద్దాం. పెనుకొండ వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న ఉషశ్రీ దగ్గర 6.6 కేజీల బంగారం ఉంది.

ఇక విశాఖ వైసీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ దగ్గరకు వస్తే మూడున్నర కిలోలు పసిడి ఉంది. 19 కోట్ల వరకూ కుటుంబ ఆస్తులు ఉన్నాయి.. పడిసి మూడున్నర కిలోలుగా చూపించారు.

అటు కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి షర్మిల దగ్గర మూడున్నర కోట్ల బంగారం ఉంది. అంటే.. 6 కేజీలకు పైగా బంగారు నగలున్నాయన్నారు.. వీటితోపాటు 4 కోట్ల 61 లక్షల విలువ చేసే వజ్రాల ఆభరణాలు ఉన్నాయని అఫిడవిట్‌లో తెలిపారు.

ఇక ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి పోటీ చేస్తున్నారు బుట్టా రేణుక. ఆమె దగ్గర 2.3 కేజీల బంగారం ఉంది. అఫిడవిట్ ప్రకారం రేణుక ఆస్తులు 161 కోట్లు.. ఐతే.. బంగారం మాత్రం 2.3 కేజీలు ఉంది.

టెక్కలి నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి తన దగ్గర సుమారు 2.5 కేజీల బంగారం ఉంది. అరకు లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కొత్తపల్లి గీత దగ్గర రెండుకిలోల పసిడి ఉన్నట్లు తెలుస్తోంది.

నరసాపురం వైసీపీ ఎంపీ అభ్యర్థి ఉమాబాల దగ్గర రెండు కిలోల బంగారం ఉంది.

ఐతే మహిళా అభ్యర్థులను మించి బంగారం ఉన్న పురుష అభ్యర్థులు కొందరున్నారు. వారిలో మొదటి స్థానంలో ఉన్నది అనకాపల్లి పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్.

అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి రమేశ్ దగ్గర మొత్తం 13 కిలోల బంగారం ఉంది.టెక్కలిలో టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడిపై పోటీ చేస్తున్న వైసీపీ నేత దువ్వాడ శ్రీనివాస్ దగ్గర నాలుగున్నర కిలోలు పసిడి ఉంది.

విజయవాడ వెస్ట్ బీజేపీ అభ్యర్థి సుజానా చౌదరి దంపతుల దగ్గర 11 కిలోలు బంగారం ఉండగా.. దీని విలువ రూ. 10 కోట్లు పైనే.

గన్నవరం టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకటరావు వద్ద ఉన్నది 138 గ్రాముల బంగారమే అయినా ఆయన భార్య పేరిట 5 కేజీల 687 గ్రాముల బంగారం ఉంది.

ఇక హిందూపురం టీడీపీ అభ్యర్థి, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ భార్య దగ్గర మూడున్నర కిలోల బంగారం ఉంది.

# హరీష్ రావు ట్రాప్ లో రేవంత్...

హైదరాబాద్, ఏప్రిల్ 27, తెలంగాణలో అధికారం కోల్పోయాక రాష్ట్రంలో పార్టీ అధినేత కేసీఆర్, ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు వ్యూహాలు తేలిపోతున్నాయి. మరోవైపు కీలక నేతలు పార్టీని వీడుతున్నారు. వారిని కట్టడి చేయడంలోనూ త్రిమూర్తులు(కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ) విఫలమవుతున్నారు. అధికార పక్షాన్ని ఇరుకున పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకపోగా, బూమరాంగ్ అవుతున్నాయి. అధికార కాంగ్రెస్‌కే ఫేవర్‌గా మారుతున్నాయి.వ్యూహాలు విఫలమవుతున్నా.. ఎత్తుగడలు చిత్తవుతున్నా.. అధికార పార్టీని ఇరుకున పెట్టే ప్రయత్నాలు మానడం లేదు. అదే జరిగితే పార్టీ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని గులాబీ నేతలకు తెలుసు. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డి విసిరిన ఓ సవాల్ ఇప్పుడు బీఆర్‌ఎస్‌కు బలం తెచ్చింది. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని, అప్పుడు హరీశ్‌రావు రాజీనామా చేయాలని సవాల్ చేశారు. దీనికి హరీశ్‌రావు తగ్గేతే లేదంటూ ముందుకు వచ్చారు. రుణమాఫీతోపాటు ఆరు గ్యారంటీలు అమలు చేయాలని, అలా చేస్తే తాను రాజీనామా చేయడంతోపాటు ఉప ఎన్నికల్లోనూ పోటీ చేయనని ప్రకటించారు. అంతటితో ఆగకుండా అమరవీరుల స్థూపం వద్ద ప్రమాణం చేద్దామని, రాజీనామా పత్రంతో రావాలని సవాల్ చేశారు. దీంతో రేవంత్‌ను డిఫెన్స్‌లో పడేశారు.హరీశ్ సవాల్‌కు రేవంత్‌రెడ్డి కూడా స్పందించారు. డెడ్‌లైన్‌లోపే రుణమాఫీ చేసి చూపిస్తామని ప్రకటించారు. అలా చేస్తే బీఆర్‌ఎస్ పార్టీని రద్దు చేస్తావా.. అని ప్రశ్నించారు. రుణమాఫీపై ఎంత చర్చ జరిగితే కాంగ్రెస్‌కు అంత మేలు జరుగుతుందని సీఎం రేవంత్ భావిస్తున్నారు. కానీ, ఇది హరీశ్‌రావుకే అడ్వాంటేజ్ అవుతుందని ఊహించడం లేదు. హరీశ్ తనకు పదవికన్నా ప్రజల సమస్యలే ముఖ్యమని సెంటిమెంటు రాజేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లూ బీఆర్‌ఎస్‌కు చిక్కని రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు హరీశ్ ట్రాప్‌లో పడినట్లు కనిపిస్తోందని విశ్లేషకులు బావిస్తున్నారు. మరోవైపు రుణమాఫీపై చర్చ తమకే లాభిస్తుందని రేవంత్‌రెడ్డి భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్‌ఎస్‌పై ఆగ్రహంగా ఉన్న ?రైతులు లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి షాక్ ఇస్తారని లెక్కలు వేసుకుంటున్నారు.

# మల్కాజ్ గిరిలో భారీగా నామినేషన్లు

హైదరాబాద్, ఏప్రిల్ 27, తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో ఒక ఘట్టం ముగిసింది.ఉపసంహరణకు ఏప్రిల్ 29 వరకు సమయం ఉంది. మే 13న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఫలితాలు ప్రకటిస్తారు.. మొత్తం 17 నియోజకవర్గాలు ఉండగా 1,488 నామినేషన్లు వచ్చాయి. ఇక తెలంగాణలోని 17 స్థానాల్లో ప్రస్తుతం 9 బీఆర్‌ఎస్ ఖాతాలో ఉండగా, బీజేపీ 4, కాంగ్రెస్ 3, ఎంఐఎం 1 స్థానంలో గెలిచాయి.ఇదిలా ఉంటే పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్‌కు ముందే కాంగ్రెస్ 2019లో తెలంగాణలో గెలిచిన మూడు లోక్‌సభ స్థానాలు ఖాళీ అయ్యాయి. రేవంత్ పోటీ చేసిన మల్కాజ్‌గిరి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గెలిచిన నల్గొండ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గెలిచిన భువనగిరి స్థానాలకు వారు రాజీనామా చేశారు. ముగ్గురూ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతో ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత జరుగుతున్న లోక్‌సభ ఎన్నికలను కాంగ్రెస్ ఛాలెంజ్‌గా తీసుకుంది. జాతీయ నాయకత్వం కూడా భారీగా ఆశలు పెట్టుకుంది. తెలంగాణ, కర్ణాటకలో మెజారిటీ సీట్లు గెలవాలని భావిస్తోంది. ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. 2019లో రేవంత్‌రెడ్డి పోటీ చేసిన మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానానికి ఈసారి డిమాండ్ పెరిగింది. మినీ ఇండియాగా భావించే ఇక్కడ అన్నిరకాల ప్రజలు ఉంటారు. అన్ని రాష్ట్రాలవారు ఉంటారు. దీంతో ఇక్కడి నుంచి పోటీచేస్తే స్థానికత అంశం ప్రభావం చూపదని చాలా మంది భావిస్తారు. అందుకే ఈసారి ఇక్కడి నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా 177 నామినేషన్లు దాఖలయ్యాయి. దీని తర్వాత నల్గొండ, భువనగిరి నియోజకవర్గాలు రెండో స్థానంలో నిలిచాయి. ఈ నియోజకవర్గాల్లో 114 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. ఇత మూడో స్థానంలో పెద్దపల్లి లోక్‌సభ స్థానం నిలిచింది. ఇక్కడ 109 నామినేషన్లు వచ్చాయి.ఇక రాష్ట్రంలోని మిగతా నియోజకవర్గాలకు దాఖలైన నామినేషన్లు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ ? 42, కరీంనగర్ ? 94, నిజామాబాద్?90, జహీరాబాద్?68, మెదక్?90, సికింద్రాబాద్?75, హైదరాబాద్?85, చేవెళ్ల?88, మహబూబ్‌నగర్?72, వరంగల్?89,

## వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు

గుడివాడ పూర్తి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారంగానే.... వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొడాలి నాని తన నామినేషన్ ధ్రువపత్రాలను సమర్పించారని వైఎస్ఆర్సిపి జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు అన్నారు.

గుడివాడ వైఎస్ఆర్సిపి ఎన్నికల కార్యాలయంలో కొడాలి నాని నామినేషన్ రాద్ధాంతం పై.... మండలి హనుమంతరావు ప్రెస్ మీట్ నిర్వహించారు. మండలి హనుమంతరావు మాట్లాడుతూ అయిపోయిన పెళ్లికి బాజాలు మోగించినట్లు.... టిడిపి నేతలు రాద్ధాంతం చేశారు. ఎన్నికలకు ముందే ఓటమి భయంతో.... టిడిపి వాళ్లు రాద్ధాంతం చేస్తున్నారు.కొడాలి నాని నామినేషన్ చెల్లదంటూ ఎల్లో మీడియాలో దుష్ప్రచారం.కనీసం ఎన్నికల నిబంధనలపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన లేనివారు.... నామినేషన్ వేసిన తర్వాత వారిలో జ్ఞానం కలిగించాలని కాండేట్ హెల్ప్ హ్యాండ్ బుక్ ఇస్తారు. కనీసం దానిలో ఉన్న నిబంధనలు పరిశీలించిన.... టిడిపి నేతలకు బుద్ధి వచ్చి ఉండేది. కనీసం అవగాహన లేని వ్యక్తులు నామినేషన్ స్క్రూటీనీలకు వచ్చి కామెడీ షో చేశారు.ఎన్నికల నిర్వహణలో ఆ నియోజకవర్గానికి చెందిన రిటర్నరింగ్ అధికారిదే తుది నిర్ణయం.ఆర్వో తీసుకున్న నిర్ణయాన్ని కోర్టులో కూడా సవాలు చేయలేరు. ఎవరైనా అభ్యర్థి నామినేషన్ పై అభ్యంతరం ఉంటే.... స్క్రూటిని కార్యక్రమం జరుగుతున్న సమయంలో.... ఆ అభ్యర్థి నామినేషన్ పత్రం వచ్చినప్పుడు తెలియజేయాలి. కొడాలి నాని నామినేషన్ వెరిఫికేషన్ పూర్తౌ.... ఆర్వో సంతకం కూడా అయిపోయిన తర్వాత.... కేవలం న్యూసెన్స్ క్రియేట్ చేయడానికే టిడిపి వాళ్లు రాద్ధాంతం చేశారు.సత్య దూరమైన అంశాలను తీసుకువచ్చి.... ఆర్డీవో కార్యాలయంలో టిడిపి వాళ్లు నాన్నా రభస చేశారు. స్క్రూటిని కార్యక్రమాన్ని పక్కదారి పట్టించి ఆర్వోను బెదిరిస్తూ.... లబ్ధి పొందాలనుకుని వారు చేసిన ప్రయత్నం విఫలమవ్వడంతో..... పిచ్చెక్కినట్లు రోడ్డెక్కి టిడిపి వాళ్లు నానా యాగి చేశారని ఆరోపించారు.

ఈ మీడియా సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అద్దేపల్లి పురుషోత్తం, పార్టీ నాయకులు కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, వల్లూరిపల్లి సుధాకర్ పాల్గొన్నారు.

# ఠాణాకు చేరుతున్న లైసెన్స్ గన్స్

కరీంనగర్, ఏప్రిల్ 27 పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఠాణాకు చేరాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 263 లైసెన్సుడ్ ఆయుధాలున్నాయి. ఇందులో వ్యక్తిగతంగా వినియోగిస్తున్న 201 ఆయుధాలను సంబంధిత వ్యక్తులు పోలీస్ స్టేషన్ లో డిపాజిట్ చేశారు. మిగతా 62 ఆయుధాలను వివిధ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల భద్రత కోసం వినియోగిస్తున్నారు. అప్పగించిన ఆయుధాలను లైసెన్సుదారులు జూన్ 7న తిరిగి పొందే అవకాశం ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ నాటికే లైసెన్సు కలిగిన ఆయుధాలను అప్పగించాలని పోలీసు శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఆలోపే పోలీసు శాఖ నుంచి వెళ్లిన సమాచారం మేరకు లైసెన్సు దారులు తమ పరిధిలోని ఠాణాలకు అప్పగించారు.కరీంనగర్ జిల్లాలో లైసెన్సు కలిగిన ఆయుధాలు 114, ఇప్పటి వరకూ 89 పోలీసులకు అప్పగించారు. పెద్దపల్లి జిల్లాలో 61 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉండగా 44, జగిత్యాల జిల్లాలో 56 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉండగా 45, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 32 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉండగా 23 సంబంధిత పోలీస్ స్టేషన్ లో డిపాజిట్ చేశారు. వ్యక్తిగత భద్రత కోసం లైసెన్సు తీసుకుని వెంట ఉంచుకున్న ఆయుధాలను ఉమ్మడి జిల్లావాసులు ఠాణాలకు అప్పగించారు. లోక్ సభ ఎన్నికలసందర్భంగా ఆయుధాలను అప్పగించాలని పోలీసు శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు వంద శాతం డిపాజిట్ చేశారు. ఆయుధాల చట్టం 1959 సెక్షన్ 21 ప్రకారం వ్యక్తిగత తుపాకీ లైసెన్సు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ లలో ఆయుధాలను అప్పగించాల్సి ఉంటుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉండటంతో ఈ నిబంధన అమలులో ఉంది.వ్యక్తిగత భద్రత కోసం ఎవరైనా ఆయుధాలు పొందే అవకాశం ఉంది. 1959 చట్టం ప్రకారం తుపాకీ లైసెన్సు కావాలనుకునే వారు

# మాస్ మాధవి....

హైదరాబాద్, ఏప్రిల్ 27, తెలంగాణలో అన్ని లోక్‌సభ నియోజకవర్గాల కంటే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది మాత్రం హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గమే. ఎందుకంటే ఇందుకు ప్రత్యేక కారణాలున్నాయి. ఒకరు ముస్లింపార్టీకి చెందిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేస్తుండగా, ఆయనపై రూపంలోనూ, భాష?యంలోనూ హిందుత్వాన్ని కనపరుస్తున్న కొంపెల్ల మాధవీలత బీజేపీ నుంచి బరిలోకి దిగుతుంది. కొంపెల్ల మాధవీలత ఎంపికే అనూహ్యంగా జరిగింది. ఎందుకంటే ఆమె బీజేపీలో ఉన్నట్లు ఎప్పుడూ కనిపించలేదు. పార్టీ కార్యక్రమాలలో కూడా ఆమె ఎక్కడా కనపడలేదు. అసలు పార్టీ సభ్యత్వం ఉందో కూడా తెలీని పరిస్థితుల్లో కొంపెల్ల మాధవీలతను బీజేపీ తమ పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసింది.కొంపెల్ల మాధవీలత ఎంపిక ఆషామాషీగా జరగలేదు. ఆమె హైదరాబాద్ లో పేరెన్నికగన్న విరించి ఆసుపత్రి అధినేత సతీమణి. డబ్బుకు కొదవలేదు. మంచి మాటకారి. మొన్నటి వరకూ కొంపెల్ల మాధవీలత అంటే ఎవరికీ తెలియదు. కానీ కొన్ని నెలల నుంచి సోషల్ మీడియాలో ఆమె వీడియోలు వైరల్ అవుతున్నాయి. హిందుత్వ గురించి ఆమె చెప్పే విధానం అందరినీ ఆకట్టుకుంటుంది. పక్కా హిందుత్వ వాదిగా ఆమె స్క్రీన్ పై కనపడుతుండటం కూడా కొంత కలసి వచ్చిందనే అంటున్నారు. అందుకే మరో విషయాన్ని ఆలోచించకుండా బీజేపీ కేంద్ర నాయకత్వం కొంపెల్ల మాధవీలత ను హైదరాబాద్ బీజేపీ అభ్యర్థిగా ఎంపిక చేసిందన్న కామెంట్స్ కూడా పార్టీలోనే వినపడుతున్నాయి నిజానికి అసదుద్దీన్ ఒవైసీని పాతబస్తీలో ఎదుర్కొనడం అంత ఆషామాషీ కాదు. 1984 నుంచి 2004 మధ్య ఎంఐఎం అధినేత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ ఆరు సార్లు ఎంపీగా అక్కడ గెలిచారు. ఆ తర్వాత 2004 నుంచి నాలుగు ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ ఇక్కడ జెండా పాతేశారు. పాతబస్తీలో గెలుపు అంటే అంత సులువు కాదు. ఇప్పటికే పాతబస్తీలో అనేక దొంగ ఓట్లను తొలగించడంలో కొంత వరకూ సక్సెస్ అయ్యారని బీజేపీ వర్గాలు ఒకింత సంతోషంగా ఉన్నాయి. దొంగ ఓట్ల తోనే ఎప్పుడూ గెలుస్తారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. కానీ అసద్ భాయ్ ను ఓడించడం అంటే మాటలు కాదు. కానీ కొంపెల్ల మాధవీలత కు తొలి జాబితాలోనే సీటు దక్కడం చర్చనీయాంశంగా మారింది. మాధవీలత పుట్టింది పాతబస్తీలోనైనా ఆమె గెలవగల సత్తా ఉందా? అన్నదే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వేషధారణ చూసి ఆమెను తక్కువగా కూడా అంచనా వేయలేం. ఆమె నిజాం కళాశాలలో డిగ్రీ చదివారు. కోటిలోని ఉమెన్స్ కాలేజీలో పొలిటికల్ సైన్స్ లో పీజీ చేశారు. భరత నాట్య కళాకారిణిగా కూడా గుర్తింపు ఉంది. పాత బస్తీలో అనేక సేవా కార్యక్రమాలను గత కొద్ది రోజులుగా నిర్వహిస్తూ వెళుతున్నారు. అదే ఆమెకు కలసి వచ్చిందంటున్నారు. సోషల్ మీడియాలో వ్యూస్ వచ్చాయని ఓట్లు పడతాయా? అంటే ఆ ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకదు. కానీ కొంపెల్ల మాధవీలత మాత్రం తాను పోటీలో ఉన్నానని మాత్రం బాహ్య ప్రపంచానికి చెబుతున్నారు. అసద్ ను నిజంగా ఓడించగలిగితే మాధవీ లత రికార్డుకు ఎక్కుతారు. అంతేకాదు దేశంలోనే జెయింట్ కిల్లర్ గా నిలుస్తారనడంలో సందేహం లేదు. కానీ అది సాధ్యం కావడానికి మాత్రం అవకాశాలు చాలా స్వల్పంగా ఉన్నాయంటున్నారు విశ్లేషకులు. మరి కొంపెల్ల మాధవీలత ఏ మేరకు ఓట్లు సాధిస్తారన్నది చూడాల్సి ఉంది.

# రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు

హైదరాబాద్, ఏప్రిల్ 27 తెలంగాణలో రిజర్వేషన్ రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల ప్రచార అంశాలుగా రిజర్వేషషన్ల అంశాన్ని తీసుకుంటున్నాయి. బీజేపీ అగ్రనేత అమిత్ షా తెలంగాణలో బహిరంగసభలో ప్రసంగించి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. వాటిని ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో చోట ఇదే రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు.కేంద్రంలో మరోసారి బీజేపీ వస్తే రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేస్తుందని హెచ్చరించారు. ఆ పార్టీ ఆ దిశగానే ప్రయత్నిస్తోందని మరోసారి అధికారంలోకి వస్తే అదే చేస్తుందని అంటున్నారు. ఇలా జాతీయ పార్టీలు రెండు రిజర్వేషన్ల చుట్టూ ఓటింగ్ ప్రయారిటీ సెట్ చేసే ప్రయత్నం చేయడం రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో బీజేపీ బలం పెంచుకోవడానికి? మొదటి నుంచి ఓ అస్త్రం ప్రయోగిస్తోంది. అదే ముస్లిం రిజర్వేషన్ల రద్దు. అమిత్ షా ఎప్పుడు తెలంగాణ పర్యటనకు వచ్చినా.. ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడినా ముస్లిం రిజర్వేషన్ల గురించి ఖచ్చితంగా ప్రస్తావిస్తారు. ముస్లింలకు ఇప్పుడు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. చెప్పడానికి ముస్లిం రిజర్వేషన్లు అంటున్నారు కానీ.. అవి ముస్లింలలో ఆర్థికంగా బాగా వెనుకబడిన 14 ఉపకులాలకు చెందినవారికి ఉన్నాయి. వైఎస్ హయాంలో ముస్లింలను ఆకట్టుకోవడానికి వీటిని ఇచ్చి కులాల జాబితాలో ఆయా వర్గాలను చేర్చారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం ప్రకారం చెల్లవు. అందుకే ఈ రిజర్వేషన్లు ఎప్పటికప్పుడు వివాదం అవుతూనే ఉన్నాయి. వీరికి ఉన్న రిజర్వేషన్లను పన్నెండు శాతానికి పెంచుతామని ఉద్యమ సమయంలో కేసీఆర్ హామీ ఇచ్చారు. తర్వాత అసెంబ్లీలో తీర్మానం చేశారు ఆ తీర్మానం తర్వాత కేసీఆర్ కూడా పట్టించుకోలేదు. మునుగోడు ఉపఎన్నికలకుముందు ఎస్సీ రిజర్వేషన్లపై అధికారం లేకపోయినా జీవవో ఇచ్చారు కానీ.. ముస్లిం రిజర్వేషన్లకు ఇవ్వలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు మందు కర్ణాటకలో ఇలా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తూ అప్పటి బీజేపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. కానీ సుప్రీంకోర్టులో ఆగిపోయింది. కర్ణాటకలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నాయి.వాటిని రద్దుచేసి నాలుగు శాతాన్ని లింగాయత్, ఒక్కలిగలకు చెరో రెండు శాతాన్ని పంచుతున్నట్లు ప్రభుత్వం జీవో ఇచ్చింది. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకమని, అందుకే ఈ రిజర్వేషన్లను రద్దు చేస్తున్నామని అప్పటి బీజేపీ ప్రభుత్వం వెల్లడించింది. నిజానికి కర్ణాటకలోనూ మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించలేదు. 1994లో మండల్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా ముస్లింలలోని కొన్ని కులాలను ఇతర వెనుకబడిన కులాలను ఓబీసీల్లో సబ్ కేటగిరీగా చేర్చారు. ఆ కేటగరిలోనే రిజర్వేషన్లు ఇస్తున్నారు. అంటే తెలంగాణ తరహాలోనే అక్కడ కూడా కులం ఆధారంగానే ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అందుకే ఈ అంశం సుప్రీంకోర్టులో ఆగిపోయింది. కర్ణాటకలో లాగే తెలంగాణలోనూ ముస్లిం రిజర్వేషన్లు తీసేసి ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామంటున్నారు. అయితే తెలంగాణలో ముస్లింలకు కులం ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తున్నారు. కానీ, మతం ఆధారంగా ఈ రిజర్వేషన్లు వర్తింప చేస్తున్నారని అమిత్ షా అంటున్నారు. ముస్లింలు భారతీయ జనతా పార్టీకి ఓటు బ్యాంక్ కాదు. వారు ఓటు వేయరు కాబట్టి.. వారి విషయంలో బీజేపీ ప్రత్యేకమైన వ్యూహంతో ఉంటుంది. ఇప్పుడు వారి రిజర్వేషన్లు తీసేసి ఎస్సీ, ఎస్టీలకు పెంచుతామని హామీ ఇస్తున్నారు. కుల పరమైన రిజర్వేషన్లే చట్ట పరంగా అమలవుతున్నాయి కాబట్టి ముస్లింలకు ప్రత్యేకంగా రద్దు చేయలేరు.. ప్రత్యేకంగా కమిషన్ వేసి.. వారు అంటే ముస్లింలలో కొన్ని కులాల వారు అర్హులు కాదని తేల్చితే అప్పుడు తీసేయగలరు. అది అంత తేలిక కాదు. అందుకే ఇది రాజకీయ నినాదంగానే ఎక్కువ మంది భావిస్తున్నారు. సిద్దిపేట సభలో అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల రద్దు ప్రకటన చేసిన కాసేపటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో బీజేపీపై చార్జిషీట్ వేసే కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని, ఇదే మోదీ ఆఖరు అస్త్రమని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ ఎజెండాను అమలు చేసేందుకు రాజ్యాంగ సవరణ జరగాలని ఇందుకోసం మోదీకి మూడింట రెండు వంతుల మెజార్టీ కావాలన్నారు. అందుకే బీజేపీ నాలుగు వందల సీట్ల టార్గెట్ గా పెట్టుకుందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని.. రిజర్వేషన్లను కూడా వదిలి పెట్టదని కాంగ్రెస్ చాలా కాలంగా ప్రచారం చేస్తోంది. ఇప్పుడు అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల గురించి మాట్లాడటంతో.. కాంగ్రెస్ మరింత అందిపుచ్చుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయింది. ఈ రిజర్వేషన్ల రద్దు పేరుతో ఓటర్లను భయపెట్టి ఎవరు ఎక్కువగా లబ్ది పొందుతారో చూడాల్సి ఉంది.

# అదిలాబాద్ కాషాయంలో కషాయం...

అదిలాబాద్, ఏప్రిల్ 27 ఎన్నికలకు ఇంకా మూడు వారాలు కూడా లేని ఈ సమయంలో ఇక్కడి కాషాయ దళంలో అసమ్మతి మళ్లీ భగ్గుమంటోంది. బరిలో ఉన్న కాషాయ అభ్యర్థికి ఏసీలోను చెమటలు పట్టే పరిస్థితిని తెస్తుందంట. కారణం ఈ పార్లమెంట్ పరిధిలో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు కలిసినట్టుగానే కలిసి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. అయితే జిల్లాకు చెందిన ముఖ్య నేత మాత్రం కినుక వహించి తిరుగుతున్నారట. అభ్యర్థి ప్రకటన నుండి పార్టీకి దూరంగా ఉంటూ, నా దారి నాదే అన్నట్టుగా వ్యవహరిస్తున్న ఎంపీ సోయం బాపురావు వ్యవహార శైలి నేతల్లో గుబులు పుట్టిస్తోంది.నెల రోజులుగా మౌనం దాల్చిన సోయం బాపురావు నా రూటే సపరేట్ అంటూ తనదైన స్టైల్ లో అభ్యర్థికి షాక్ ల షాక్ ఇస్తున్నాడట. గెలిపే లక్ష్యంగా కాషాయ క్యాడర్ గడపగడపకు ప్రచారం చేస్తున్నా, బీజేపీకి ఆదివాసీ గూడాల నుండి ఆ స్థాయి మద్దతు రావడం లేదట. కారణం సోయం బాపురావు నిర్ణయమే అని టాక్ బలంగా రీసౌండ్ ఇస్తోందట. కారణం ఆయన బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్ కు కాకుండా మరోసారి ఆదివాసీ నేతకు జైకొట్టడమే అని తెలుస్తోంది. ఎంపీగా మరోసారి సీట్ దక్కకపోవడంతో అలక బూనిన సోయం బాపురావు, నెల రోజులుగా పార్టీకి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా బీజేపీ అభ్యర్థికి మద్దతు ఉపసంహరించుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అక్కడితో ఆగకుండా ఆదివాసీ గూడాల్లో ఆదివాసీ పెద్దలతో రహస్యంగా సమావేశమై, తాను బీజేపీలోనే ఉన్నానని, కానీ ఆదివాసీల పక్షాన నిలిచే నేతకే ఈసారి పట్టం కట్టాలని, పార్టీలు ముఖ్యం కాదు నేతలే ముఖ్యం అంటూ తనదైన శైలిలో ఒంటరి ప్రచారం చేస్తున్నారట.అయితే ఆ ప్రచారం బీజేపీ అభ్యర్థికి మద్దతుగా చేస్తున్నది కాకపోవడంతో సోయం ఎవరి పక్షాన నిలిచి ఒంటరి ప్రచారం చేస్తున్నారనే చర్చ పార్లమెంట్ పరిధిలో జోరుగా సాగుతోంది. ఆదివాసీ ఉద్యమ నేతకే పట్టం కట్టాలని సోయం బాపురావు గూడాల్లో గడపగడపకు తన సమాచారం చేరవేస్తుండటంతో.. ఆ ఉద్యమ నేత ఎవరనే టాక్ ఇటు బీజేపీ పార్టీలో అటు రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే ఆ ఆదివాసీ ఉద్యమ నేత తన చిరకాల మిత్రుడే అన్న టాక్ పార్టీలో రీ సౌండ్ ఇస్తుండటంతో సోయంను దారికి తెచ్చుకునేందుకు అధిష్టానం, పార్లమెంట్ ఇంఛార్జ్ విశ్వప్రయత్నాలే చేస్తున్నారట. బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్ నామినేషన్ ర్యాలీకి రావాలంటూ పార్లమెంట్ ఇంఛార్జ్ కాకపట్టినా.. అదిష్టానం నుండి ఫోన్ వచ్చినా, నో వే అంటూ తన నిర్ణయాన్ని ప్రకటించారట. దీంతో ఎంపీ సోయం ఏం చేస్తాడో అంటూ ఆందోళన చెందుతున్నారు క్యాడర్.అయితే ఇదే సమయంలో పార్లమెంట్ పరిధిలో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల మధ్య సోయం వ్యవహారం చర్చకు రావడం.. నామినేషన్ ర్యాలీలో జనసమీకరణ లేక ర్యాలీ చప్పగా సాగడంతో ఆ నలుగురిలో ఓ ఇద్దరు కీలక ఎమ్మెల్యేల మధ్య జనసమీకరణ విషయంలో అసమ్మతి మరోసారి భగ్గుమందట. కలిసుంటే కలదు సుఖం అని అధిష్టానం నెత్తి నోరు కొట్టుకుంటున్నా, ఆదిలాబాద్ పార్లమెంట్‌లో నేతల మధ్య ఆ సఖ్యత కనిపించక పోవడంతో అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నాయంటోంది క్యాడర్.ఓ వైపు ప్రత్యర్థి పార్టీలు ఎన్నికల ప్రచారంలో దూసుకెళుతుంటే, అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి కాషాయ అడ్డాగా మార్చుకున్న ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో విజయకేతనం ఎగరవేయాల్సిన కాషాయ పార్టీ మాత్రం ఇంకా అసమ్మతి రాగమే ఎత్తుకుని సాగుతుండటం విస్మయానికి గురి చేస్తోందట.

# గ్రేటర్ వరంగల్ కు త్రాగు నీటి కష్టాలు

వరంగల్, ఏప్రిల్ 27 గ్రేటర్ వరంగల్ నగరానికి తాగునీటి తిప్పలు తప్పేలా లేవు! ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటుతుండటం కలవరపెడుతుండగా.. దేవాదుల పంపింగ్ నిలిచిపోవడం సమస్యగా మారింది. ఫలితంగా వరంగల్ ట్రై సిటీకి ప్రధాన తాగునీటి వనరు అయిన ధర్మసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం పడిపోతోంది. అందుకే నగర ప్రజలకు రోజువారీగా సప్లై చేయాల్సిన నీటిని రెండు, మూడు రోజులకోసారి విడుదల చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మున్ముందు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండగా.. నీటిని పొదుపుగా వాడుకోకపోతే బెంగళూరు దుస్థితి తలెత్తే ప్రమాదం లేకపోలేదు.

వరంగల్ ట్రై సిటీకి ధర్మసాగర్ రిజర్వాయర్ తో పాటు కరీంనగర్ ఎల్ఎండీ నుంచి నీటిని సరఫరా చేస్తుంటారు. లోయర్ మానేర్ డ్యాం నుంచి ప్రతి రోజు 60 ఎంఎల్డీ(మిలియన్ లీటర్ పర్ డే) తీసుకుంటున్న అధికారులు ధర్మసాగర్ లోని ప్లాంట్ వద్ద ట్రీట్మెంట్ చేసి, వరంగల్ నగరంలోని అండర్ రైల్వే జోన్ గా పిలిచే ప్రాంతాలకు సప్లై చేస్తుంటారు. కాగా గ్రేటర్ వరంగల్ కు నీటిని సరఫరా చేయడంతో ధర్మసాగర్ రిజర్వాయర్ దే అగ్ర భాగం కాగా.. ఇక్కడికి గోదావరి నుంచి దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగడం, కాళేశ్వరం ప్రాజెక్టులో తలెత్తిన లోపాల కారణంగా ఆ దిగువన ఉన్న దేవాదుల ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్ నిలిపేశారు. దాదాపు 20 రోజుల కిందటే పంపింగ్ ఆపేయగా, రోజువారీ వాడకం, మండుతున్న వేసవి, భూగర్భజలాలు అడుగంటుతున్న కారణంగా ధర్మసాగర్ రిజర్వాయర్ లో నీటి మట్టం తగ్గుతూ వస్తోంది.ధర్మసాగర్ రిజర్వాయర్ ఫుల్ లెవల్ కెపాసిటీ 1.5 టీఎంసీలు కాగా.. సాధారణంగా 1.2 టీఎంసీల వరకు నీటిని స్టోర్ చేస్తుంటారు. ఆ తరువాత ఇక్కడి నుంచి నీటిని వడ్డేపల్లి, కాకతీయ యూనివర్సిటీ, దేశాయిపేటలోని మూడు ఫిల్టర్ బెడ్ లకు సరఫరా చేస్తుంటారు. అక్కడి నుంచి వరంగల్ ట్రై సిటీకి వాటర్ సప్లై అవుతుంటుంది. ఇలా రోజువారీగా ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి 172 ఎంఎల్డీ (మిలియన్ లీటర్ పర్ డే) నగరానికి సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ రిజర్వాయర్ నీటి మట్టం చాలావరకు తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం రిజర్వాయర్ లో 0.6 టీఎంసీల కంటే ఎక్కువ నీళ్లు కూడా లేకపోవడం కలవరానికి గురి చేస్తోంది. ఇదిలాఉంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటితో వరంగల్ నగరానికి దాదాపు మూడు నెలలపాటు తాగునీటిని అందించే అవకాశం ఉందని అక్కడి సిబ్బంది చెబుతుండటం గమనార్హం.దేవాదుల పంపింగ్ నిలిచిపోవడంతో ధర్మసాగర్ రిజర్వాయర్ అడుగంటుతుండటం సమస్యగా మారింది. దీంతో వరంగల్ నగరంలోని కాలనీలకు వంతులవారీగా రెండు, మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి వరంగల్ లో ఒక్కో వ్యక్తికి 100 లీటర్ల చొప్పున ప్రతి రోజు సరఫరా చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021 ఏప్రిల్ లో జరిగిన జీడబ్ల్యూఎంసీ ఎన్నికల ముందే మిషన్ భగీరథ పథకంలో భాగంగా నగరంలో డైలీ వాటర్ సప్లై సిస్టంను కూడా ప్రారంభించారు. నిన్నమొన్నటి వరకు అలాగే నీటి సరఫరా జరిగినా.. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. చాలా ప్రాంతాలకు రెండు, మూడు రోజులకోసారి నీళు సరఫరా అవుతున్నాయి. ఇదిలాఉంటే ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నార్త్ మెన్ కెనాల్ ద్వారా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని కొన్ని గ్రామాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి చివరి తడికి నీళ్లు అందక కొన్ని చోట్ల పంటలు కూడా ఎండిపోయాయి. ఇదిలాఉంటే ఇప్పటికే బెంగళూరులాంటి మహానగరాలు తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటుండగా.. నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథాను అరికట్టాలని ఇక్కడి అధికారులు సూచిస్తున్నారు

# 8 మందికివంద కోట్లపైనే ఆస్తులు

తెలంగాణలో ఎంపీ అభ్యర్థులు హైదరాబాద్, ఏప్రిల్ 27 తెలంగాణలో పోటీ చేస్తున్న పలువురి అభ్యర్థుల ఆస్తులు వంద కోట్లకు పైగా ఉన్నాయి. ఈ లిస్ట్ లో ఎనిమిది మంది ఉన్నారు. ఆయా అభ్యర్థులు వారి కుటుంబ ఆస్తులతో కలిపి రూ.100 కోట్లకు పైగా ఆస్తులను ప్రకటించారు. ఇందులో స్థిర, చర ఆస్తులు ఉన్నాయి.రాష్ట్రంలోని చేవెళ్ల నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. మొత్తం 4,568 కోట్ల రూపాయల సంపదతో అత్యంత సంపన్న అభ్యర్థిగా నిలిచారు.చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యర్థిగా కాంగ్రెస్ తరపున బరిలో ఉన్న రంజిత్ రెడ్డి ఆస్తులు కూడా భారీగానే ఉన్నాయి. మొత్తం రూ.435.33 కోట్లతో రెండో ధనవంతుడిగా నిలిచారు. అప్పులు రూ.23 కోట్లుగా ఉన్నాయి. ఆయన కుటుంబానికి రూ.294.33 కోట్ల విలువైన చరాస్తులు ఉండగా, స్థిరాస్తుల విలువ రూ.141 కోట్లు. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే? చేవెళ్ల నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్ కూడా అత్యధిక సంపద కలిగిన అభ్యర్థిగా ఉన్నారు. ఆయన తెలంగాణ రాష్ట్రం నుంచి రిచెస్ట్ ఎంపీ అభ్యర్థుల జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. ఆయన మొత్తం సంపద రూ.228.46 కోట్లుగా ప్రకటించారు.

అసదుద్దీన్ ఒవైసీపై హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా కె మాధవిలతా పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి బరిలో ఉన్న ఆమె ఆస్తులు? మొత్తం రూ.218.38 కోట్లుగా ఉన్నాయి. రూ.27 కోట్ల వరకు అప్పులు కూడా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి సమీర్ వలీవుల్లాను కాంగ్రెస్ పోటీకి దింపిన సంగతి తెలిసిందే.

వంద కోట్లకుపైగా ఆస్తులను ప్రకటించిన అభ్యర్థులు వీరే?

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పోటీ చేస్తున్న నామా నాగేశ్వర్‌రావు నికర సంపద రూ.155.89 కోట్లుగా ప్రకటించారు.

భువనగిరి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న క్యామ మల్లేశ్ రూ. 145.33 కోట్ల ఆస్తుల(కుటుంబ సభ్యులతో కలిపి)ను కలిగి ఉన్నారు.

నిజామాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ధర్మపురి అర్వింద్? మొత్తం నికర ఆస్తుల విలువ 109.89 కోట్లుగా ప్రకటించారు. మొత్తం అప్పుల విలువ రూ.30.67 కోట్లుగా ఉంది.

జహీరాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్ ఆస్తులు రూ. 151 కోట్లుగా ఉంది.

కంచర్ల కృష్ణారెడ్డి, గాలి అనిల్ కుమార్ రూ. 50 కోట్లకుపైగా ఆస్తులు కలిగి ఉన్నారు.

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలకు మే 13న పోలింగ్ జరగనుండగా.. జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ తొమ్మిది స్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ నాలుగు సీట్లు గెలుచుకుంది. ఒక స్థానంలో ఓఎం గెలవగా.. మిగిలిన మూడు స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించింది.

# చంద్రగిరిని రణరంగంగా మార్చవద్దు

చంద్రగిరి ఆధ్యాత్మిక వాతావరణం కలిగిన చంద్రగిరిని.. రణరంగంగా మార్చవద్దని తుడా ఛైర్మెన్, చంద్రగిరి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ప్రతిపక్ష నేతకు హితవు పలికారు.

తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద నామినేషన్ కోసం వచ్చిన తన తండ్రి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వాహనంపై దాడి చేయడాన్ని ఖండించారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి చేసిన దాడులను ఎన్నికల కమిషన్ సీరియస్ గా తీసుకుని చర్యలు చేపట్టి, దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

తిరుచానూరు కేంద్రంగా నామినేషన్ లో జరిగిన సంఘటనను నిరసిస్తూ భారీ కొవ్వుత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైసిపి నాయకులు కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రగిరిలో చిత్తూరు సంస్కృతి వద్దు, చిత్తూరు దౌర్జన్యాలు.. చంద్రగిరిలో వద్దు, రౌడీయిజం మాకొద్దు, ఆధ్యాత్మిక క్షేత్రంలో ప్రశాంతత కావాలి.. అంటూ ఓ చేత్తో కొవ్వొత్తి, మరో చేతిలో ప్లకార్డు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ, చంద్రగిరి ప్రజలను చిల్లర రాజకీయాలతో బయపెట్టాలనుకోవడం మూర్ఖత్వం అన్నారు.

నా నామినేషన్ ప్రక్రియలో 50 వేల మందికి పైగా ప్రజలు తరలిరావడంతో ఓర్వలేని ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దిగజారుడు రాజకీయానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వాహనంపై దాడి చేసి తద్వారా పార్టీ కేడర్ ను నీరుగార్చే ప్రయత్నం ఫలించదని సూచించారు. చిత్తూరు నుంచి వచ్చిన అల్లరిమూకలు మాత్రమే దాడికి తెగబడ్డారని తెలిపారు.ఎమ్మెల్యేకు రక్షణ లేకపోతే సామాన్య ప్రజలకు అధికారులు ఎలా రక్షణ కల్పిస్తారని ప్రశ్నించారు. ఇందులో పోలీసు అధికారుల నిర్లక్ష్యం ఉందని దీనిపై ఎన్నికల కమిషన్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు మోహిత్ రెడ్డి.

## వైసిపి మేనిఫెస్టోలో కొన్ని అంశాలను చేర్చాలని సలహా ఇచ్చిన రిటైర్డ్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ చంద్ర శేఖర్ రెడ్డి

నంద్యాల పట్టణంలోని తన కార్యాలయంలో రిటైర్డ్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సీఎం జగన్ మోహన్ రెడ్డి విడుదల చేస్తున్న మేనిఫెస్టోలో తను సూచనలు,సలహాలు సిఎం జగన్ మోహన్ రెడ్డి కి నచ్చితే మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు.అయిదు ఎకరాల పొలం ఉన్న సన్నకారు రైతులకు రెండు లక్షల వడ్డీ లేని రుణం ఇచ్చి 30 నెలల లోపల చెల్లించే విధముగాను ఉండాలని,కట్టని యెడల వడ్డీతో సహా కట్టేవిధంగా,అలాగే 10 ఎకరాల పొలం ఉన్న రైతులకు రూ.3 లక్షల వడ్డీ లేని రుణమును మంజూరు చేసి,తిరిగి 30 నెలల లోపల ఋణాన్ని కట్టని యెడల వడ్డీతో సహా కట్టవల్సి ఉంటుందని,అదే విదంగా దళితులకు నాల్గవ తరగతి ఉద్యోగస్తులకు,చేతి వృత్తి పనుల వారికి,మహిళలకు రూ.50 వేల ఋణమును మంజూరు చేయాలి.ఆ ఋణమును 20 నెలల లోపల తిరిగి చెల్లించన యెడల వడ్డీతో సహా కట్టవలసి వస్తుంది.కాబట్టి ఈ అంశాలు సిఎం జగన్ మోహన్ రెడ్డికి నచ్చితే నేడు విడుదల చేస్తున్న మేనిఫెస్టోలో ఈ చేర్చాలని కోరారు.

### గంజాయి, కల్తీకల్లును సమూలంగా నిర్మూలిద్దాము

నిర్మల్ గంజాయి, కల్తీకల్లును సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైయస్సార్ నగర్ కాలనీలో నిర్వహించిన పోలీసు కమ్యూనిటీ అండ్ కాంట్రాక్టు ప్రోగ్రాంలో వారు పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. వైఎస్ఆర్ కాలనీలో అధికంగా యువత గంజాయిని సేవిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనీ వల్ల కాలనీకే చెడ్డపేరు వస్తుందన్నారు. దీన్ని సమూలంగా నిర్మూలించాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ, నిబంధనలలో పాటించాలన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలను నడుపుతున్న పలువురిని సన్మానించారు. అనంతరం కాలనీలో గంజాయి, కల్తీకల్లును నిర్మూలించేందుకు ఏర్పాటు చేసిన పోస్టర్లను విడుదల చేసి వాటిని అతికించారు. సరైన ధ్రువపత్రాలు లేని 97 ద్విచక్ర వాహనాలు,27 ఆటోలు, ఒక కారు, మూడు వేల రూపాయల విలువ గల మద్యంను స్వాధీన పరుచుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి గంగారెడ్డి తో పాటు సిఐ రూరల్ సీఐ శ్రీనివాస్ పలువురు ఎస్సైలు పోలీసు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# నల్గొండ లో గుత్తాపై అధిష్టానం గుర్రు...

నల్గొండ, ఏప్రిల్ 27 రాష్ట్ర వ్యాప్తంగా ఇపుడు అందరి చూపు ఉమ్మడి నల్గొండ జిల్లాపై పడింది. 2023 ఎన్నికల తర్వాత తెలంగాణలో అధికార మార్పిడి జరిగింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు తెరపడి.. కాంగ్రెస్ తిరిగి అధికారం చేజిక్కించుకుంది.ఈ పరిణామంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మెజారిటీ నాయకులు తమ అధిష్టానం తీరుపై బహిరంగ విమర్శలకు దగడం మొదలు పెట్టారు. ఇన్నాళ్లూ అణచిపెట్టుకొని ఉన్న తమ నిరసనను వెళ్లగక్కుతున్నారు.ఈ లోగా ముందుకు వచ్చిన పార్లమెంటు ఎన్నికలతో బీఆర్ఎస్ ను వీడి అటు కాంగ్రెస్, మరికొందరు బీజేపీలోకి వలస బాటపట్టారు. ఈ పరిస్థితుల్లో పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉనికి ఉంటుందా అన్నంత స్థాయిలో చర్చ జరుగుతోంది.శాసన సభలో కాంగ్రెస్ కు మెజారిటీ ఉన్నా.. శాసన మండలి మాత్రం ఇంకా బీఆర్ఎస్ దే అధిపత్యం, ఆ మండలి చైర్మన్ గా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి ఇపుడు పార్టీ అధినాయకత్వంపై తిరుగుబాటు చేసినట్లుగా మాట్లాడుతుండడం రాజకీయా వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దగ్గరి రాజకీయ అనుచర నాయకులంతా ఈరోజు నల్గొండలో భేటీ అవుతున్నారు. భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడంలో భాగంగానే వీరింతా సమావేశం కాబోతున్నారని విశ్వసనీయ సమాచారం.రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి.. రెండు సార్లూ మండలి చైర్మన్ పదవిని కట్టబెట్టిన అధినాయకత్వంపై చైర్మన్ గుత్తా ఎందుకు ఆగ్రహంగా ఉన్నారు..? తెరవెనుక అసలేం జరిగింది..? ఉమ్మడి నల్గొండ జిల్లా బీఆర్ఎస్ లో జరుగుతున్న ఆధిపత్య పోరుతో ఈ ఎన్నికల్లో పార్టీ అవకాశాలను దెబ్బతీయదా అన్న చర్చ మొదలైంది.సుదీర్ఘ రాజకీయ జీవితం ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి తెలుగుదేశంలో పాతికేళ్లకు పైగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన ఒక సారి టీడీపీ నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరిన గుత్తా 2009, 2014 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా విజయం సాధించారు.2016లో కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సమన్వయ సమితికి తొలి అధ్యక్షుడు కూడా ఆయనే. ఎమ్మెల్సీగా, ఆ తర్వాత మండలి చైర్మన్ గా రెండు పర్యాయాలు పదవులు పొందారు. అయినా, పార్టీ నాయకత్వంపై నిరసన గళం వినిపిస్తున్నారు.పార్లమెంటు ఎన్నికల్లో తన తనయుడు గుత్తా అమిత్ రెడ్డికి నల్గొండ ఎంపీ టికెట్ ఆశించారు. అధిష్టానం సూచన మేరకు భువనగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయడానికి కూడా సిద్ధ పడ్డారు.జిల్లాలోని అధిపత్య రాజకీయాలతో , మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీష్ రెడ్డితో ఉన్న పొరపొచ్చాలు, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ అభ్యర్థులు (ఇపుడు మాజీ ఎమ్మెల్యేలు ) వ్యతిరేకంగా ఉండడం వంటి కారణాలు గుత్తా అమిత్ కు టికెట్ రాకుండా చేశాయన్న అభిప్రాయం ఉంది. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కావాలనే అడ్డుపడ్డారని, అధిష్టానం వాస్తవాలు తెలుసుకోకుండా తమను పక్కన పెట్టిందన్న అసంతృప్తికి గురయ్యారు.కాంగ్రెస్ నుంచే వచ్చిన గుత్తా సుఖేందర్ రెడ్డి తిరిగి తన పాతగూటికి దగ్గర అవుతున్నారన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు. వీటిని బలపరుస్తూ.. బీఆర్ఎస్ బలహీనమైన పార్టీ అని, సంస్థాగత నిర్మాణం ఏమాత్రం లేదని, ఎమ్మెల్యేలు కేంద్రంగా రాజకీయాలు నడపడం వల్లే మొన్నటి ఎన్నికల్లో అధికారం కోల్పోవాల్సి వచ్చిందని తీవ్ర ఆరోపణలు చేశారు.శాసన మండలి చైర్మన్ అయిన తనకే ఆరు నెలల పాటు నాటి సీఎం, పార్టీ అధినేత కేసీఆర్ అపాయింట్ మెంట్ దొరకలేదని బయటపెట్టారు. ఈ పరిణామాలన్నీ, ముఖ్యంగా గుత్తా ప్రకటనలన్నీ కాంగ్రెస్ వైపు ఆయన మొగ్గుచూపుతున్నారన్న వాదనకు బలం చేకూర్చాయి. ఈ లోగా గుత్తా వ్యతిరేక వర్గం మీడియాలో, సోషల్ మీడియాలో ఆయనను విమర్శలతో వెంటాడడం మొదలు పెట్టింది.వీరి భేటీ తర్వాత వారి నుంచి కానీ, మండలి చైర్మన్ గుత్తా నుంచి కానీ ఏదన్నా నిర్ణయం, దానికి సంబంధించిన ప్రకటన బయటకు వస్తుందా అన్న ఎదురుచూపులు మొదలయ్యాయి. వాస్తవానికి 2023 శాసన సభ ఎన్నికల ముందే గుత్తా అనుచరులు పలువురు వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరారు.పార్లమెంటు ఎన్నికల వేళ కూడా ఈ వలసల పరంపర కొనసాగుతోంది. మిగిలిన వారంతా కూడా ఏదో ఒక నిర్ణయం తీసుకునేందుకే గుత్తా ఇంటిలో భేటీ అవున్నట్లు చెబుతున్నారు. కేవలం తన అనుచరులను మాత్రమే బయటకు పంపి గుత్తా బీఆర్ఎస్ లోనే కొనసాగుతారా..? లేక, ఆయన కూడా తన దారి తను చూసుకుని కాంగ్రెస్ గూటికి చేరుతారా..? దీనికి సంబంధించిన ప్రకటన వెలువరిస్తారా ? అన్న ప్రశ్నలు ఉత్కంఠ రేపుతున్నాయి

# బీజేపీ గెలుపు ఖాయం

రంగారెడ్డి చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పై బిజెపి జెండా ఎగుర వేయడం ఖాయమన్నారు ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మహేశ్వరం నియోజకవర్గంలో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. మీర్ పేట్ కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్ నగర్, గాయత్రి నగర్, లెనిన్ నగర్, బడంగ్ పేట్ లోని పలు ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీని మరోసారి ప్రధానమంత్రి చేసేందుకు యావత్ భారతదేశం ఎదురు చూస్తుందని అన్నారు. దేశ అభివృద్ధి కోసం కుటుంబాన్ని కూడా త్యాగం చేసి శ్రమిస్తున్న నరేంద్ర మోడీకి చేవెళ్ల ప్రజలంతా అండగా నిలవాలని ఆయన కోరారు. దేశ ఐక్యత, ప్రపంచశాంతి కోసం నరేంద్ర మోడీ నిరంతరం శ్రమిస్తున్నారని ఆయన చెప్పారు. భారతీయ జనతా పార్టీని ఓడించలేక ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయని అయినప్పటికీ నరేంద్ర మోడీ మరోసారి ప్రధాని కావడం ఖాయమని కొండా విశ్వేశ్వర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. విప్లవాత్మక నిర్ణయాలతో నరేంద్ర మోడీ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేశారని, ఆయన చిత్తశుద్ధి అంకితభావం కారణంగానే ఇవాళ భారతదేశ ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. గ్యారెంటీ ల పేరు చెప్పి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని, సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించడం ద్వారా ప్రజలంతా బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రజా ఆశీర్వాద యాత్రలో మహేశ్వరం నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి అనుచరులు, అభిమానులు పాల్గొన్నారు.

## ముచ్చటగా మూడవసారి
## భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం
## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

భువనగిరి పార్లమెంట్ ఓఖ స్థానాన్ని ముచ్చటగా మూడోసారి కాంగ్రెస్ జెండాను ఎగరేస్తామని భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్చార్జి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ రోడ్ షో నిర్వహించారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి , ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరిలో కాంగ్రెస్అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు.పదేండ్లలో కేసీఆర్ తన కుటుంబసభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారు తప్ప.. తెలంగాణలోని యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు.కాంగ్రెస్ సుస్థిర ప్రభుత్వం ఉండాలంటే కిరణ్ కుమార్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలని పిలుపునిచ్చారు.హరీష్ రావు కి ప్రజలు ఇప్పుడు గుర్తొచ్చారాని దుయ్యబట్టారు.ప్రజాస్వామ్యాన్ని కుని చేసిన వ్యక్తి ప్రతిపక్ష పార్టీ లేకుండా చేసిన వ్యక్తి కెసిఆర అన్నారు. బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ కండువాలు జేబులో పెట్టుకుని తిరుగుతున్నారు.

# పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు

భద్రాద్రి కొత్తగూడెం దమ్మపేట మండలం వడ్లగూడెం దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఖమ్మం పార్లమెంట్ స్థానం విజయం కాంక్షిస్తూ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశంలో మంత్రులు ఎంపీ అభ్యర్థి పాల్గొన్నారు. కాళేశ్వరం, ధరణి లొసుగులు, ప్రశ్నా పత్రాల లీకేజి సహా ఎన్నో అక్రమాలు ఃఖీూ హయాంలో జరిగాయని రామసహాయం అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక పాలన నచ్చకే రాష్ట్ర ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని,కేసీఆర్ కి ముఖ్యమంత్రి గా వున్నప్పుడు రైతు కష్టాలు కనపడలేదని ఇప్పుడు మాత్రం రైతుల కష్టాలు కనిపిస్తున్నాయా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దోచుకున్న కోట్లు దాచుకోవడానికే దొంగ దీక్షలు,దొంగ పర్యటనలు చేస్తున్నారన్నారు. దేశంలోనే తెలంగాణ ని మోడల్ గా నిలబెడతామని మంత్రి పొంగులేటి అన్నారు.

రామసహాయం రఘురామరెడ్డి సుదీర్ఘ రాజకీయ నేపద్యమున్న వ్యక్తి అని, కులాల మధ్య చిచ్చు పెట్టే పార్టీ బీజేపీ అని, మొది సాక్షాత్తు రాముణ్ణే బ్యాలెట్ బాక్స్ దగ్గరకి తెచ్చారని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.కేసీఆర్ ఓడిపోయి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని, కేసీఆర్ చవకబారు మాటలు మాట్లాడవద్దని, మాజీ ముఖ్యమంత్రిగా హోదా కాపాడుకోవాలన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి రామసహాయం రఘురామరెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

# నాకు ఒక్కసారి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా కాకర్ల సురేష్

నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంకొండాపురంమండలంకొమ్మి ,రామంజపురం,సత్యవోలు,బీమవరపాడు గ్రామం లో టిడిపి అభ్యర్థి కాకర్ల సురేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఇంటికి ఇంటికి తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఎంపీ అభ్యర్థిగా భీమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ.. ఒక్క అవకాశం ఇస్తే ఉదయగిరి అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి వ్యవసాయ ఆధారిత ప్రాంతమని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు కృషి చేస్తానన్నారు. గ్రామాలకు అడుగుపెడుతున్న కాకర్లకు ప్రజలు జననిరాజనం పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# సినిమా



## ఎన్నికల ప్రచారం కోసం వెంకీ మామ..




ఈసారి ఏపీ ఎన్నికల్లో సినీ తరాల ప్రెజెన్స్ ఎక్కువగా కనిపిస్తుంది. ఇప్పటికే పవన్ కళ్యాణ్ కోసం నాగబాబుతో పాటు జబర్దస్త్ నటుడు, డాన్స్ మాస్టర్స్, టీవీ యాక్టర్స్ రంగంలోకి దిగి పని చేస్తున్నారు.మెగాస్టార్ చిరంజీవి కూడా పవన్ కి సపోర్ట్ తెలియజేస్తూ.. ఇటీవల సీఎం రమేష్,పంచకర్ల రమేష్ ని గెలిపించాలంటూ ప్రజలను కోరారు. ఇక తండ్రి, పెదనాన్న బాటలోనే వరుణ్ తేజ్ కూడా పవన్ కోసం కదిలి వస్తున్నారు. పవన్ కోసం పిఠాపురంలో ప్రచారం చేయబోతున్నారు. ఈ మెగా హీరోలతో పాటు టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ కూడా తన మావయ్య కోసం ఎన్నికల ప్రచారంలోకి దిగారు. తన మావయ్యని సపోర్ట్ చేస్తూ టీడీపీ కోసం నిఖిల్ ఇటీవల ప్రచారం చేసారు. ఇక తాజాగా విక్టరీ వెంకటేష్ కూడా ఏపీ ఎన్నికల ప్రచారంలో భాగం కాబోతున్నారు. ఇద్దరు నాయకులకు సపోర్ట్ చేయడం కోసం వెంకీ మామ రంగంలోకి దిగితున్నారు. ఇంతకీ వెంకీ మామ ఏ పార్టీ కోసం ప్రచారం చేయబోతున్నారు..?ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రఘురామరెడ్డిని, అలాగే కైకలూరు కూటమి (బీజేపీ) అభ్యర్థ కామినేని శ్రీనివాస్ ని సపోర్ట్ చేయడం కోసం వెంకటేష్ రాబోతున్నారట. రఘురామరెడ్డి వెంకటేష్ కి వియ్యంకుడు అవుతారట. ఇక కైకలూరు అభ్యర్థ కామినేని శ్రీనివాస్.. వెంకటేష్ భార్యకి సొంత మేనమామ అంట. ఇక ఈ బంధువుల కోసమే వెంకటేష్ మొదటిసారి రాజకీయ ప్రచారంలోకి అడుగుపెట్టబోతున్నారు. అయితే ఇది చాలామందిని షాక్ కి గురి చేస్తుంది. ఎందుకంటే, ఇండస్ట్రీలో ఎటువంటి కాంట్రవర్సీ లేని హీరో అంటే వెంకటేష్. ఆయన పని ఏదో ఆయన చూసుకొని, ఏ వివాదాల్లో వేలు పెట్టకుండా చాలా సైలెంట్ లైఫ్ ని రన్ చేస్తుంటారు. అలాంటి హీరో ఏపీ వంటి రాజకీయాల్లో భాగం అవుతుండడం.. అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది.

## టిల్లుగాడి ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్..



స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ, అందాల తార అనుపమ పరమేశ్వరన్ కాంబినేషన్ లో వచ్చిన డీజే టిల్లు సీక్వెల్ టిల్లు స్క్వేర్ రూ.125 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ తో సంచలన విజయాన్ని అందుకుంది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఇప్పుడు నెట్ ఫ్లిక్స్ లో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ చిత్రంలో సిద్ధు, అనుపమలతో పాటు నేహా శెట్టి, ప్రియాంక జవాల్కర్ అతిథి పాత్రల్లో నటించగా, మురళీధర్ గౌడ్, మురళీ శర్మ, ప్రిన్స్ సెసిల్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి రామ్ మిరియాల, అచ్చు రాజమణి, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. 'టిల్లు స్క్వేర్' సినిమా ఊహించనిదానికంటే ఎక్కువ హిట్ కావడంతో డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను భారీ పోటీ నెలకొంది. అయినా నెట్‌ఫ్లిక్స్ రైట్స్ ను కొనుగోలు చేసింది. ఇక ఈ హక్కుల కోసం మేకర్స్ రూ. 35 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది. సమ్మర్ బరిలో విడుదలైన ఈ మూవీ మంచి కలెక్షన్లు సాధించి యూత్ మనసులను కొల్లగొట్టింది. ముఖ్యంగా అనుపమ రొమాన్స్ యూత్ ను థియేటర్లకు రప్పించేలా చేసింది. ఇతర సినిమాలకు భిన్నంగా ఈ బ్యూటీ ఓ రేంజ్ లో రొమాన్స్ పడించి అందర్నీ ఆకట్టుకుంది.

## అక్షయ్ కొత్త చిత్రం



'బడే మియా ఛోటే మియా'తో ఇటీవలే ప్రేక్షకులను పలకరించారు బాలీవుడ్ కథానాయకుడు అక్షయ్ కుమార్. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఆయన..ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపారు. దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న ఓ హారర్ చిత్రంలో ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దర్శకుడు రాబోయే ఈ ప్రాజెక్టు గురించి కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "ప్రస్తుతం నేను రామమందిర చరిత్రపై ఓ డాక్యుమెంటరీని పూర్తి చేసే పనిలో ఉన్నాను. దీని తదుపరి అద్భుతమైన నటుడు అక్షయ్‌తో ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాను. ఆయన కోసం ఒక మంచి స్క్రిప్ట్‌ను సిద్ధం చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఇన్నాళ్లకు మళ్లీ అక్షయ్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందుతుంది. దీంతో పాటు బ్లాక్ మ్యాజిక్ ఇందులో ప్రధాన అంశంగా ఉండబోతుంద"ని చెప్పుకొచ్చారు. ఇంకా పేరు పెట్టని ఈ ప్రాజెక్టును ఏక్తా కపూర్ నిర్మిస్తున్నారు. అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'స్కై ఫోర్స్'. సందీప్ కెవ్లానీ తెరకెక్కిస్తున్నారు. సారా అలీఖాన్ కథానాయిక. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు తెలుపుతూ..సామాజిక మాధ్యమాల వేదికగా ఓ వీడియోను పంచుకుంది చిత్రబృందం. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. జియో స్టూడియోస్, మడాక్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు రానుంది.

### అవన్నీ రూమర్సే!

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన చిత్రం 'సలార్'. గతేడాది డిసెంబరులో విడుదలైన ఈ పాన్ ఇండియా మూవీ బాక్సాఫీసు వద్ద ఘన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే.దీని సీక్వెల్ కోసం ప్రభాస్ అభిమానులు, సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాలో హీరోయిన్ శ్రుతి హాసన్‌తోపాటు బాలీవుడ్ నటి కియారా అద్వాణీ కీలక పాత్ర పోషించనున్నారని, ప్రత్యేక గీతంలోనూ ఆమె ఆడిపాడనున్నారని ప్రచారం జరిగింది. అవన్నీ రూమర్సేనని ఓ ప్రముఖ బాలీవుడ్ మీడియా సంస్థ పేర్కొంది. 'సలార్ 2' టీమ్ కియారాను సంప్రదించలేదని ఆమె సన్నిహిత వర్గాలు స్పష్టం చేసినట్టు చెప్పింది. కియారా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. 'భరత్ అనే నేను'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ 'వినయ విధేయ రామ'లోనూ సందడి చేశారు. ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'గేమ్ ఛేంజర్'లో నటిస్తున్నారు. 'శౌర్యాంగ పర్వం' పేరుతో 'సలార్ 2' తెరకెక్కనుంది. తొలి భాగంలో ప్రధాన పాత్ర పోషించిన మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతి బాబు తదితరులు రెండో భాగంలోనూ కనిపించనున్నారు. ఈ సీక్వెల్‌పై ఓ ఇంటర్వ్యూలో నిర్మాత విజయ్ కిరగందూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సలార్ 1'.. పార్ట్ 2కు ట్రైలర్ లాంటిది. సలార్ పార్ట్ 2.. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్'లా ఉండనుంది. యాక్షన్, డ్రామా, పాలిటిక్స్.. ఇలా పలు అంశాలు సీక్వెల్‌లో కనిపిస్తాయి. దర్శకుడు పార్ట్ 1లో పాత్రలన్నింటినీ పరిచయం చేశారు. సీక్వెల్ చాలా సర్‌ప్రైజ్‌లు ఉంటాయి" అని తెలిపారు.

## సంచలనంగా యాంకర్ అనసూయ పోస్ట్!



అనసూయ భరద్వాజ్ నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్స్ లో ఉంది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టీవ్ గా ఉంటూ పలు విషయాలపై స్పందిస్తుంది.తాజాగా అనసూయ ఓ ఎమోషనల్ పోస్ట్ షేర్ చేసింది. ఆడవారి వేషధారణ, వారు ధరించే దుస్తుల వల్లనే మానభంగాలు జరుగుతున్నాయి అనే వాదనకు వ్యతిరేకంగా తన అభిమాని పెట్టిన పోస్ట్ పై ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. అనసూయ అభిమాని ఒకరు ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. అమ్మాయిలు స్కర్ట్ వేసినా .. జీన్స్ వేసినా .. సంప్రదాయ దుస్తులు ధరించినా .. ఇంటి నుంచి బయటకు వెళ్లినా .. ఇంట్లో ఉన్నా ఎవరొకరి చేత మానభంగానికి గురవుతున్నారు. అమ్మాయిలు ధరించే దుస్తుల వల్ల కాదు .. మన మైండ్ సెట్ మార్చుకోవాలి. అప్పుడే మహిళలపై అఘాయిత్యాలు, రేప్ లు ఆగుతాయి అని పోస్ట్ పెట్టారు. సదరు పోస్ట్ చూసి అనసూయ స్పందిస్తూ .. నేను నా వాళ్ళు అనుకునే వాళ్ళు వీళ్ళు. నన్ను అభిమానించే వారు కొందరి ఫ్యాన్ పేజీల మాదిరిగా ఎవరిని దూషించరు. ఎవరిని టార్గెట్ చేసి రెచ్చగొట్టరు. ఎవరిని ట్రోల్ చేసి ఇబ్బందులకు గురి చేయరు. అనవసరంగా ఎవరినీ అగౌరవ పరచరు. వీళ్ళు వాళ్ళ బాధ్యత నుంచి పారిపోరు. మంచి మనసుతో ఉండే వారిని చూస్తే నాకు గర్వంగా ఉంటుంది. ఇక కొందరు ఫ్యాన్ పేజీలు మెయింటైన్ చేసేవారు గుమ్మడి కాయల దొంగలు. అనవసరంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుంటారు. జంతువుల మాదిరిగా ప్రవర్తిస్తూ ఉంటారు. దీనిని కూడా ట్రోల్ చేస్తారని తెలుసు. అయినా నేను చాలా స్ట్రాంగ్ గా ఉంటాను. నా చుట్టూ ఉన్న వాళ్ళంతా మంచి మనుషులు.

## శ్రీలీల ఇలా షాకిచ్చిందేంటి.?



శ్రీలీల పెళ్లి సందడి సినిమా తో తెలుగు సినిమా ఇండస్ట్రీకి హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి తనకంటూ మంచి పేరు సంపాదించుకోవడమే కాకుండా ఇండస్ట్రీలో తనదైన రీతిలో వరుస సినిమాలు చేస్తూ ముందుకు దూసుకెళ్తుంది.ఇక రీసెంట్ గా గుంటూరు కారం సినిమాలో హీరోయిన్ గా నటించింది. అయితే ఈ సినిమా అనుకున్న రేంజ్ లో సక్సెస్ కానప్పటికీ తనకు మాత్రం హీరోయిన్ గా మంచి గుర్తింపు అయితే వచ్చింది. ఇక ఇప్పుడు ఆమె తెలుగుతో పాటుగా తమిళ్ సినిమాల్లో కూడా నటించడానికి ఆసక్తి చూపిస్తున్నట్టుగా తెలుస్తుంది. ఇక అందులో భాగం దళపతి విజయ్ హీరోగా నటిస్తున్న ఒక సినిమాలో తను ఐటెం సాంగ్ చేయడానికి కూడా ఒప్పుకున్నట్టుగా వార్తలైతే వస్తున్నాయి.ఇక ఇప్పటి వరకు తను ఏ సినిమాలో కూడా ఐటెం సాంగ్ చేయలేదు. వరుస గా హీరోయిన్ గానే చేస్తూ సక్సెస్ లు అందుకుంటూ ముందుకు దూసుకెళ్తుంది. ఒక దళపతి విజయ్ పొలిటికల్ పార్టీ పెట్టిన విషయం మనకు తెలిసిందే. ఇక అందులో భాగంగానే తను చివరి సినిమా చేసి సినిమా చేయాలనుకుంటున్నాడు. ఇక మొత్తానికైతే తను ఇప్పుడు ఒక సాలిడ్ హిట్ కొట్టి సినిమాలకు గుడ్ బై చెప్పాలని చూస్తున్నాడు. ఇంకా ఈ సినిమాలోనే శ్రీలీలా ఐటెం సాంగ్ తో తమిళ్ తెలుగు ప్రేక్షకులను మెప్పించాలని చూస్తోంది. తను స్టార్ హీరోయిన్ అయి ఉండి కూడా డిఫరెంట్ పాత్రల్లో నటిస్తూ స్టార్ హీరోయిన్స్ అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. ఇక ఈ సినిమాలో ఐటెం సాంగ్ చేయడం వల్ల శ్రీలీల కెరియర్ కి ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయా లేదంటే ఈ ఐటెం సాంగ్ చేయడం వల్ల ఇంకా మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంటుందా అనే విషయాలు తెలియాలంటే మనం మరికొద్ది రోజులు వెయిట్ చేయాల్సిందే.. ఇక మొత్తానికైతే శ్రీలీల వరుస సినిమాలను లైన్ లో పెడుతూ చాలా బిజీగా మారిపోయింది.

## పెళ్ళి చేసుకుంటా కానీ..



సాధారణంగా సినీ సెలబ్రిటీలకు సోషల్ మీడియాలో ఉండే పాపులారిటీ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంత పాపులారిటీ ఉంటుంది కాబట్టి.. సినిమా హీరో హీరోయిన్లు ఎప్పుడు ఏం మాట్లాడినా కూడా అది ఇంటర్నెట్లో వైరల్ గా మారిపోతూ ఉంటుంది.ఇక సినీ సెలబ్రిటీలను ఎప్పుడూ కెమెరాలు ఓ కంట కనిపెడుతూనే ఉంటాయి. అందుకే వారికి సంబంధించిన ఏ విషయం ఇంటర్నెట్ లోకి వచ్చిన దానిని తెలుసుకునేందుకు ఇంటర్నెట్ జనాలు కూడా తెగ ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు అని చెప్పాలి.ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా కారణంగా సినీ సెలబ్రిటీలు నేరుగా అభిమానులతో మాట్లాడగలుగుతున్నారు. అదే సమయంలో ఏ విషయాన్ని దాచుకోకుండా ఇక తమ మనసులో ఉన్న అన్నింటిని కూడా బయట పెట్టేస్తున్నారు అన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొన్ని కొన్ని సార్లు కొంతమంది సినీ సెలెబ్రిటీలు చేసే కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారిపోతూ ఉంటాయి. ఇక ఇప్పుడు సౌత్ ఇండస్ట్రీలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్గా కొనసాగుతున్న మృనాల్ ఠాగూర్ పిల్లలు కనడం పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఆమె చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారిపోయాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న మృనాల్ ఠాగూర్ కి పెళ్లి పిల్లలు కనడం పై ప్రశ్న ఎదురయింది. ఈ క్రమంలోనే ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది ఈ హీరోయిన్. త్వరలో పెళ్లి చేసుకోబోతున్నా అంటూ ఒక గుడ్ న్యూస్ చెప్పింది. అయితే బిడ్డను కనే ఆలోచన మాత్రం లేదు అంటూ ట్విస్ట్ ఇచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఫ్రీజింగ్ ఎగ్స్ విధానానికి సుముఖంగా ఉన్నాను అంటూ చెప్పుకొచ్చింది.

### ఆ సినిమా వల్ల..
### సిగరెట్‌కు బానిసగా మారిపోయా

బాలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్గా కొనసాగుతున్న విద్యాబాలన్ గురించి కొత్తగా పరిచయం అక్కర్లేదు. ఎందుకంటే తన సినిమాలతో అందరూ సినీ ప్రేక్షకులకు సుపరిచితురాలుగా మారిపోయింది.ఇక విద్యాబాలన్ ఏ సినిమాలో నటించిన అది ఒక సెన్సేషన్ గా మారిపోతూ ఉంటుంది. ఇక ఇప్పటివరకు వివాదాస్పద సినిమాల్లో కూడా నటించి ఎన్నోసార్లు వార్తల్లో నిలిచింది ఈ ముద్దుగుమ్మ. ఏ విషయం పైన అయినా సరే తడబడకుండా మనసులో ఉన్నది బయటికి మాట్లాడేస్తూ ఉంటుంది. అందుకే కొన్ని కొన్ని సార్లు విద్యాబాలన్ మాటలు కూడా వివాదాలకు దారి తీస్తూ ఉంటాయి.అయితే ఈ మధ్యకాలంలో సినీ సెలెబ్రిటీలు పాత్రల కోసం ఏదైనా చేయడానికి రెడీ అవుతున్నారు కొంతమంది. ఏకంగా పాత్ర కోసం సిగరెట్ తాగుతుంటే ఇంకొంతమంది ఏకంగా ఆల్కహాల్ తాగడం లాంటివి కూడా చేస్తూ ఉన్నారు. అయితే విద్యాబాలన్ కూడా ఇలా డర్టీ పిక్చర్ సినిమాలో ఎన్నో సన్నివేశాలలో సిగరెట్ తాగుతూ కనిపిస్తూ ఉంటుంది అన్న విషయం తెలిసిందే.



# క్రీడలు



## కాంపౌండ్ మిక్స్‌డ్ ఫైనల్ భారత్



కాంపౌండ్ ఆర్చరీ మిక్స్‌డ్ ఫైనల్‌కు భారత జట్టు దూసుకెళ్లింది. షాంఘై వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-1లో స్టార్ ఆర్చర్లు అభిషేక్ వర్మ, జ్యోతి సురేఖలతో కూడిన భారత మిక్స్‌డ్ బృందం.. 155151పాయింట్ల తేడాతో మెక్సికో జంటను చిత్తుచేశారు. ప్రపంచ 2వ ర్యాంక్ ఆర్చర్లయిన వీరు కొరియాపై తొలి మూడు గేమ్‌లు ముగిసేసరికి 3పాయింట్ల ఆధిక్యతను సంపాదించారు. నాల్గో గేమ్‌లో 40కి 40పాయింట్లు సాధించడంతో భారత బృందానికి మరో పాయింట్ జత అయ్యింది. 4వ సీడ్‌గా బరిలోకి భారత రికర్వు మిక్స్‌డ్ జట్టు సెమీస్‌లో ఓడి కాంస్య పతకానికి సిద్ధమైంది. శుక్రవారం జరిగిన సెమీస్‌లో అంకిత భకత్, ధీరజ్ బమ్మదేవర జోడీ 0-6 పాయింట్లతో కొరియా చేతిలో ఓడింది. ఏకపక్షంగా సాగిన ఈ పోటీలో భారత జంట 0-6(38-39, 35-36, 36-38)తో ఓటమిపాలైంది. కాంస్య పతకానికి మెక్సికోతో తలపడనుంది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో భారత జంట 5-1తో ఇటలీని చిత్తుచేసి సెమీస్‌కు చేరింది. మహిళల రికర్వు వ్యక్తిగత విభాగంలో దీపిక కుమారి సెమీస్‌కు చేరి మరో పతకం ఖాయం చేసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో దీపిక కుమారి 6-4(27-28, 27-27, 29-28, 29-27, 28-28) తేడాతో కొరియాకు చెందిన జియోన్‌పై విజయం సాధించింది. సెమీస్‌కు చేరడంతో దీపిక కుమారికి పతకం ఖాయమైంది.

## కోహ్లీని పక్కన పెట్టేసిన భారత మాజీ?



జూన్ నెలలో టి20 వరల్డ్ కప్ ప్రారంభం కాబోతుంది. ప్రపంచ క్రికెట్ ప్రేక్షకులు అందరూ కూడా ఈ మెగా టోర్నీ కోసమే వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. యూఎస్, వెస్టిండీస్ వేదికలుగా జరగబోయే ఈ టి20 ప్రపంచ కప్ టోర్నీలో మొత్తంగా 20 జట్లు పాల్గొనబోతున్నాయి అన్న విషయం తెలిసిందే. దీంతో ఇక ఈసారి ఈ వరల్డ్ కప్ పోరు ఎంతో రసవత్తరంగా ఉండబోతుంది అని అభిమానులు అందరూ కూడా అనుకుంటున్నారు. అయితే ఇక ఈ వరల్డ్ కప్ కోసం ఆడబోయే జట్టు వివరాలను ప్రకటించాలి అంటూ ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ఆయా దేశాల క్రికెట్ బోర్డులకి డెడ్ లైన్ విధించింది. దీంతో మరికొన్ని రోజుల్లో అన్ని దేశాల క్రికెట్ బోర్డులు తమ టి20 వరల్డ్ కప్ టీం ను ప్రకటించే ఛాన్స్ ఉంది. అయితే గత కొంతకాలం నుంచి వరల్డ్ కప్లలో సత్తా చాటుతున్న నాకౌట్ మ్యాచ్ లలో లో మాత్రం ఓడిపోతూ అభిమానులను నిరాశ పరుస్తూ వస్తున్న టీమిండియా.. ఇక ఈసారి మాత్రం అద్భుతంగా రాణించాలని అనుకుంటుంది. ఇక టి20 వరల్డ్ కప్ లో అత్యుత్తమ జట్టుతో బరిలోకి దిగేందుకు ప్రణాళికలను సిద్ధం చేసుకుంటుంది. అయితే ఐపీఎల్ లో రాణించిన ఎంతోమంది ఆటగాళ్లకు టి20 వరల్డ్ కప్ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది అన్నది తెలుస్తుంది. ఇది ఇలా ఉంటే బిసిసిఐవరల్డ్ కప్ కు సంబంధించిన జట్టును ప్రకటించక ముందే ఎంతో మంది మాజీ ఆటగాళు తమ అభిప్రాయం ప్రకారం వరల్డ్ కప్ టీం ఏంటి అన్న విషయాన్ని ప్రకటిస్తున్నారు. ఇలా మాజీ ప్లేయర్లు ప్రకటిస్తున్న వరల్డ్ కప్ టీమ్స్ కాస్త సోషల్ మీడియాలో వైరల్ గా మారిపోతున్నాయ్. అయితే ఇటీవలే టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రెకర్ సైతం ఇలా 15 మంది సభ్యులతో కూడిన భారత వరల్డ్ కప్ జట్టును ఎంపిక చేశాడు. అయితే ఈ జట్టులో అటు విరాట్ కోహ్లీని సెలెక్ట్ చేయకపోవడం చర్చనీయంశంగా మారింది. రోహిత్ శర్మ కెప్టెన్ గా, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సూర్య కుమార్ యాదవ్, కృనాల్ పాండ్యా, రవీంద్ర జడేజా, రిషబ్ పంత్, కుల్దీప్ యాదవ్, సంజు శాంసన్, చాహల్, బుమ్రా, ఆవిష్ ఖాన్, సిరాజ్, మయాంక్ యాదవ్, హర్షిత్ రానా లాంటి ప్లేయర్లను తన టి20 వరల్డ్ కప్ జట్టులోకి ఎంపిక చేశాడు సంజయ్ మంజ్రేకర్. అయితే ఫ్యూచర్ కెప్టెన్ అని పిలుచుకునే హార్దిక్ పాండ్యాను ఇక మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీని ఎంపిక చేయకపోవడం గమనార్హం.

## ఐపిఎల్‌లో రికార్డు ఛేదన

## నరైన్, సాల్ట్ విధ్వంసం వృధా



ఐపిఎల్‌లో పంజాబ్ జట్టు రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. కోల్‌కతా జట్టు నిర్దేశించిన 262 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ జట్టు మరో 8బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా జట్టు 261పరుగులు చేసింది. సాల్ట్(75), నరైన్(71) తొలి వికెట్‌కు 10 ఓవర్లలో 138పరుగులు జతచేసి గట్టి పునాది వేశారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ జట్టును ప్రభ్ సిమ్రన్(54), బెయిర్‌స్టో(108నాటౌట్) తొలి వికెట్‌కు 93పరుగులు జతచేశారు. ఆ పరుగులను కేవలం పవర్‌ప్లే(6 ఓవర్లు)లోనే పంజాబ్ జట్టు బ్యాటర్లు సాధించారు. ఆ తర్వాత రూసో(26) విఫలమైనా.. శశాంక్(68నాటౌట్) మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ దిగిన కోల్‌కతాను ఓపెనర్లు ఫిలిప్ సాల్ట్(75), సునీల్ నరైన్(71) అర్ధ శతకాలతో చెలరేగి గట్టి పునాది వేశారు. ఈ ఇద్దరూ తమ విశ్వరూపం చూపిస్తూ.. పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. సాల్ట్, నరైన్‌లు ఎడాపెడా బౌండరీలు బాదడంతో 8 ఓవర్లకే స్కోర్ 100 దాటింది. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న నరైన్‌ను.. రాహుల్ చాహర్ వెనక్కి పంపడంతో 138 పరుగుల వద్ద తొలి వికెట్ పడింది. ఆ క్షణం పంజాబ్ జట్టు కాసింత ఊపిరి పీల్చుకుంది. అకాసేపటికే సాల్ట్ వెనుదిరిగినా.. వెంకటేశ్ అయ్యర్(39 నాటౌట్), ఆండ్రూ రస్సెల్(24) మెరుపులతో 16 ఓవర్లకే స్కోర్ 200 మార్క్ దాటింది. అప్పటికే అదిరిపోయిన పంజాబ్ బౌలర్లపై శ్రేయస్ అయ్యర్(28) సునామీలా విరుచుకుపడ్డాడు. సామ్ కరన్ వేసిన 18వ ఓవర్లో వరుసగా 6, 4, 6, 6 బాది కోల్‌కతాకు భారీ స్కోర్ అందించాడు. ఆ తర్వాత రింకూ సింగ్(5), రమన్‌దీప్ సింగ్()లు ధనాధన్ ఆడడంతో కేకేఆర్ రన్స్ కొట్టింది. చివర్లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(28) వీరవిహారం చేశాడు.

## ట్రావిస్ హెడ్ వీక్నెస్ ఏంటో తెలిసిపోయిందిగా?



ట్రావిస్ హెడ్.. ఈ పేరు చెబితే చాలు బౌలర్లకు నిద్ర కూడా పట్టడం లేదు. ఎందుకంటే అతని బ్యాటింగ్ ఊచకోత ఆ రేంజ్ లో ఉంటుంది. సాధారణంగా బౌలర్లకు వారి బౌలింగ్ పై ఒక ఐడియా ఉంటుంది. ఎలాంటి బంతులను సంధిస్తే వికెట్ దక్కించుకోవచ్చు అని ఒక అవగాహన ఉంటుంది. కానీ ట్రావిస్ హెడ్ విషయంలో మాత్రం బౌలర్ల పప్పులు ఉడకడం లేదు. బంతి ఎక్కడ వేసిన సరే అది బౌండరీ అవతలే కనిపిస్తుంది. సిక్సర్లు ఫోర్ లతో చెలరేగిపోతున్న అతని బ్యాటింగ్ తీరు బౌలర్ల వెన్నులో వణుకు పుట్టిస్తుంది. ఎందుకు బౌలర్లం అయ్యామా అని బాధపడే విధంగా అతను విధ్వంసాన్ని సృష్టిస్తున్నాడు. పూనకం వచ్చిందేమో అన్నట్లుగా బ్యాట్ పట్టుకుని ఊగిపోతూ ఉన్నాడు. దీంతో అతని దూకుడు ముందు స్కోర్ బోర్డ్ సైతం పరుగులు పెట్టి అలసిపోతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అటు సన్రైజర్స్ తరఫున ఓపెనర్ గా బరిలోకి దిగుతూ అతను సృష్టిస్తున్న విధ్వంసం అంత ఇంతా కాదు.. జట్టు విజయాలలో కీలక పాత్ర వహిస్తూ అదరగొడుతున్నారు ట్రావిస్ హెడ్. అదిరిపోయే ప్రదర్శన చేస్తూ ఆకట్టుకుంటున్నాడు అని చెప్పాలి. దీంతో అతనికి ఎక్కడ బంతివేయాలో కూడా తెలియక.. బౌలర్లు అందరూ కూడా అయోమయంలో పడిపోతున్నారు. ఇలా ప్రతి బంతిని బౌండరీకి తరలించే హెడ్ కి కూడా ఒక వీక్నెస్ ఉందట. ఈ క్రమంలోనే ట్రావిస్ వీక్నెస్ పాయింట్ ఇదే అంటూ ఒక న్యూస్ ప్రస్తుతం వైరల్ గా మారిపోయింది. స్పిన్ బౌలింగ్లో హెడ్ తడబడుతున్న ఉన్నాడట. ఇదే వ్యూహంతో ఆర్సిబి కూడా తొలి ఓరే స్పిన్నర్ వీల్ జాక్ తో వేయించింది. అనుకున్నట్లుగానే హెడ్ స్పిన్ ఉచ్చులో చిక్కుకొని వికెట్ సమర్పించుకున్నాడు.


## ధోని నా రోల్ మోడల్:

## ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్?



ప్రస్తుతం ఇతని పేరు ఇండియాలో మారుమోగిపోతుంది. ఎందుకంటే ఇతను సాధించిన ఘనత అలాంటిది. టొరెంటోలో జరిగిన క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ను గెలిచాడు ఇతగాడు. అయితే ఇది గెలవడం కొత్తేం కాదు కదా. ఇప్పటివరకు ఇండియాలో ఎంతో మంది గెలిచారు అని అంటారా. అందరూ గెలిచారు కానీ అతి చిన్న వయసులోనే టొరెంటోలో జరిగిన క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్ ను గెలిచాడు గుకేష్ దోమ్మరాజు. దీంతో అతని పేరు ప్రస్తుతం ఇండియాలో మారుమోగిపోతుంది. ఇక అతని ప్రతిభను అందరూ కొనియాడుతున్నారు. ఇక సోషల్ మీడియాలో ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే ఇటీవల ఈ టోర్నమెంట్లో విజయం సాధించడం ద్వారా ఈ ఏడాది జరిగే ప్రపంచ ఛాంపియన్షిప్ కు అర్హత సాధించాడు గుకేష్ దోమ్మరాజు. ఆ టోర్నీలో ప్రస్తుతం వరల్డ్ ఛాంపియన్గా కొనసాగుతున్న డింగ్ లిరెన్తో పోటీ పడబోతున్నాడు. అక్కడ గెలిచాడు అంటే చరిత్ర సృష్టిస్తాడు అని చెప్పాలి. అయితే ఇటీవలే ఈ టోర్నీ విజేతగా నిలిచిన గుకేష్ దోమ్మరాజు ఇండియాకు చేరుకున్నాడు. ఈ క్రమంలోనే ప్రస్తుతం సోషల్ మీడియా ఓపెన్ చేస్తే చాలు అతని ఇంటర్వ్యూలే కనిపిస్తున్నాయ్. అయితే ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న గుకేష్ దోమ్మరాజు తన స్ఫూర్తి ఎవరు అన్న విషయాన్ని చెప్పుకొచ్చాడు. సాధారణంగా చెస్ ఆటలో కొనసాగుతున్న వారు అదే ఆటలో దిగ్గజాలుగా ఎదిగిన వారిని లేదంటే అత్యున్నత ప్రతిభ కలిగిన వారిని ఇక రోల్ మోడల్ గా తీసుకోవడం చూస్తూ ఉంటాం. కానీ ఇక చెస్ ఆటలో సత్తా చాటుతున్న గుకేష్ దొమ్మరాజు మాత్రం ఏకంగా క్రికెటర్ తనకు రోల్ మోడల్ అంటూ చెబుతున్నాడు. టీమిండియా మాజీ క్రికెటర్ మహేంద్రసింగ్ ధోని తనకు స్ఫూర్తి అంటూ తెలిపాడు. ధోనితో పాటు జకోవిచ్ కూడా తనకు రోల్ మోడల్ అంటూ తెలిపాడు. ఇద్దరు కూడా ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొంటారు. అందుకే వాళ్ళు ఎప్పుడు అగ్రస్థానంలో ఉంటారు. అవసరమైనప్పుడు అత్యుత్తమ ప్రదర్శన చేస్తారు ఈ లక్షణాలు ఉన్నందుకే వారిపట్ల ఆకర్షితుడిని అయ్యాను. వాళ్లే నాకు స్ఫూర్తి అంటూ చెప్పకు వచ్చాడు.

## పంజాబ్ బౌలర్లు తోపులే?



టి20 ఫార్మాట్లో బ్యాటింగ్ చేయడం ఇంత ఈజీనా అని అనిపించే విధంగా ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో బ్యాట్స్మెన్ ల విధ్వంసం కొనసాగుతుంది. కేవలం ఒకే ఒక్క మ్యాచ్లో ఇలా ఒక టీం భారీగా పరుగులు చేసారు అనుకుంటే పొరపాటే.ప్రతి మ్యాచ్ లోను 200 ప్లస్ స్కోర్లు నమోదు అవుతున్నాయి. టీ20 ఫార్మాట్లో ఇలా 200 ప్లస్ స్కోర్ చేయడం అనేది మామూలు విషయం కాదు. ఒకరకంగా చెప్పాలంటే వన్డే ఫార్మాట్లో ఈ స్కోర్ 400 లేదా 450 పరుగులతో సమానం. అయితే ఇంతటి భారీ స్కోర్ చేసిన తర్వాత ఇక టార్గెట్ ను చేదించే జట్టు ఒత్తిడికి లోనవ్వడం చూస్తూ ఉంటాం. కానీ ఐపీఎల్ లో మాత్రం అలా జరగడం లేదు. ప్రతి మ్యాచ్ లో మొదటి బ్యాటింగ్ చేసిన జట్టు 200 కు పైగా పరుగులు నమోదు చేయడం.. ఇక ఆ తర్వాత చేజింగ్కి దిగిన జట్టు కూడా ఒత్తిడికి లోనవ్వకుండా 200కు పైగానే పరుగులు చేయడం చేస్తూ ఉన్నాం. కొన్ని కొన్ని సార్లు ఇక టార్గెట్ ను చేదిస్తే.. మరికొన్నిసార్లు 200 కు పైగా పరుగులు చేసినప్పటికీ కొన్ని పరుగుల దూరంలో ఆగిపోయి ఓటమి చవిచూస్తున్నాయి. అయితే ఇలా మహామహా బౌలర్లు సైతం భారీగా పరుగులు సమర్పించుకుంటూ ప్రత్యర్థి టీమ్ 200 పరుగులు చేయడానికి కారణం అవుతూ ఉన్నారు. అయితే ఈ గణంకాలు చూసుకుంటే వరుస ఓటములతో సతమతమవుతున్న పంజాబ్ బౌలర్లు మాత్రం తోపులే అన్నది అర్థమవుతుంది. ఎందుకంటే మిగతా టీమ్స్ తో పోల్చి చూస్తే పంజాబ్ బౌలర్లు ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లకు తక్కువ పరుగులు సమర్పించుకున్నారు. ఇప్పటివరకు ఐపీఎల్ సీజన్లో 41 మ్యాచ్లు జరగగా.. పంజాబ్ కింగ్స్ ఏ జట్టును 200 పరుగులు చేయనీయలేదు. బెంగళూరుకు ఇచ్చిన 199 పరుగులే అత్యధికం కావడం గమనార్హం. కానీ ఇటీవల కేకేఆర్ తో జరిగిన మ్యాచ్ లో భారీగా పరుగులు సమర్పించుకున్నప్పటికీ ఆ భారీ టార్గెట్ ను చెందింది ఘనవిజయాన్ని అందుకుంది పంజాబ్.

# సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయండి.

**ఈ నెల 30 న జమ్మికుంట కు రానున్న సిఎం రేవంత్ రెడ్డి.**
**కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలి బహిరంగ సభ.**
**వోడితల ప్రణవ్ కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్.**




హుజురాబాద్ ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 27 జమ్మికుంటలో ఈనెల 30 వ తేదీన జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో తొలి భారీ బహిరంగ సభ లో పాల్గొననున్న సిఎం రేవంత్ రెడ్డి.కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకర్గాల్లోనీ ప్రజలు వచ్చి సభను విజయవంతం చేయాలని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ మీడియా సమావేశంలో అన్నారు.సమావేశంలో ప్రణవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి హుజురాబాద్ కు రానున్న రేవంత్ రెడ్డి.గ్రామ గ్రామాన వాడ వాడలా ఇందిరమ్మ ఇళ్లులు ఉన్నాయా,కేంద్రం కట్టించిన డబుల్ బెడ్ రూం ఉన్నాయా అని చూడండి అని అన్నారు.సభకు సంభందించి భారీ ఎత్తున జన సమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, వేసవి కాలం దృష్ట్యా సభకు హాజరయ్యే ప్రజలకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.ఈ సభకు కాంగ్రెస్ పార్టీ అభిమానులు నాయకులు,ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలనీ, సభకు హుజురాబాద్ నుండే కాకుండా పక్కన నియోజకవర్గాలైన హుస్నాబాద్,మనకొండూర్ నియోజకవర్గం నుండి ప్రజలు వస్తున్నారనీ తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలో 5 గ్యారెంటీలను అమలు చేశామని, ప్రభుత్వం ఏర్పడిన 48 గంటలోపే ఉచిత బస్ సౌకర్యం మహిళలకు కల్పించమని తెలిపారు.మాట ఇచ్చాము అంటే మాట నెరవేర్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా ఆగస్టు 15 లోపు 2లక్షల రుణమాఫీ చేస్తానని తెలిపారు.పదేళ్లు అధికారంలో ఉండి మీరు చేయలేకపోయారు అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపు చేసి చూపిస్తామని తెలిపారు. రాష్ట్రంలో మార్పు మొదలైయ్యింది, ఉద్యోగుల్లో మహిళల్లో,రైతుల కళ్ళల్లో ఆనందం చూస్తున్నామని చెప్తున్నారు. ప్రస్తుతం పార్లమెంట్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు గురించి మనం ఆలోచించాలి.ఒకరేమో 5ఏళ్లు ఎంపీగా ఉండి ప్రజాలకు చేసిన అభివృద్ధి శూన్యం.బీజేపి అభ్యర్థి బండి సంజయ్ చేసిన అభివృద్ధి చెప్పుకోక రాముడి ఫోటోతో ఓట్లు అడగాల్సిన దుస్థితి,దేవుడి పేరు మీద ఓట్లు అడుక్కునే స్థితికి దిగజారారు. స్కూళ్ళు, కాలేజీ, కంపెనీ లు పార్లమెంట్ పరిధిలోకి తీసుకువచ్చింది లేదు.2009 లో ఎంపిగా ఉన్న పొన్నం ప్రభాకర్ చేసిన అభివృద్ధి ఇంకా ప్రజల మధ్యలో మదిలో ఉన్నాయి. పాస్పోర్ట్ ఆఫీస్ సౌకర్యం, నవోదయ,గ్రామాల్లో బోర్స్, జమ్మికుంట రైల్వే స్టేషన్ ఆధునీకరణలాంటి అనేక అభివృద్ధి పనులు చేశారు. బిఆర్ఎస్ అభ్యర్థి పరిస్థితి రాష్ట్రంలో కార్ షెడ్డుకు పోయినట్టే అభ్యర్థి కూడా ఇంటికి వెళ్ళలసిన పరిస్థితి వచ్చింది. కరీంనగర్ పార్లమెంటు పరిధిలో కాంగ్రెస్ వర్సెస్ బీజేపి మాత్రమే. జూన్ 3 తారీఖున భారత ప్రధానిగా రాహుల్ గాంధీ ప్రమాణం చేస్తారు. ఇక్కడున్న బీజేపీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ తల్లిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి.ఇలాంటి మాటలు బంద్ చేయాలి.భారీ మెజారిటి తో కాంగ్రెస్ పార్టీగెలుస్తుందని అన్నారు. హుజురాబాద్ స్థానిక శాసన సభ్యుడు కౌశిక్ రెడ్డి కొంత సంస్కారంతో మాట్లాడితే బాగుండేది,మనిషి పెరిగిన ఇంకా నేర్చుకునేది చాలా ఉంధి. వ్యక్తిగతంగా విమర్శలు మానుకోవాలి.మీ పార్టీలో మిమ్మల్ని తిట్టుకుంటున్నారు. అధికారం పోయి, ప్రభుత్వం పోగానే ఆగం ఆగం అవుతున్నారు. మంత్రులపై అవాకులు చవాకులు పేలితే నియోజకవర్గంలో తిరగనివ్వం. పార్టీ అధ్యక్షుడు వెంట ఉంటేనే అర్థం అయ్యింది మీ భవిష్యత్ ఎంటో అని మీరే అర్థం చేసుకోవాలి.డైలాగులతో ప్రజలను మభ్య పెట్టుడు ఆపండి. ఇటివల సోషల్ మీడియాలో ప్రజలలో ఉనికి పోతుంది అని జమ్మికుంట చేనేత కార్మికుల దగ్గరికి వెళ్లి వీడియో తీసి పెట్టారు.మీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు జూలై నుండి సెప్టెంబర్ వరకు ఏందుకు చేనేతలకు




పాత బకాయిలు చెల్లించలేదు. కమలాపూర్ 40 లక్షలు, హుజురాబాద్ 60 నుండి 70 లక్షలు ఎందుకు కార్మికులకు చెల్లించకుండా కాలయాపన చేశారు.చేనేత కార్మికులకు అండగా ఉండేది కాంగ్రెస్ పార్టీ. ఎలెక్షన్ కోడ్ అయిపోగానే వారికి రావాల్సిన బకాయిలను చెల్లిస్తాం.నిజం గడప దాటేలోపే అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది అంటే దానికి ఉదాహరణ బీజేపీ పార్టీ.హిందూ ముస్లిం మత విద్వేషణ రెచ్చగొట్టి విడదీసి ఓట్లు అడుగుతున్నారు.ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 12 నుండి 14 వరకు ఎంపీ సీట్లను తెలంగాణాలో గెలుచు కోబోతున్నమని తెలిపారు.ప్రజలు ఆలోచించి హుజురాబాద్ నుండి పెద్ద ఎత్తున మెజారిటీ ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు. ఈ సమావేశం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మెటీ సమ్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు వేముల పుష్ప లత, పూదరి రేణుక, కాంగ్రెస్ సీనియర్ నాయకులు.ఎర్ర శ్రీనివాస్, సొల్లు బాబు, తవ్వటం రవీందర్, గూడపు సారంగపాణి, మోలుగురి సదానందం, బాలసాని రమేష్, దేశిని ఐలయ్య, సదానందం, దొంత రమేష్ , కొల్లూరి కిరణ్, కుమార్, గూడూరి స్వామి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మిడిదొడ్డి రాజు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు..

## జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి
## ఎన్నికల అబ్జర్వర్ డాక్టర్ ఎం.ఎస్.ప్రియాంక శుక్లా




పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి జిల్లాలో నోడల్ అధికార్లకు,పోలీస్ అధికారులు తమరికి కేటాయించిన విధులను సమన్వయం చేసుకుంటూ ఎన్నిక విధులు ప్రశాంతంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ఎం.ఎస్.ప్రియాంక శుక్లా అన్నారు.

శనివారం రోజున కలెక్టరేట్ లోని కలెక్టర్ వి సి హాల్ లో జరిగిన సమావేశంలోపోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్ సింగ్, వయ్యపరిశీలకులు మనోజ్ అలోయిస్ లక్రా, ధృవ్ భోళా జిల్లా ఎన్నికల అధికారి, గౌతమ్ ఎన్నికల పోలింగ్ సరళి గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలకు లకు వివరించారు. పోలీస్ అధికారులు, ఏ ఆర్ ఓ లు, నోడల్ అధికారులు ఈ సమావేశం పాల్గొన్నారు. మేడ్చల్ మల్కాజ్గిరి నియోజకవర్గం లో స్వేచ్ఛగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు అని అన్నారు. ఎస్ ఎస్ టి , ఎఫ్ ఎస్ టి , వి ఎస్ టి , అకౌంటింగ్ టీం, ఎం ఎం సి , ఎక్స్పెన్జ్ సభ్యులు సమర్ధవంతంగా భాధ్యతలు నిర్వహించాలని జనరల్ అబ్సర్వర్ ఆదేశించారు. ఎఫ్ ఎస్ టి , ఎస్ ఎస్ టి, వి వి టి , వి ఎస్ టి, ఎం సి ఎం సి, ఎం ఎసి ఎం సి , నోడల్ అధికారులు సమన్వయము చేసుకుంటూ పని చేస్తున్నారు అని ఎన్నికల అధికారి, గౌతమ్ తెలిపారు . మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో మొత్తం 3779596 ఓటర్లు ఉన్నారని , జిల్లా లో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు 24 /7 పర్యవేక్షణ చేస్తుంటారని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు అభ్యర్థులు చేసే ప్రతీ ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చెయ్యాలని అధికారులకు ఆదేశించారు. డి సీ పి పద్మ పోలీస్ అబ్జర్వర్ కి వివరిస్తూ ఎన్నికల విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి ఇప్పటికే బ్రీఫింగ్ ఇవ్వడం జరిగింది అన్నారు . పోలీస్ యంత్రంగం సిద్ధంగా ఉందన్నారు . ఎన్నికలకు సంబంధించి గుర్తించిన రూట్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, సరిహద్దు చెక్ పోస్టులలో ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తి నిఘాతో నిరంతరం తనిఖీ లు చేపడుతున్నామని అన్నారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని , తనికీలు ముమ్మరంగా చేయడం జరిగిందన్నారు. ఎం ఎం సి కమిటీ ద్వారా చెల్లింపుల వార్తలను గుర్తించడం ప్రచురణ ముందస్తు అనుమతులు లేకుండా ప్రకటనలను ప్రచారం చెయ్యడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియా లో అభ్యర్థులు రాజకీయ పార్టీ ప్రకటనల వంటివి సకాలంలో ఆమోదిస్తూ , మంజూరు చెయ్యాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ స్లిప్పులను ఓటర్లందరికి పంపిణి జరిగేలా చూడాలన్నారు .

ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించడంపై సమర్ధవంతమైన చర్య తీసుకోడానికి సాధారణ ప్రజలు సి " విజిల్ యాప్ ను ఉపయోగించవచ్చని తెలిపారు. ఈ యాప్ మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ కి సంబంధించిన ఫిర్యాదులను కేవలం 100 నిమిషాలలో పరిష్కరిస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్, డి సీ పి,నిఖిత పంత్, డి సీ పి పద్మ, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, విజేందర్ రెడ్డి, డి ఆర్ ఓ హరిప్రియ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సిబ్బంది పై దాడి చేస్తే కేసులే

హైదరాబాద్, ఏప్రిల్ 27 తమ సిబ్బంది బాగోగులపై టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ దృష్టి సారించారు. ఇటీవల ఆర్టీసీ సిబ్బందిపై వరుస దాడులు జరగడంతో సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరైనా తమ సిబ్బందిపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పలు ఘటనల్లో పదే పదే స్పష్టం చేశారు. ప్రజల కోసం సేవ చేస్తున్న టీఎస్ ఆర్టీసీ సిబ్బందిపై దాడి ఘటనలో బాధ్యులకు జైలుశిక్షతో జరిమానా విధిస్తామని సజ్జనార్ స్పష్టం చేశారు.నిబద్దత, అంకితభావంతో పని చేస్తున్న సిబ్బందిపై దాడులు చేయడం క్షమించరాని నేరం అన్నారు. తమ సిబ్బందిపై కొందరు అకతాయిలు, ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను సంస్థ యాజమాన్యం ఏమాత్రం సహించదని సజ్జనార్ స్పష్టం చేశారు. టీఎస్ ఆర్టీసీ సిబ్బందిపై దాడి ఘటనలో బాధ్యులను గుర్తిస్తే.. వారిపై ఐపీసీ 353 సెక్షన్ ప్రకారం 2 సంవత్సరాల వరకు జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇందుకోసం పోలీస్ శాఖ సహకారం తీసుకుంటాం అన్నారు.దాడులకు పాల్పడుతున్న వారిపై హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తామని హెచ్చరించారు. దాడులు జరిగిన సమయంలో జరిగే బస్సు డ్యామేజీ ఖర్చులను సైతం నిందితుల నుంచి వసూలు చేస్తామని స్పష్టం చేశారు. కనుక ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేసి ఇబ్బందులకు గురికావొద్దు అని ప్రజలకు టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచించారు. ఎంతో నిబద్ధతతో పనిచేసే ఆర్టీసీ సిబ్బందితో మర్యాదగా ప్రవర్తించాలని, క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవడం ఉత్తమమని కీలక సూచనలు చేశారు.

## టీడీపీ ఎంపీ అభ్యర్థికి తృటిలో తప్పిన ప్రమాదం

ధర్మవరం హిందూపురం పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పార్థసారథికి తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. అనంతపురం నుండి మడకశిరకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.పార్థసారథి ప్రయాణిస్తున్న ఫార్చునర్ వాహనం చెన్నేకొత్తపల్లి మండల కేంద్రానికి సమీపానగల ఎన్ హెచ్ 44 వద్ద ఉన్న హెచ్పి పెట్రోల్ బంక్ వద్ద ఐచర్ వాహనం బ్రేక్ వేయడంతో వెనుక వైపు వస్తున్న పార్థసారథి ప్రయాణిస్తున్న ఫార్చునర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో బీకే పార్థసారథి సురక్షితంగా బయటపడ్డారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కాంగ్రెస్, బీజేపీకి ఓటేసిన ఒక్కటే

హైదరాబాద్, ఏప్రిల్ 27 తెలంగాణలో ఈడ చోటే భాయ్ కి ఓటేసినా కేంద్రంలో బడే భాయ్ కి ఓటేసినా ఒకటే అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ విమర్శించారు. బీజేపీ మనకు అక్కరకు రాని చుట్టం అని కొట్టిపారేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర 3 రోజు మహబూబ్ నగర్ కు చేరుకుంది. హైదరాబాద్ నుంచి బయలుదేరిన కేసీఆర్ కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. సాయంత్రం మహబూబ్ నగర్ లో కేసీఆర్ రోడ్డు షో నిర్వహించారు.పార్లమెంటు ఎన్నికల్లో మూడు పార్టీలు పోటీలో వున్నాయి. వీటిలో ఏ పార్టీ మనకు మేలు చేస్తదో ఆలోచన చేయాలి. బీజేపీ మనకేమన్నా మేలు చేసిందా ఈ పదేండ్ల సంది. మోదీ వంద నినాదాలు చెప్పిండు ఒక్కటన్న నిజమైందా? సబ్ కా వికాస్ అన్నడు కానీ సత్యనాశ్ చేసిండు. అచ్చేదిన్ వచ్చిందా సచ్చేదిన్ వచ్చిందా? నేను గెలిస్తే 15 లక్షలు మీ బ్యాంకుల వస్తాయన్నాడు వచ్చినయా? నరేంద్ర మోదీ విశ్వగురువు ఎట్లాయే?పాలమూరు ఎత్తి పోతల కోసం వంద ఉత్తరాలు రాసినం జాతీయ హోదా ఇచ్చిండా..? లక్షలాది ఉద్యోగాలు ఖాళీ ఉన్నాయి నింపిండా..? రైతులకు నల్ల చట్టాలు తెచ్చిండు వందలాది రైతుల మరణాలకు కారణమైండు. తెలంగాణకు ఒక్క నవోదయ పాఠశాల ఇవ్వలేదు. ఈడ చోటే బాయికి ఓటేసినా ఆడ బడే బాయికి ఓటేసినా ఒకటే.. ఏడు మండలాలను ఆంధ్రలో కలిపిన మోదీకి ఎందుకెయాలే ఓటు. బీజేపీ మనకు అక్కరకు రాని చుట్టం. ఆంధ్రాకు నీళ్లు మలుపుక పొమ్మని హారతులు పట్టిన డీకే అరుణకు ఓటెందుకెయ్యాలే..? మాకు ఓటేస్తే నిమిషాల మీద ఇదిస్తాం అదిస్తాం అన్నది కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కావస్తోంది. రైతు బంధు వచ్చిందా? రుణ మాఫీ అయ్యిందా? పంటలకు బోనస్ వచ్చిందా? స్కూటీ ఇయ్యలేదు గానీ లూటీ అయితే నడుస్తాంది. తులం బంగారం ఇస్తామన్నారు ఇచ్చింద్రా? ఆసరా పింఛను పెంచింద్రా. ఫీజు రీఎంబర్స్మెంట్ లేదు. ఓవర్సీస్ స్కాలర్ షిప్ బంద్. ప్రతి విషయంలో ప్రతి స్కీమ్ లో మోసం దగా. నాకండ్ల ముందట్నే తెలంగాణను ఆగం చేస్తానంటే కేసీఆర్ యుద్ధం చేస్తాడు తప్ప నిద్రబోడు. బీఆర్ఎస్ సెక్యులర్ పార్టీ దీన్ని గెలిపించాలని ముస్లింలకు కూడా నేను విజ్ఞప్తి చేస్తున్నా. బీజేపీ గెలిస్తే ఎంతో నష్టం జరుగుతుంది. బీజేపీ కాంగ్రెస్ రొండు ఒకటే. వీళ్లు ఇద్దరు కలిసి భువనగిరిలో బీఆర్ఎస్ ను దెబ్బతీసినాయి. సీఎం స్థాయిలో ఉండి పెగులుపీకుతా ముడ్డి మీది చెడ్డి గుంజుతా జైళ్ల ఎస్తా అంటండు ఇది పద్దతేనా? తెలంగాణ తెచ్చిన నన్ను అట్లా అనుడు మర్యాదేనా? కాంగ్రెస్ పార్టీ వాళ్లు దేవుని మీద ఓట్లు పెట్టి ఓట్లడుగుతాంద్రు. 20 ఎకరాల రైతులు గూడా గోసపడ్డారు. ఐదు ఎకరాలకు మించితే రైతుబంధు ఇయ్యను అంటానవ్ నీ అయ్యా జాగీరా?ఆరో ఎకరం ఏడ బోవాలే..? బీఆర్ఎస్ కు మిరిచ్చే శక్తి మీ శక్తే.. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డిని గెలిపించండి" అని కేసీఆర్ మాట్లాడారు.

## భువనగిరి మినహా అన్ని చోట్ల మద్దతు

హైదరాబాద్, ఏప్రిల్ 27 పార్లమెంట్ ఎన్నికల పొత్తుపై తెలంగాణ కాంగ్రెస్ ప్రయత్నాలు ఫలించాయి. లోక్సభ ఎన్నికల్లో కాంగ్రెస్తో కలిసి నడిచేందుకు కామ్రేడ్స్ సిద్ధమయ్యారు. ఇండియా కూటమిలో భాగమైన సీపీఐ, సీపీఎంను టీ.కాంగ్రెస్ నేతలు మద్దతు కోరారు తెలంగాణలో బీజేపీని ఎదుర్కొనేందుకు కాంగ్రెస్తో కలిసి నడుస్తామని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. అయితే.. ఒక పార్లమెంట్ స్థానంలో మాత్రం షరతులు వర్తి?స్తాయంటున్నారు సీపీఎం నేతలు.తెలంగాణలోని తాజా రాజకీయ పరిణామాలపై సీపీఎం నేతలతో చర్చించామన్నారు సీఎం రేవంత్రెడ్డి. సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వీరయ్యతోపాటు పలువురు కీలక నేతలు సీఎం నివాసంలో రేవంత్రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా.. పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతుపై చర్చించారు. భువనగిరి పార్లమెంట్తో పాటు ఇతర స్థానాల్లోనూ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని సీపీఎం నేతలను కోరినట్లు చెప్పారు సీఎం రేవంత్రెడ్డి. ఎన్నికల్లో మద్దతుకు బదులుగా సీపీఎం నేతల ముందు కొన్ని రాజకీయ ప్రతిపాదనలు పెట్టామన్నారు.సీఎం రేవంత్రెడ్డితో భేటీలో కీలక రాజకీయ అంశాలపై చర్చించామన్నారు తెలంగాణ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం. భువనగిరి పార్లమెంట్ స్థానంలో మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ కోరగా.. దానికి తాము అంగీకరించలేదని చెప్పారు. భువనగిరి సీటు విషయంలో సందిగ్ధం ఉన్నప్పటికీ.. మిగతా 16 స్థానాల్లో కాంగ్రెస్కు సీపీఎం మద్దతు కొనసాగుతుందని ప్రకటించారు తమ్మినేని వీరభద్రం.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యేక స్ట్రాటజీలతో ముందుకెళ్ళి తెలంగాణ కాంగ్రెస్ సక్సెస్ అయ్యింది. ఇప్పుడు అవే స్ట్రాటజీలను పార్లమెంట్ ఎన్నికల్లోనూ అమలు చేయబోతోంది. దానిలో భాగంగా.. సీపీఐ, సీపీఎంతో పొత్తు చర్చలు జరిపింది కాంగ్రెస్. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సీపీఐ, సీపీఎం ముఖ్య నేతలతో చర్చలు జరిపారు. ఆ తర్వాత.. ఇరు పార్టీల నేతలు పొత్తులకు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే పార్లమెంట్ ఎన్నికల్లో మద్దతుపై హైదరాబాద్లో సీపీఎం నేతలతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. సీపీఐ, సీపీఎం నేతలను కూడా ప్రత్యేకంగా ఆహ్వానించడంతో మూడు పార్టీల నేతలు ఈ ఎన్నికల్లో మద్దతుపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పనిచేయాలని మూడు పార్టీల నేతలు డిసైడ్ అయ్యారు. బీజేపీని తెలంగాణలో అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్తో కలిసి పని చేస్తామని సీపీఐ, సీపీఎం పార్టీ నేతలు వెల్లడించారు.

### దశలవారీగా కాంగ్రెస్పై బీజేపీ యుద్ధం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 దేశంలో 7 దశల వారీగా లోక్సభ ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. మూడోసారి అధికారమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ప్రచారంలో దూసుకుపోతోంది. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీ దశలవారీగా కాంగ్రెస్పై ఎన్నికల యుద్ధం చేస్తోంది. ఒక్కో ఫేజులో ఒక్కో అస్త్రంతో కాంగ్రెస్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తొలి, మలి విడత ప్రచారంలో బీజేపీ ప్రయోగించిన అస్త్రాలేంటి? ఇక మూడో ఫేజులో మాత్రం..వీడియో పే రచ్చతో కాంగ్రెస్ ఫ్యూజులు ఎగరగొట్టేస్తామంటోంది.తొలి విడత ప్రచారంలో కాంగ్రెస్పై రామ బాణం ప్రయోగించింది భారతీయ జనతా పార్టీ. 500 ఏళ్ల హిందువుల కలను తామే నెరవేర్చామంది బీజేపీ. అయోధ్యలో రామ మందిర నిర్మాణం కల సాకారం చేశామంటూ కాంగ్రెస్ను ఉక్కిరిబిక్కిరి చేసింది కాషాయ పార్టీ. ఇక రెండో దశ ప్రచారంలో, సంపద పన్ను పేరుతో ప్రజల సొమ్మును కాంగ్రెస్ లాక్కుంటుంది అనే ఆరోపణలతో ప్రచార భేరి మోగించింది బీజేపీ. అమెరికాలో లాగానే భారత్లో కూడా వారసత్వ పన్ను వేస్తే బాగుంటుందని, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు బీజేపీకి ఆయుధంగా మారాయి. వారసత్వ పన్ను పేరుతో దేశ ప్రజల సంపదను కాంగ్రెస్ లాక్కునే ప్రయత్నం చేస్తోందంటూ రెండో విడత ప్రచారంలో మోదీ ఆరోపించారు. ముస్లిం లీగ్ నుంచి ప్రేరణ పొందే కాంగ్రెస్ మేనిఫెస్టోను రూపొందించారని మోదీ విమర్శించారు.ఇక మూడో విడత ప్రచారంలో?మన్మోహన్ వీడియో పే రచ్చ అండ్ చర్చకు తెర లేపింది బీజేపీ. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్. దేశ వనరులపై తొలి హక్కు ముస్లింలదే అన్న మాజీ ప్రధాని మన్మోహన్ వీడియో వెలుగులోకి వచ్చింది. అది బీజేపీకి ఆయుధంగా మారితే?కాంగ్రెస్ను ఆత్మరక్షణలో పడేస్తోంది. దేశ వనరులపై మొదటి హక్కు ముస్లింలదేనంటూ మన్మోహన్ సింగ్ గతంలో అన్నారని మోదీ స్పష్టం చేశారు. ఈ వీడియో చూశాక కాంగ్రెస్కు మాట పడిపోయిందంటూ ఎద్దేవా చేశారు.2009 ఎన్నికల ప్రచారంలో అప్పటి కాంగ్రెస్ ప్రధాని మన్మోహన్ సింగ్ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ వనరులపై తొలి హక్కు ముస్లింలకే ఉంటుందన్నారు ఆయన. దీంతో బీజేపీ ఎదురుదాడి దిగడంతో మన్మోహన్ అలా అనలేదు, అవన్నీ రూమర్లే అని ఇప్పటిదాకా చెప్పుకొచ్చింది కాంగ్రెస్. అయితే తాజాగా ఈ కామెంట్స్పై డిఫెన్స్లో పడిందంటున్నాయి పార్టీ వర్గాలు. ఇలా మూడో దశలో కాంగ్రెస్పై మరో తాజా అస్త్రంతో విరుచుకుపడుతోంది బీజేపీ.

# గోషామహల్ నియోజకవర్గంలో గడ్డం శ్రీనివాస్ యాదవ్ పాదయాత్ర






హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని పాదయాత్రలో భాగంగా శనివారం గోషామహల్ నియోజకవర్గంలోని గోషామహల్ ఏసీపీ ఆఫీస్ నుండి బీఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పాదయాత్ర మొదలుపెడుతూ ఇంటింటి ప్రచారం చేసారు.. ప్రతి ఇంటికి వెళ్తు వారి సమస్యలు తెలుసుకుంటూ, మీ కష్టాలకు తోడుగా ఉంటా, మిలో ఒకడిగా ఉంటా, మీ సమస్యలే తన సమస్యలే భావిస్తాను,అని మాల మైసమ్మ గుడి, ఆర్యాసమాజ్, సెవెన్ టెంపుల్, హనుమాన్ బడా, చక్నవాడి,రజాక్పుర, సీతారాంపేట్, మంఘల్ హాట్, గౌడ్ కె కబార్ తదితర ప్రాంతాలల్లో ప్రచారం నిర్వహిస్తు బిఆర్ఎస్ పార్టీ కి ఓటు వేసి గెలిపించగలరని అభివృద్ధి కై పాటు పడుతనని ఓటర్లను కోరారు.. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు ,మహిళా కార్యకర్తలు, పాదయాత్రలో పాల్గొన్నారు.

# మెదక్ పార్లమెంట్ సేవాదళ్ కో ఇంచార్జిగా యాదగిరి.



మెదక్ ఏప్రిల్ 27 ప్రజాబలం న్యూస్ :- మెదక్ పార్లమెంటుకాంగ్రెస్ పార్టీ సేవాదళ్ కో ఇంచార్జిగా నార్సింగి మండల కేంద్రానికి చెందిన యాదగిరి నియామకం అయ్యారు. హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ చేతుల మీదుగా యాదగిరి నియామకం పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని.. ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. నాపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు, మిద్దెల జితేందర్ కు అయన ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

# భూముల అమ్మకాలతోనే రుణమాఫి

హైదరాబాద్, ఏప్రిల్ 27 మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మల్కాజ్‌గిరి గడ్డపై ఎగిరేది కాషాయ జెండానే అన్నారు ఈటల. మేడ్చల్ అసెంబ్లీ నియోజికవర్గం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో రోడ్ షో నిర్వహించిన ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో భూములు అమ్మకుండా రుణమాఫీ చేస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా అంటూ రేవంత్ ప్రభుత్వానికి ఛాలెంజ్ చేశారు ఈటెల రాజేందర్.మోదీ ఏంది గీడీ ఏంది అన్న కేసీఆర్ పరిస్థితి ఏంటో చూస్తున్నాం. ఈరోజు రేవంత్ రెడ్డి కూడా అలాగే మాట్లాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్క ఆర్టీసీ ఫ్రీ బస్ తప్ప ఇంకే పథకం అమలుకావడం లేదన్నారు. ఒక్క హామీ అమలు చేయకుండా మళ్లీ ఒచ్చి ఓట్లు అడుగుతున్నారు. 17 సీట్లు గెలిపించండి హామీలు అమలు చేస్తా అంటున్నారు. వారు గెలిచేది లేదు మాట నిలబెట్టుకునేది లేదున్నారు ఈటల.అంతకు ముందు కూకట్‌పల్లి కోర్టులో అడ్వకేట్లను కలిసి వచ్చే ఎన్నికలలో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఈటెల రాజేందర్ కోరారు. బార్ కౌన్సిల్ సభ్యులను, న్యాయవాదులను కలిసి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సాధించిన పురోగతులను వివరించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా అయితే డబ్బు, మద్యం నమ్ముకున్నాడో, అదే విధంగా నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ డబ్బును మద్యాన్ని నమ్ముకున్నట్లు కనపడుతుందని ఆరోపించారు. నాలుగు నెలల క్రితం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలకు నేడు చేస్తున్న చేతలకు సంబంధం లేకుండా పోయిందన్నారు. అతి తక్కువ కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలుస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి వేసే ఓటు వాల్యూ జీరో అని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారు దేశంలో చేసేదేమీ లేదని అందుకే అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదంతో ప్రజలే మోదీని, తనని గెలిపిస్తారని ఈటెల రాజేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఇక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో న్యాయవాదులు ముందు వరుసలో ఉండి పోరాడారని, ఆనాడు ఈటెల రాజేందర్ సైతం పోరాటంలో ముందు వరుసలో ఉన్నాడని పలువురు న్యాయవాదులు గుర్తు చేశారు. అదే విధంగా బీజేపీ నినాదం అయిన అబ్ కి బార్ చార్ సౌ పార్, ఫర్ ఎక్ బార్ మోదీ సర్కార్ అనే నినాదానికి తాము సైతం మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్ తెలిపారు.

# సోషల్ మీడియాలోకి కేసీఆర్ ఎంట్రీ

హైదరాబాద్, ఏప్రిల్ 27 భారత రాష్ట్ర సమితి చీఫ్ కేసీఆర్ ఎక్స్, ఫేస్ బుక్, ఇన్ స్టాల్లో ఖాతాలను ప్రారంభించారు. ఇప్పటి వరకూ కేసీఆర్ కు సోషల్ మీడియాలో వ్యక్తిగత ఖాతాల్లేవు. గతంలో ముఖ్యమంత్రి తరపున సీఎంవో ఖాతా ఉండేది. ఇప్పుడు మాజీ అయినందున ఆయన తన అభిప్రాయాలను తెలిపే సోషల్ మీడియా ఖాతా లేకుండా పోయింది. ఈ రోజుల్లో రాజకీయ నాయకులు.. తమ పార్టీ క్యాడర్ తో పాటు ప్రజలకు కనెక్టింగ్ ఉండాలంటే సోషల్ మీడియాలో ఉండాలనుకుంటారు. ఇప్పుడు సోషల్ మీడియాలో ఎంట్రీ ఇచ్చారు. ఎక్స్ లో తొలి పోస్టును టీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించినది పోస్టు చేశారు. ఇతర సోషల్ మీడియాల్లోనూ కేసీఆర్ తన వ్యక్తిగత ఖాతాలను ప్రారంభించారు. ఇప్పటి వరకూ అన్ని రాజకీయ పార్టీల నేతలకూ సోషల్ మీడియా ఖాతాలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడుకు ఎక్స్ లో ఐదు మిలియన్ల ఫాలోయర్లు ఉన్నారు. వైసీపీ అధినేత జగన్ కు రెండున్నర మిలియన్ల ఫాలోయర్లు ఉన్నారు. టీ పీసీసీ చీఫ్ రేంత్ రెడ్డికి ఐదు లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు. ఇలా అన్ని పార్టీల నేతలకూ సోషల్ మీడియాలో పాలోయింగ్ ఉంది. కానీ కేసీఆర్ మాత్రం ఇప్పటి వరకూ సోషల్ మీడియా జోలికి వెళ్లలేదు. రాజకీయాల్లో సోషల్ మీడియా ప్రభావంపై కేసీఆర్ కు మొదటి నుంచి స్పష్టత ఉంది. ఆయన సోషల్ మీడియా ట్రెండ్స్ ను ఎప్పటికప్పుడు కనుక్కుంటూనే ఉంటారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోషల్ మీడియా ద్వారానే చాలా పనులు చక్క బెడతారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను కూడా పరిష్కరించేవారు. బీఆర్ఎస్ పార్టీకి సోషల్ మీడియాలో మంచి ఫాలో యింగ్ ఉంది.

# కరీంనగర్ పార్లమెంటుపై బీఆర్ఎస్ జెండా ఎగరేద్దాం.

**జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మార్నింగ్ వాక్.**

**ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం.**

**కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్.**

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.**



జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 27పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ లో బిఆర్ఎస్ జెండా ఎగరవేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు.శనివారం మార్నింగ్ వాక్ లో భాగంగా జమ్మికుంట డిగ్రీ కళాశాల మైదానంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీగా అమలులో తీవ్రంగా విఫలమైందని అన్నారు. ముఖ్యంగా రైతులకు వ్యవసాయానికి సరిపడా నీళ్లు అందించలేదని అన్నారు. అలాగే రైతుబంధు, రుణమాఫీ బోనస్ లు ఇస్తామని చెప్పి చేతులెత్తేసిందన్నారు. గతంలో పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న బండి సంజయ్ నియోజకవర్గాన్నీ కనీసం తొంగి కూడా చూడలేదు అన్నారు. తెలంగాణ ఉద్యమం లో వినోద్ కుమార్ పాత్ర ఎంతో కీలకం. తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో పర్యాయాలు కేంద్రాన్ని నిలదీశారన్నారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో కరీంనగర్ తో పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత కూడా వినోద్ కుమార్ దే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వమేనని చేతుల ప్రభుత్వం కాదని ఆయన అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో హుజురాబాద్ నియోజకవర్గం తరఫున 50 వేలకు పైచిలుకు మెజారిటీ వినోద్ కుమార్ కు ఇవ్వాలని ఆయన ప్రజలను విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ సమస్యలపై పోరాటం చేయాలంటే అది వినోద్ కుమార్ తోనే సాధ్యమని ప్రజలంతా గుర్తించాలన్నారు. ప్రజల సమస్యలపై పార్లమెంట్లో గొంతెత్తే సత్తా ఉందన్నారు. అనంతరం బైక్ ర్యాలీ ద్వారా జమ్మికుంట పట్టణం తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి వారిని పలకరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్మణ రావు, టిఆర్ఎస్ వీ రాష్ట్ర అధ్యక్షుడు గేల్లు శ్రీనివాస్ యాదవ్, ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వర్ రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బందికి సంబంధించి రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ

## ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ ఎం ఎస్ ప్రియాంక శుక్లా, ఎన్నికల అధికారి గౌతమ్



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 27: మల్కాజిగిరి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బందికి సంబంధించి రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ ఎం ఎస్ ప్రియాంక శుక్లా పర్యవేక్షణలో ఎన్నికల అధికారి గౌతమ్ రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు.

శనివారం జిల్లా కలెక్టరేట్ లోని ఎన్ ఐ సి హాల్ లో మల్కాజ్గిరి జిల్లాకు సంబందించిన ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ సిబ్బందికి సంబంధించిన రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మేడ్చల్, మల్కాజ్గిరి, కుత్బుల్లాపూర్ , కూకట్ పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 2425 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 12230 మందిని రెండవ విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. 2425 పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ ఐ సి సాఫ్ట్ వెర్ వినియోగిస్తూ ఆన్లైన్ లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తీ చేయడం జరిగింది. పిఓ లు , ఏ పి ఓ లు , ఓ పి ఓ లు ఉన్నారని తెలిపారు. ఐదు నియోజక వర్గాలకు గాను 2861 టీమ్స్ ఉన్నాయని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి రెండవ ర్యాండమైజేషన్ కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 2425 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓ పి ఓ లను కేటాయించడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు అభిషేక్ అగస్త్య , విజయేందర్ రెడ్డి, డి ఆర్ ఓ హరిప్రియ, డి ఈఓ విజయ కుమారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జగనాసుర రక్త చరిత్రపై ఎన్డీఏ చార్జ్ షీట్ ఆవిష్కరణ

## సబ్ ప్లాన్ నిధులకు అర్థం లేకుండా చేశారు కూటమి నాయకులు

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులకు అర్థం లేకుండా జగన్ ప్రభుత్వం చేసిందని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వలవల బాబ్జి విమర్శించారు. శనివారం తాడేపల్లిగూడెం ఎం వి ఆర్ గ్రాండ్ లో విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనాసుర రక్త చరిత్రపై ఎన్డీఏ చార్జ్ షీట్ ను ఆవిష్కరించారు. బాబ్జీ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం మీకు అవసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందన్నారు. ఇతర రాష్ట్రాలు లేనివిధంగా పెట్రోల్ డీజిల్ ధరలు పెంచిందని ఆరోపించారు. కరెంటు సభ్యులను పదిసార్లు పెంచిన ఘనత ఏపీలోనే ఉందన్నారు. కేంద్రం ఇస్తున్న రాసిన బియ్యాన్ని సైతం సక్రమంగా అమలు చేయడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగను పురస్కరించుకుని అందించే నిత్యావసర సరుకులు జగన్ ప్రభుత్వం తిలోధకాలిచ్చిందన్నారు. ఇంటింటికి రేష్మి కంపెనీ పేరుతో వ్యాన్లు కొనుగోలు చేసి వేల కోట్లు దుర్వినియోగం చేసిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయకపోగా కుప్పానికి నీరు అందని పరిస్థితి నెలకొందన్నారు. పోలవరం ప్రాజెక్టు నాశనం చేసిందన్నారు. రాజధాని పేరు చెబితే వైజాగ్ ప్రజలు గగ్గోలు పెడుతున్నారన్నారు. రైల్వే జోన్ కు స్థలాలు, సౌకర్యాలు కల్పించకపోవడంతో జోన్ తీసుకురాలేకపోయిందన్నారు. రాష్ట్రం నుంచి 22 ఎంపీ స్థానాలు ఇస్తే స్పెషల్ స్టేటస్ను తుంగలో తొక్కిందని విమర్శించారు. స్పెషల్ స్టేటస్ గురించి కేంద్రంతో మాట్లాడిన సందర్భం లేదన్నారు. ఉమ్మడి కుటుంబం తాడేపల్లిగూడెం నియోజకవర్గం అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఒకసారి అవకాశం ఇస్తే కేంద్రం మెడల్ నుంచి ప్రత్యేక హోదా తీసుకొస్తామని జగన్ చెప్పి నమ్మబలికారన్నారు. మరల అవి చేస్తాం ఇవి చేస్తాం అంటూ ప్రజల ముందుకు వస్తారని, దాని నుంచి ప్రజల్ని మేలుకొలుపే విధంగా ఎన్డీఏ చార్జ్ షీట్ ఆవిష్కరించడం జరిగిందన్నారు. రిషికొండ ఒక ఐకాన్ అని, అటువంటి రిషికొండను తవ్వేసి ఆ గ్రావెల్ ను ఎమ్మెల్యేలు, మంత్రులు అమ్మేసుకున్నారని ఆరోపించారు. ఇక్కడ డిప్యూటీ సీఎం తమ్ముడికి సైతం వందల కోట్ల లబ్ధి చేకూర్చిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. ఈ క్రమంలోని ఎన్నికల్లో ఓటుకు 3000 ఇస్తామని ప్రకటన పాలు పలుకుతున్నారు అన్నారు. కోవిడ్ సమయంలో రెండు లక్షల కోట్లు కేంద్రం ఆహార భద్రత మందుల కోసం ఇస్తే దానిలో సైతం ఎమ్మెల్యేలు లంచం తీసుకున్నారు అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన 12 లక్షల కోట్లతో రెండున్నర లక్షల కోట్లు పథకాల రూపంలో లబ్ది చేకూర్చినట్లు చెబుతుందన్నారు. మిగిలిన 8 లక్షల కోట్లు ఏం చేశారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి నేత ఈతకోట తాతాజీ మాట్లాడారు. టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, కూటమి నాయకులు వర్తనపల్లి కాశి, పరిమి రవికుమార్, కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కీ,,శే రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభోత్సవం




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 27 : మంచిర్యాల జిల్లాలోని మంచిర్యాల మున్సిపాలిటీలో బస్టాండ్ వద్ద,మార్కెట్,ఐ.బి చౌరస్తా,హమాలివాడ, ఓవర్ బ్రిడ్జ్ వద్ద,బెల్లంపల్లి చౌరస్తా ఏరియాల్లో చలివేంద్ర కేంద్రాలను ప్రారంభించిన ట్రస్ట్ సెక్రటరీ కొక్కిరాల సత్యపాల్ రావు,రుక్మిణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మా నాన్నగారు పేరు మీద కొక్కిరాల రఘుపతి రావు ట్రస్ట్ ప్రారంభించడం జరిగింది,ఈ టెస్ట్ ద్వారా మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు10 సంవత్సరాలు సేవా కార్యక్రమాలు అందిస్తామని చెప్పడం జరిగింది. అందులో భాగంగా చలివేంద్రాలు,అంబలి పథకాలు,పట్టు చీరలు,ఇతర కార్యక్రమాలు,చేయడం జరుగుతుంది. ఇది 6 సంవత్సరం పూర్తి అయింది. ఇంకా 4 సంవత్సరాలు చేయడం జరుగుతుంది. అంతేకాకుండా దేవుని ఆశీస్సులు,మీ ఆశీస్సులు ఉంటే ఇంకా ముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐసిసి మెంబర్ చిట్ల సత్యనారాయణ,మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తుమ్మల నరేష్,మంచిర్యాల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదారి తిరుపతి కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి మాజీ ఎంపీ శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా శేర్లింగంపల్లి అసెంబ్లీ , మియాపూర్ డివిజన్ మక్త విలేజ్ లో ఇంటింటికీ వెళ్లి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని , బీజేపి అభ్యర్థి శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు ఎన్నికల ప్రచారం చేయడం జరిగిందని గుండె గణేష్ ముదిరాజ్ మీడియా సమావేశం లో తెలియజేశారు.

## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు

### పార్టీలోకి ఆహ్వానించిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకట స్వామి



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 27 : మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో కార్నర్ మీటింగ్ నిర్వహించిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. చెన్నూర్ మండలానికి చెందిన సుమారు 100 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వివేక్ వెంకట స్వామి,ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్,సూర్య నారాయణ,రాజీ రెడ్డి,స్థానిక కాంగ్రెస్ నాయకులు సుద్దపల్లి సుశీల్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం కమిషన్ పరిధిలో డ్రోన్ వినియోగం పై నిషేధాజ్ఞలు

### రామగుండం పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజీ ఎం శ్రీనివాస్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 27 : రామగుండం కమిషనరేట్ పరిధి పెద్దపల్లి,మంచిర్యాల జోన్ ల పరిధిలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాలకు వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన వివిఐపి,విఐపి,లు హెలికాప్టర్ల ద్వారా రావడం జరుగుతుంది. కావున డ్రోన్ వినియోగం పై నిషేధాజ్ఞలు విధిస్తూ శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ ఐపిఎస్ (ఐజీ)ఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ వినియోగం చేసినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిపి తెలిపారు.

# కాంగ్రెస్ కు ఓటేస్తే ప్రజల పాలు

### బీఆర్ఎస్,బీజేపీకి ఓటు వేస్తే గంగా పాలు

### కాంగ్రెస్ నాయకుడు మూల కిషన్ గౌడ్



పార్లమెంట్ ఎలక్షన్ లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలు బాగుపడతారని,బీఆర్ఎస్, బీజేపీకి ఓటు వేస్తే ఆ ఓటు గంగ పాలవుతుందని మోదెల కాంగ్రెస్ నాయకులు మూల కిషన్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం పలు వార్డులలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ అమలు చేస్తున్నటువంటి కార్యక్రమాలు ప్రజలకు వివరించారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. రాబోయే రోజులలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ను ఆదరించినట్టుగా వంశీ కృష్ణ ను ఆదరించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్,బీజేపీ కి తగిన గుణపాఠం చెప్పాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలోమూల లచ్చన్న గౌడ్,బాకం లచ్చన్న, తోట రమేష్,తోట తిరుపతి,తోట చంద్రశేఖర్,మూల గంగాధర్, శాతరాజు రాజేష్,శాతరాజు శివ,మగ్గిడి రాజేష్,కుమ్మరి తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో,నీటిలో మునిగి మరణించిన హెడ్ కానిస్టేబుల్ ల కుటుంబ సభ్యులకు భద్రత చెక్ అందజేత

### పోలీస్ కుటుంబాలకు అండగా నిలుస్తాం పోలీస్ కమీషనర్ ఐపిఎస్(ఐజీ)ఎం శ్రీనివాస్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 27 : రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆర్మ్డ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ డి.మల్లయ్య ఎ ఆర్ ఎచ్ సి.2836 కెనాల్ నీటిలో మునిగి మరణించగా ఆయన భార్య హేమలత,కుమార్తె శ్రీజ లకి భద్రత ఎక్స్గ్రేషియా చెక్ 8 లక్షలు గోదావరిఖని 2 టౌన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ గుండెపోటు తో మరణించిన బి.సోమరాజు హెడ్ కానిస్టేబుల్ భార్య శోభరాణి, కుమార్తె సాయి ప్రియలకు లకి భద్రత ఎక్స్గ్రేషియా 15,99,160 లక్షల చెక్ ను ఈ రోజు రామగుండం పోలీస్ కమీషనర్ ఐపిఎస్ (ఐజీ)ఎం. శ్రీనివాస్ ఐపిఎస్ తన కార్యాలయం లో వారికి అందజేయడం జరిగింది. శనివారం ఈ సందర్భంగా మరణించిన కానిస్టేబుల్ కుటుంబ ప్రస్తుత స్థితిగతులను సీపీ అడిగి తెలుసుకోవడంతో పాటు,వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసేవిదంగా చూస్తామని తెలియజేశారు. పోలీస్ సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం తో పాటు వారి కుటుంబాలకి అండగా ఉంటామని సీపీ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు,ఏఆర్ ఏసీపీలు ప్రతాప్,సురేంద్ర,ఏఓ అశోక్ కుమార్,సూపరింటెండెంట్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 27 : మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో గూడెం, రంగంపల్లి గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు అల్లంల కుమార్,రేణి సతన్న,దమ్మ సునిల్,అల్లంల నగేష్,అన్నం మూర్తి,అల్లంల మల్లేష్,అల్లంల రవి,అన్నం ప్రేమ్ కుమార్,అల్లంల రమేష్, చందనగిరి తిరుపతి,అల్లంల మల్లన్న,మంచిర్యాలలో ఎమ్మెల్యే నివాసంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తోట మోహన్,మాజీ ఎంపీటీసీ ముత్తే నారాయణ, సీనియర్ నాయకుడు చుంచు నగేష్,చుంచు సంతోష్,అల్లంల చిన్న సతయ్య,తోట వేణు, తదితరులు పాల్గొన్నారు.

## లక్షెట్టిపేటలోని ఎన్నికలకు సంబంధించిన అధికారులతో మీటింగ్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 27: మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని మండల పరిషత్ మీటింగ్ హాల్ లో తహశీల్దారు ఎన్నికల సంబంధించి మీటింగ్ నిర్వహించనయినది. శనివారం ఈ మీటింగ్ లో ఎస్సై చంద్ర కుమార్ సెక్టోరల్ ఆధికారులు సరోజ,మధుసూదన్,మండల పరిషద్ అభివృధి అభికారులు, నాగ చైతన్య, మనిమ్ రావు డి ఈ ఈ.గౌతం,ఏ ఈ సూపర్వైసర్లు పంచాయతీ సెక్రీటరీలు,బూత్ స్థాయి అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలు చేయ వలసిన పనుల గురించి వివరించారు. విటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ గురించి వివరించారు. ఎన్నికల రోజు మే 13 వ తారీఖు కావున ఎండలు విపరీతంగా ఉంటాయి కావున ఓటర్లకు కావలసిన నీడ కొరకు టెంట్ మరియు అందరికీ త్రాగు నీరు ఏర్పాటు చేయ వలసిన గా పంచాయతీ సెక్రటరీలను కోరినారు. ఆరోజున మెడికల్ సిబ్బంది కూడా ఫస్ట్ ఎయిడ్ కిట్ తో పాటు ఓఆర్ఎస్ పాకెట్ లతో పాటు మెడికల్ సిబ్బంది ఉండాలని ఆదేశించారు. ఎస్సై శాంతి భద్రతల పరి రక్షణ గురించి వివరించారు. ఎంపిడిఓ మడం సరోజ ఎన్నికల రోజున అన్ని అరేంజ్మెంట్స్ చేయవలెనని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఇతరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com